ముహూర్తం
శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ దశమి ఉ. 11.09 వరకు, అనంతరం ఏకాదశి; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 9.41 వరకు, అనంతరం ఉత్తరాషాఢ; అమృతకాలం: తె. 5.15 నుండి; వర్జ్యం: సా. 6.31 నుండి 8.19 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, మ. 2.48 నుండి 3.38 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు;

Estd 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి:56 . సంచిక: 330.సోమవారం 12 మార్చి 2018 . హైదరాబాద్ * పేజీలు:12+12 . వెల: 5.00. Published from:Hyderabad|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati|Karimnagar|Kurnool|Suryapet|Anantapur|Nellore|Nizamabad



పెద్దల సభకు ఉద్యమవారధి సంతోష్ కుమార్

● ఇన్నాళ్లు తెరవెనుక.. ఇప్పుడు రాజ్యసభకు ● అధినేత ఆశీస్సులతో అద్భుత వికాసం ● రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు ముందే చెప్పిన ఆంధ్రప్రభ ● బాధ్యత సక్రమంగా నెరవేరుస్తా: జోగినిపల్లి సంతోష్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఉద్యమ వారధి.. కెసిఆర్ గులాబీ జెండా ఎత్తిన నాటినుండీ ఆ అడుగులనే తన జీవనగమ్యంగా చేసుకుని అలుపెరగని సేవలందించిన జోగినిపల్లి సంతోష్‌కుమార్ టిఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ వేయబోతున్నారు. రాజ్యసభకు సంతోష్ అంటూ నెల క్రితమే ఆంధ్రప్రభ మొట్టమొదటగా వెల్లడించింది. గత నెల ఫిబ్రవరి 10 సంచికలో ప్రముఖంగా ప్రచురించింది. ఇపుడు ఇది అక్షరసత్యమైంది. సంతోష్‌ను రాజ్యసభకు పంపాలని టిఆర్ఎస్ అధినేత నిర్ణయించారని, ఢిల్లీ స్థాయిలో అతని సేవలు అవసరమని భావిస్తున్నారని ఆంధ్రప్రభ ముందుగానే చెప్పింది. అధినేత ఆశీస్సులు పుష్కలంగా ఉన్న సంతోష్ తెలంగాణ ఉద్యమంతో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసిన పేరు. చెదరని చిరునవ్వు.. ఆత్మీయత కలబోసుకున్న ఆయనంటే టిఆర్ఎస్ శ్రేణులకు ఒక ఉత్తేజం. సంతన్నగా టిఆర్ఎస్ శ్రేణులు పిలుచుకునే సంతోష్‌కుమార్ తెలంగాణ ఉద్యమదిక్సూచి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ మొదలు అనేకమందితో ఆయనకు ఉద్యమ అనుబంధం ఉంది. సూర్యోదయం కన్నా మొదలయ్యే సంతోష్ దినచర్య అర్ధరాత్రి వరకు కొనసాగుతుందన్నది పార్టీలో ప్రతి ఒక్కరికీ తెలిసిందే. ఉద్యమసేనాని కెసిఆర్‌కు, ఉద్యమకారులకు మధ్య వారధిగా ఉన్నారు. కెసిఆర్ గల్లీలో ఉన్నా.. ఢిల్లీలో ఉన్నా సంతోష్ కూడా తోడుండాల్సిందే. కెసిఆర్ ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించడంతో పాటు పార్టీ, తెలంగాణ ఉద్యమ శ్రేయస్సు కోసం ఆయన తపించారు. చీకటివెలుగులు, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా కెసిఆర్ వెన్నంటి నడిచిన వ్యక్తి సంతోష్. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అలుపెరుగని సైనికుడిగా పనిచేశారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ.. చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ చిన్నవాళ్ళయినా, పెద్దవాళ్ళయినా అందరితో గౌరవంగా ➩ 3వ పేజీలో...

బీసీలకు రాజ్యయోగం

లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్ ముదిరాజ్, జోగినిపల్లి సంతోష్‌కుమార్

● రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్ ● రెండు స్థానాలు బీసీలకు కేటాయింపు ● రాజ్యసభ ఎన్నికల బాధ్యత కేటీఆర్‌కు అప్పగింత 3 లో

టీఆర్ఎస్ఎల్పీ సమావేశానికి హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు





టీఆర్ఎస్ఎల్పీలో రాజ్యసభ అభ్యర్థులు జోగినిపల్లి సంతోష్ కుమార్, లింగయ్య యాదవ్, బండా ప్రకాష్ ముదిరాజ్‌లను పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో తెరాస ప్రధాన కార్యదర్శి కె. కేశవరావు, పార్లమెంటరీ పార్టీ నేత జితేందర్ రెడ్డి

సిట్టింగ్‌లందరికీ టికెట్లిస్తా

● మీ భవిష్యత్తుకు ఢోకా లేదు
106 స్థానాలు గెలుస్తాం ● ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలకు నో డౌట్ ● ఎవరికైనా ఇబ్బందుంటే... నేను కూర్చుని గెలిపిస్తా
● గీత దాటితే వేటే ● సభను అడ్డుకుంటే కఠినంగా వ్యవహరిద్దాం
● టీఆర్ఎస్ఎల్పీ భేటీలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ మధ్య పార్టీ తరపున ప్రైవేట్ ఏజెన్సీలతో రెండు సర్వేలు జరిపించినం. రెండిట్లోనూ వందకు పైగా సీట్లొస్తయని తేలింది. అందరూ బాగా పనిచేస్తున్నరు.. చేయండి.. మనకు 106సీట్లు ఖచ్చితంగా వస్తయి. ఒకవేళ ప్రతిపక్షం బాగా పుంజుకుంటే ఐదు తగ్గి 101సీట్లు వస్తయి.. అంతే. మనం ఖచ్చితంగా గెలుస్తున్నం.. అంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ పునరుద్ఘాటించారు. ఆదివారం ➩ 9వ పేజీలో...

2019 వరకు ఇక్కడే ఉంటా

ఆ తర్వాతే దేశ రాజకీయాల్లోకి: కేసీఆర్

● మనది థర్డ్ ఫ్రంట్ కాదు.. ఫస్ట్ ఫ్రంటే ● అసెంబ్లీ సమావేశాల తర్వాత ఢిల్లీకి వెళ్తా ● ముస్లిం రిజర్వేషన్లపై అవసరమైతే జంతర్‌మంతర్ వద్ద ఎంపీలతో ధర్నా: సీఎం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: 2019వరకు దేశ రాజకీయాల్లో మార్పుకు ప్రయత్నిస్తూనే రాష్ట్ర రాజకీయాల్లో ఉంటానని, వచ్చే ఎన్నికల తర్వాత పూర్తి సమయం దేశ రాజకీయాల్లో గుణాత్మకమార్పు తీసుకొచ్చేందుకే కేటాయిస్తానని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. దేశరాజకీయాలపై ఇప్పటికే సంచలన ప్రకటనలు చేసిన ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణభవన్‌లో ఆదివారం జరిగిన తెలంగాణరాష్ట్రసమితి శాసనసభాపక్ష సమావేశంలో తన రాజకీయ భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. మనది థర్డ్ ఫ్రంట్ కాదు.. ఫస్ట్ ఫ్రంట్ అన్నారు. ఇప్పటి వరకు దేశరాజకీయాలు మూసపద్ధతిలో నడుస్తున్నాయని, ప్రజోపయోగపనులు జరగడం లేదని ఆరోపించారు. దేశంలో కేవలం రెండుపార్టీలు మాత్రమే అధికారాన్ని పంచుకుంటున్నాయన్నారు. కాంగ్రెస్, బిజెపియేతర పార్టీలు దేశంలో మార్పు కోసం ఏకంకావాల్సిన అవసరముందన్నారు. దేశంలో ప్రబలమైన శక్తి రావాల్సిన అవసరముందని, ఆ మార్పు ➩ 3వ పేజీలో...

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి

రైతులకు బీమా

పెట్టుబడి పథకం లెక్కల ప్రకారం వర్తింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రైతుకు రూ.5లక్షల చొప్పున ప్రమాద బీమాను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బీమా పథకాన్ని ముందుగా ఏప్రిల్ ప్రారంభం నుంచి అమల్లోకి తీసుకురావాలనుకున్నప్పటికీ తాజాగా నిర్ణయాన్ని మార్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం, తెలంగాణ విశిష్టతను చాటే మాసం జూన్ కావడంతో ఆ నెల నుంచే అమలుకు సీఎం కేసీఆర్ ఆదేశాలిచ్చారు. ఈ అంశంపై భారతీయ బీమా సంస్థ (ఎల్ఐసీ) అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమావేశమై చర్చించారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులో సీఎం కెసిఆర్ చేసిన ప్రకటన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పెట్టుబడి మద్దతు పథకం కోసం తేల్చిన లెక్కల ప్రకారం రైతులకు రూ. 5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తారు. రైతు దురదృష్టవశాత్తు మృతి చెందితే బీమా మొత్తాన్ని బాధిత కుటుంబానికి చెల్లిస్తారు. ఈ బీమాపై అందరి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుని ముందడుగు వేస్తామని మంత్రి తెలిపారు.

పెట్టుబడి చెక్కులు, పాస్‌బుక్‌లు రెండూ ఒకేసారి

ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభం
వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులకు మార్గదర్శకాలు జారీ 8 లో

మంటల్లో విద్యార్థులు

తమిళనాడు కురంగణి పర్వతాల్లో కార్చిచ్చు
అగ్నికీలల్లో 36 మందికి పైగా... 10
రక్షణ చర్యలకు నిర్మలా సీతారామన్ ఆదేశం
రంగంలోకి వైమానిక హెలికాప్టర్లు



9 లో

అధికారంలోకొస్తే మహిళలకు 33% రిజర్వేషన్లు


పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి

రేపటి బంద్ వాయిదా

ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ ప్రకటన 3



ఏదీ నాటి ద్రావిడ నాయకత్వం




దక్షిణాసియాలోనే తొలి నాగరిక సమాజం
క్రీస్తుపూర్వమే అతిపెద్ద ద్రావిడ రాజ్యాలు
విదేశాలకు నౌకాయానం ద్వారా వాణిజ్యం
చైనాలో 2600చోట్ల దేవాలయాల నిర్మాణం
అతిపెద్ద కొండను గుడిగా చెక్కిన ఘనత
నేడు ఆర్యుల ముందు తలొంచాల్సిన దుస్థితి
అణిచివేతకు గురవుతున్న దక్షిణాది
అధికార పంపిణీలో తేడావల్లే ప్రత్యేక నినాదం

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)
దేశంలో వింధ్యకు దిగువనున్న ద్రావిడులు ఇప్పుడు నాయకత్వ లోపంతో సతమతమౌతున్నారు. ఉత్తరాది ఆర్యపుత్రుల ఆధిపత్యం కింద నలిగిపోతున్నారు. ఒకప్పుడు ద్రావిడులు అత్యంత శక్తివంతమైన జాతిగా గుర్తింపు పొందారు. ప్రపంచంలోనే పలు దేశాలకు వీరు విస్తరించారు. నాగరికత ఆవిర్భవిస్తున్న తొలిరోజుల్లోనే ద్రావిడులు దాన్ని ఒడిసిపట్టుకున్నారు. దక్షిణాసియాలోనే తొలి నాగరిక సమాజంగా ద్రావిడులు ఆవిర్భవించారు. నాగరికతను తాము అనుభవించడమే కాకుండా పరిసర దేశాలకు కూడా దాన్ని విస్తరింపజేశారు. క్రీస్తుపూర్వమే విదేశాలకు ➩ 3వ పేజీలో...

36 మంది ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్ కమిషనర్ అంజనీ కుమార్
సైబరాబాద్‌కు సజ్జన్నార్
వరంగల్ సీపీగా రవీందర్ నియామకం
లా అండ్ ఆర్డర్ ఐజీలు స్వాతి లక్రా, జితేందర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్, సైబరాబాద్, సిద్దిపేట, వరంగల్ పోలీసు కమిషనర్‌లతో సహా 36 మంది సీనియర్ పోలీసు అధికారులను బదిలీ చేస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర ➩ 9వ పేజీలో...



ఎదురులేని జిన్‌పింగ్

● చైనా అధ్యక్షుడికి జీవితకాల అధికారం
● చట్ట సవరణకు పార్లమెంట్ ఆమోదం ● 2962 మంది శాసనకర్తల మద్దతు ● కేవలం ఇరువురి వ్యతిరేకత ● నియంతృత్వం పెచ్చరిల్లే ప్రమాదం ● అంతర్జాతీయ సమాజం విశ్లేషణ

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)
ఇక జిన్‌పింగ్ చైనాకు జీవితకాల అధ్యక్షుడు. 2023లో ఆయన పదవీ విరమణ చేయాల్సిన అవసరంలేదు. బ్రతికున్నంతవరకు ఆయన్ను మాజీ చేసే శక్తిసామర్థ్యాలు చైనాలో మరెవరికీలేవు. దేశాధ్యక్షునిగా కాక చైనా కమ్యూనిస్ట్ పార్టీ విధివిధానాల్లో కూడా మార్పు, చేర్పులు చేసే అవకాశాలు జిన్‌పింగ్‌కు లభించాయి. 1990లో చైనా ఓ నిబంధన విధించింది. దీని మేరకు ఎవరైనా రెండు పర్యాయాలు మాత్రమే అధ్యక్షునిగా చేసే వీలుంది. ఆ తర్వాత పోటీ చేసేందుకు అర్హత ఉండదు. అంతకుముందు ఇలాంటి నిబంధనేదీ ఉండేదికాదు. దీంతో దీర్ఘకాలం ఏకవ్యక్తి ఏలుబడిలో పాలనసాగేది. ఇది కొన్ని సందర్భాల్లో అనధికార నియంతృత్వానికి దారితీసింది. అలాగే సమిష్టి నాయకత్వం ఎదగలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని విధించిన నిబంధనను చైనా ప్రభుత్వం ఆదివారం ఎత్తేసింది. కొన్నాళ్ళుగా ఈ నిబంధన సడలింపుపై తీవ్రస్థాయిలోనే చర్చలు జరిగాయి. చివరకు దీనిపై ఓటింగ్ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఓటింగ్‌కు మొత్తం సభ్యుల్లో ముగ్గురు గైర్హాజరు కాగా 2,964 మంది ఓటింగ్‌కొచ్చారు. వీరిలో ఇద్దరు మాత్రమే ఈ ప్రతిపాదనను ➩ 3వ పేజీలో...



23 దేశాల అధినేతలు, మంత్రులతో భారత ప్రధాని నరేంద్రమోడీ

సౌర విప్లవం రావాలి

2022 నాటికి భారత్ లక్ష్యం 175 గిగావాట్లు

- రాయితీలతో కూడిన సాయం
- సూర్యుని గొప్పదనాన్ని గుర్తించిన వేదాలు
- అంతర్జాతీయ సౌర కూటమి సదస్సులో ప్రధాని నరేంద్రమోడీ

న్యూఢిల్లీ: యావత్ విద్యుత్ ఉత్పాదనలో సౌర విద్యుత్ వాటా పెంచడానికి సోలార్ ప్రాజెక్టులకు రాయితీలతో కూడిన ఆర్థిక సాయం, నష్టభయాలు కాని నిధులకు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. తద్వారా చవకగా విద్యుత్తు, కర్బన ఉద్గారాలకు కోత విధించాలని అన్నారు.

ఆదివారం ఇక్కడ జరిగిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) వ్యవస్థాపక సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ భారత్ 2022 నాటికి పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 175 గిగావాట్ల(జీడబ్ల్యు) విద్యుదుత్పాదన చేస్తుందని ప్రధాని తెలిపారు. ఇది ప్రస్తుత పునరుత్పాదక ఇంధన సామర్థ్యం కన్నా రెండింతలు అధికం. తొలిసారిగా ఐరోపా యూనియన్‌లో పునరుత్పాదక ఇంధన విస్తరణను అధిగమించడానికి సరిపోతుంది.

ఐఎస్ఏ ఆవిర్భావానికి ప్రధాన రూపకర్తగా వ్యవహరించిన మోడీ 121 దేశాలను ఒకతాటిపైకి తీసుకు రావాలని ఆకాంక్షిస్తున్నారు. వ్యవస్థాపక సదస్సులో 10 కార్యాచరణ అంశాలను ప్రస్తావించారు. వాటిలో అన్ని దేశాలకు అందుబాటులో సోలార్ సాంకేతికత, ఫొటోవోల్టాయిక్ సెల్స్ ద్వారా విద్యుదుత్పాదన వాటా పెంపుదల, సౌర విద్యుదుత్పాదన చొరవకు మద్దతుగా నియమ, నిబంధనలు మరియు ప్రమాణాలను ప్రతిపాదించారు.

సౌర పరిష్కారాలను త్వరితగతిన ఆపాదించే విధంగా నియంత్రణలు, ప్రమాణాలను రూపొందించాలని ప్రధాని అన్నారు. నిలకడైన అభివృద్ధి లక్ష్యాలు సాధించేలా సౌర ఇంధన విధానం ఉండాలని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సోలార్ ప్రాజెక్టుల కోసం కన్సల్టెన్సీ మద్దతును అభివృద్ధి చేయాలని అన్నారు. ఎక్సలెన్స్ సెంటర్లతో ఒక విస్తృతమైన నెట్‌వర్క్ సృష్టించాలని ఆకాంక్షించారు.

ఐఎస్ఏ సెక్రటేరియట్‌ను బలోపేతం చేసి, దానిని మరింత ప్రొఫెషనల్‌గా చేయాలని మోడీ ఆకాంక్షించారు. మానవాళి మెరుగుదల కోసం ఇరుకైన ప్రయివేట్ లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. భారత్ పునరుత్పాదక వనరుల నుంచి 175 జీడబ్ల్యు విద్యుదుత్పాదన లక్ష్యంతో ప్రపంచంలో అతిపెద్ద పునరుత్పాదక ఇంధన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఇందులో 100 జీడబ్ల్యు సోలార్ నుంచి 60 జీడబ్ల్యు పవన వనరుల నుంచి వస్తుందని ప్రధాని చెప్పారు. సౌర విద్యుదుత్పాదక లక్ష్యానికి సంబంధించి మేం ఇప్పటికే 20 జీడబ్ల్యు వ్యవస్థీకృత సౌర విద్యుదుత్పాదన సాధించినట్లు తెలిపారు. ఐఎస్ఏ పట్ల భారత్ నిబద్ధతకు నిదర్శనంగా సభ్య దేశాలకు 500 శిక్షణ స్లాట్‌లను సృష్టిస్తున్నట్లు మోడీ చెప్పారు. ఈ రంగంలో పరిశోధన మరియు అభివృద్ధి కోసం ఒక సోలార్ టెక్నాలజీ మిషన్ ప్రారంభించనున్నదని ప్రధాని తెలిపారు.

సౌర విద్యుదుత్పాదనకు చేదోడుగా భారత్ మూడేళ్లలో 28 కోట్ల ఎల్ఈడీ బల్బులు పంపిణీతో 2 బిలియన్ల అమెరికన్ డాలర్లు, 4 జీడబ్ల్యు విద్యుత్ ఆదా చేసినట్టు మోడీ తెలిపారు. ఐఎస్ఏ అనుబంధ 121 దేశాలకుగాను 61 దేశాలు కూటమిలో చేరగా, 32 దేశాలు ఫ్రేమ్‌వర్క్ అగ్రిమెంట్‌ను ఆమోదించాయని చెప్పారు. భారతీయ వేదాలు వేలాది సంవత్సరాల క్రితమే సూర్యుని విశ్వాత్మగా, జీవపోషకంగా పరిగణించాయని తెలిపారు. వాతావరణ మార్పు సవాళ్ళను ఎదుర్కొనే మార్గాల కోసం నేడు అన్వేషిస్తున్న మనం.. ఈ పురాతనమైన సమతూక తత్వాన్ని గమనంలోకి తీసుకోవాలి అని ప్రధాని అన్నారు.


సౌర విద్యుత్ అభివృద్ధి మనలను సుసంపన్నం చేయడమేకాక, భూగోళంపై కర్బన పాదముద్రను చెరిపివేస్తుంది అని మోడీ తెలిపారు. సౌర విద్యుత్‌ను వ్యవసాయం, సోలార్ వాటర్ పంపులు, స్వచ్ఛమైన వంట ఇలా రకరకాలుగా వినియోగించుకోవచ్చునని చెప్పారు. సౌర విద్యుత్ వేర్వేరు వినియోగాలు కనుగొనేందుకు సదరు రంగంలో నవ్యతను మనం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది అని ప్రధాని తెలిపారు. తొలిసారిగా జరిగిన కూటమి సదస్సుకు 23 దేశాల అధినేతలు, 10 మంది మంత్రులు హాజరయ్యారు. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రోన్ సదస్సు సహ ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా మాక్రోన్ మాట్లాడుతూ 2030 నాటికి ఒక టెరావాట్ సౌర విద్యుత్ సామర్థ్యం సాధనకు 1 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు అవసరమని అన్నారు.



సమావేశంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్, భారత ప్రధాని నరేంద్రమోడీ

నిరంతరాయంగా ఓటర్ల నమోదు

- ఈసీకి కేంద్రం సూచన



న్యూఢిల్లీ: ఏడాది పొడుగునా ఓటరు నమోదు ప్రక్రియ సాధ్యాసాధ్యాలపై కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను వాకబు చేసింది. భారతీయ పౌరులకు 18 సంవత్సరాలు రాగానే ఓటర్లుగా నమోదు చేసుకొనే వెసులుబాటు కల్పించాలని ఎన్నికల కమిషన్‌ను అభిప్రాయం కోరింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నియమ, నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఆ ఏడాది జనవరి ఒకటవ తేదీ నాటికి 18 సంవత్సరాలు వయస్సు చేరుకొని ఉంటే ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి అర్హులవుతారు. ఆ తర్వాత పుట్టిన తేదీ కలిగినవారు మరుసటి ఏడాది మాత్రమే ఓటరుగా నమోదు చేసుకొనే వీలు ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 2018, జనవరి ఒకటవ తేదీ తర్వాత 18 సంవత్సరాలు నిండినవారు ఆ సంవత్సరంలో ఎన్నికలు జరిగిన పక్షంలో ఓటరుగా పాల్గొనలేరు.

దీంతో ఓటరు చట్ట సవరణకు ఒక బిల్లు ఇప్పటికే తయారైంది. అయితే 18 సంవత్సరాల వయస్సు చేరుకున్నవారు ఏడాది పొడుగునా ఆయా దినాల్లో ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశాన్ని పరిశీలించడానికి కేంద్రం ప్రస్తుతం నిర్ణయించిందని ప్రభుత్వ ఉన్నతాధికారి, ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఎన్నికల కమిషన్ వద్ద నిపుణులు ఉన్నారు. అంతేకాక ఓటర్లను వారే నమోదు చేస్తుంటారు. కనుక సదరు ప్రతిపాదన ఆచరణ సాధ్యమా కాదా అని వారు పరిశీలించగలరని అధికారులు వివరించారు. అయితే దీనికి రాజ్యాంగ సవరణ చేయాలని భావనలో ప్రభుత్వం ఉన్న కారణంగా గతంలో ఈసీ చేసిన ప్రతిపాదన న్యాయపరమైన అడ్డంకులను చవిచూసింది. కాని ప్రస్తుతం ఒక సరళమైన బిల్లుతో ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని సవరించవచ్చనే అంగీకారానికి ఎన్నికల కమిషన్, న్యాయ మంత్రిత్వ శాఖ వచ్చాయి. దేశంలో ప్రతి ఏడాది 18-19 సంవత్సరాల వయస్సు వారిలో సగటున ఒక కోటి మందికిపైగా కొత్త ఓటర్లు పుట్టుకొస్తున్నారు.

బాలనేరస్థులకు పునరావాసం

- సామాజిక బాధ్యత : సీజే దీపక్ మిశ్రా

కటక్: సమాజం సరైన పునరావాస కార్యక్రమాల ద్వారా బాల నేరస్థులను జనజీవన స్రవంతిలోకి తిరిగి తీసుకు రావాలని భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా తెలిపారు. కుటుంబ సభ్యులు, టీచర్లు, సమాజం తమను సక్రమంగా చూడటంలేదని బాలనేరస్థులు అనేక సార్లు భావిస్తుంటారని జస్టిస్ మిశ్రా చెప్పారు. బాలనేరస్థులకు న్యాయం.. అంశాలు, సవాళ్ళు అనే అంశంపై ఆదివారమిక్కడ జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో సీజే ప్రసంగిస్తూ బాలనేరస్థులను తిరిగి జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చే పునరావాస కార్యక్రమాల్లో వారి కుటుంబం, ఎన్‌జిఒలు పాలుపంచుకోవాలని అన్నారు. ప్రభుత్వాలకు సైతం ప్రధాన భూమిక ఉంటుందని తెలిపారు. సరైన ఉపాధి తోనే బాలనేరస్థులు జనజీవనస్రవంతిలోకి తిరిగి రాగలని చెప్పారు. జువెనైల్ బోర్డుల మేజిస్ట్రేట్‌లు, పోలీసులు, ఇతర అధికారులు వారి వ్యక్తిగత భావోద్వేగాలను తీసుకు రావద్దని చీఫ్ జస్టిస్ సూచించారు. బదులుగా బాల నేరస్థుల న్యాయ చట్టంలో పరామితులు, నియమాలు, మార్గదర్శకాలకు లోబడి వారు ఒక హేతు బద్ధమైన వైఖరిని కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. సదస్సుకు హాజరైన ఒరిస్సా హైకోర్టు చీఫ్ జస్టిస్ వినీత్ శరన్ బాల నేరస్థుల న్యాయ చట్టం నియమాలు, నియంత్రణలను ప్రధానంగా ప్రస్తావించారు.

మిగ్-31 ప్రయోగం సక్సెస్

- అత్యంత శక్తివంతమైనదిగా పుతిన్ ప్రకటన



మాస్కో: మిగ్-31 హైపర్‌సోనిక్ మిసైల్ ప్రయోగం విజయవంతమైందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదర్శ ఆయుధంగా దీనికి నామకరణం చేశాము. వచ్చే తరం కోసం ఈనెలలో కొత్త రకం ఆయుధాలను తీసుకురావడం జరుగుతున్నది. కచ్చితమైన లక్ష్యాన్ని ఛేదించే సత్తా మిగ్-31 మిసైల్‌కు ఉంది. రష్యాకు నైరుతి దిశలో ఉన్న దక్షిణ మిలటరీ జిల్లాలోని ఎయిర్‌ఫీల్డ్ నుంచి దీన్ని ప్రయోగించారు. మిసైల్‌ను ఇద్దరు పైలట్లు జెట్ విమానం లో తీసుకెళ్తున్న వీడియోను రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. నిప్పు రవ్వలు ఎగజిమ్ముతూ నింగిలోకి మిసైల్ దూసుకెళ్తున్న చిత్రాలను వీడియోలో చూడొచ్చు. పుతిన్ వ్యూహంలో కిన్‌జాల్ మిసైల్ అనేది సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడినది ఉండునంది. మార్చి 18న అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో పుతిన్ మిసైల్ ప్రయోగం రాజకీయ వేడిని పుట్టించదని చెప్పుకోవచ్చు. తాము కచ్చితంగా విజయం సాధిస్తామని పుతిన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏయిర్ డిఫెన్స్ సిస్టంకు ధీటుగా పది రెట్లు శబ్దం చేస్తూ దూసుకెళ్లింది. డిసెంబర్ 1న ఓ మిసైల్‌ను ప్రయోగించడం జరిగింది. మిగ్-31 అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయబడిన సూపర్‌సోనిక్ జెట్ అని, భారీ మిసైళ్లను సైతం మోయగల సత్తా దీనికి ఉందని రష్యా ఉప ప్రధాని దిమిత్రి తెలిపారు.

కేంద్ర ఉద్యోగులకు ఆర్బీఐ నుంచి వేతనాలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఉద్యోగులకు ఈ నెల నుంచి రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నుంచి వేతనాలు చెల్లించాలని నిర్ణయించింది. ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన ఈ కుబేర్ విధానంతో వేతనాలు చెల్లించనుంది. ఈ విధానం వల్ల ఉద్యోగులు , పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది. కొత్త విధానంతో ప్రతి నెలా 1వ తేదీ ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమవుతాయి. దీని ఫలితంగా బ్యాంకుల చుట్టూ తిరిగే బాధ ఉద్యోగులకు తప్పుతుంది. పెన్షనర్లకు సంబంధించి ఫిబ్రవరి వేతనాలు మార్చి 1న విజయవంతంగా జమ చేసిన అధికారులు ఈ నెల నుంచి అన్ని ప్రభుత్వం శాఖల ఉద్యోగుల వేతనాలను కూడా జమ చేయనున్నాయి. ఇప్పటిదాకా ఉద్యోగుల వేతనాలు బిల్లులు మొదట ట్రెజరీలకు వెళ్లి అక్కడి నుంచి బ్యాంకులకు , బ్యాంకుల్లో బిల్లు పాసయ్యాక ఖాతాల్లో జమయ్యేవి.ఈ ప్రక్రియకు నాలుగైదు రోజులు పట్టేది. కానీ ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ఈ - కుబేర్ విధానాన్ని అమల్లోకి తెచ్చాక ప్రభుత్వ శాఖల అధికారులు వేతనాల బిల్లులను ఆన్‌లైన్‌లోనే ట్రెజరీలకు పంపుతారు. అక్కడి నుంచి కుబేర్ సాఫ్ట్ వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో బిల్లులను ఉద్యోగుల వారిగా బ్యాంకు ఖాతా నంబర్ , ఐఎఫ్ఐసి కోడ్, ఇతరేత్రా వివరాలను నమోదు చేసుకుని నేషనల్ ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ విధానంతో ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తారు.

జమ్ముూలో సూపర్‌స్టార్



జమ్మూ : తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయం రంగ ప్రవేశం చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కానీ పార్టీ పేరును మాత్రం ఇంకా ఖరారు చేయలేదు. ప్రతీ ఏడాది హిమాలయాలకు వెళ్లొస్తారు సూపర్ స్టార్. అందులో భాగంగానే ఈ పర్యటన నిశ్చయించుకున్నారు. ఆదివారం ఆయన కాశ్మీర్ చేరుకున్నారు. ఆయన రియాసీ జిల్లాలోని శివ్‌కోరిని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. తిరిగి వచ్చిన తరువాత పార్టీ పేరును ప్రకటించే అవకాశం ఉంది. శివ్‌ఖోరి, రియాసిలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తాను దేవున్ని నమ్ముతా అని, రాజకీయ ప్రశ్నలకు ఇది సరైన సమయం కాదని చెప్పుకొచ్చారు. జమ్మూ కాశ్మీర్ నుంచి రిషికేశ్ వెళ్తానని చెప్పారు. ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నా ముందుగా హిమాలయాలకు వెళ్లే అలవాటు ఉందని, అందులోభాగంగానే ప్రతీ ఏడాది వెళ్లి వస్తానంటూ తెలిపారు. బాబా ఆశీస్సులు తీసుకున్న తరువాత పార్టీ విధి విధానాలు వివరిస్తానని చెప్పారు. అవినీతి రహిత పాలన అందించడమే తన ధ్యేయం అని అన్నారు.

జాత్యహంకార దాడులు వద్దు

- కూచిబొట్ల శ్రీనివాస్ సతీమణి సునయన
- వేలాది మంది భారతీయులతో శాంతిర్యాలీ

హూస్టన్ : గతేడాది కన్సాస్‌లోని ఓ బార్‌లో హత్యకు గురైన కూచిబొట్ల శ్రీనివాస్ సతీమణి సునయన తన సహోద్యోగులు, వందలాది మంది భారతీయులతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించారు. కూచిబొట్ల శ్రీనివాస్ 34వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ ర్యాలీ చేపట్టినట్టు సునయన చెప్పుకొచ్చారు. గతేడాది ఫిబ్రవరిలో దుండగుల చేతిలో శ్రీనివాస్ హతమయ్యాడు. అతని సహోద్యోగి అలోక్ మదాసానీ సైతం తీవ్ర గాయాలపాలయ్యాడు. శాంతి ర్యాలీను ద్దేశించి సునయన మాట్లాడారు. ఎందుకు జాత్యాంహకార దాడులకు పూనుకుంటారో అర్థం కావడం లేదు. వారి ఆలోచనా విధానాలతో ఓ నిండు జీవితం బలవుతుందని ఆలోచించడం లేదు. శ్రీనివాస్ పని చేసిన జర్మిన్ హెడ్ క్వార్టర్ నుంచి దాడిలో ప్రాణాలు విడిచిన బార్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. 52 ఆడం చేతిలో శ్రీనివాస్ హత్యకు గురయ్యాడు. కూచిబొట్లను కాల్చే ముందుకు తమ దేశం నుంచి వెళ్లిపో వాలంటూ హెచ్చరించాడని, తరువాత కాల్పులు జరిపి హతమార్చడాని సునయన గుర్తు చేశారు. భర్త చనిపోయినంత మాత్రాన సునయన అలాగే కూర్చో లేదు. జాత్యాంహకార దాడులపై గళం విప్పింది. ఆమె నిర్వహించిన ఈ ర్యాలీ అందరికీ కనువిప్పు కల్గిస్తుంది అని జర్మిన్ సీఈఓ క్లిఫ్టోన్ పెంబెల్ తెలిపారు. అమెరికా అందరినీ ఆహ్వానిస్తున్నది. అందరిలో మార్పు రావాలనే ఉద్దేశంతోనే ఈ ర్యాలీ చేపట్టాను అని సునయన చెప్పుకొచ్చారు. అమెరికాలో నివసిస్తున్న పలు వురు సునయన భర్త శ్రీనివాస్ మృతిపై సంతాపం ప్రకటించారు.

ఎల్లలెరుగని ప్రేమ

- సైకిల్‌పై స్వీడన్ చెలి చెంతకు
- ఇండియన్ లవర్ అద్వితీయ గాథ
- వెండితెరకు ఎక్కించనున్న వారసులు

అతడు ఒడిశాకు చెందిన చిత్రకారుడు. కంటి ముందు మానవమూర్తిని కాన్వాస్‌పైకి ముమ్మూర్తులా ఎక్కించడంలో చేయి తిరిగిన కళాకారుడు. అలా తన ముంగిట నిలిచిన స్వీడన్ యువతి చిత్రపటం రూపొందించాడు. ఆ క్రమంలో ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. వివాహ బంధంతో ఒక్కటయ్యారు. స్వదేశానికి తిరిగి వెళ్ళిపోయిన ప్రేమికురాలితో అనురాగ సంగమానికి ఉత్తరాలు వారధిగా నిలిచాయి. ఇద్దరూ ఒక్కటవుదామనుకున్నారు. అతడి పేదరికం అడ్డంకిగా మారింది. అయినాకానీ చేతిలో కాస్త సొమ్ముతో సైకిల్ కొనుక్కున్నాడు ప్రేమికుడు. అదే సైకిల్‌పై నెలల తరబడి ప్రయాణించి స్వీడన్ చేరుకున్నాడు. ప్రియురాలి తల్లిదండ్రులను ఒప్పించాడు. చిన్నతనంలో ఓ జ్యోతిష్కుడు చేసిన భవిష్యవాణిని నిజం చేస్తున్నట్టుగా అధికారికంగా వివాహం చేసుకున్నాడు. ఎల్లలెరుగనిది ప్రేమ అన్న నానుడిని నిజం చేశాడు. 1970 దశకంలో చోటు చేసుకున్న ఇంతటి ఘనత వహించిన ప్రేమ గాథను వెండితెరకు ఎక్కించడానికి ఈ జంట కలల పంటగా జన్మించిన సంతానం ప్రయత్నిస్తున్నారు.

న్యూఢిల్లీ: ప్రద్యుమ్న కుమార్ మహానందియా అలియాస్ పికె ఒడిశా రాష్ట్రంలోని ఒక కుగ్రామంలో సమాజం అంటరానివారుగా భావించే ఒక పేద కుటుంబంలో జన్మించారు. నీవు ఈ గ్రామం నుంచి కాదు కదా.. ఆఖరికి ఈ దేశానికి చెందని ఒక అమ్మాయిని పెండ్లి చేసుకుంటావు. ఆమె సంగీతజ్ఞురాలు. ఒక అడవికి యజమానురాలు. వృషభ రాశిలో జన్మించి ఉంటుంది... అంటూ ఒక జ్యోతిష్కుడు తాళపత్రంపై రాసిన జాతకం చేతపట్టుకొని తిరగడంతోనే పికె బాల్యం గడిచిపోయింది. ఒడిశాలో అనేక కష్టాలుపడిన తర్వాత చిత్రకళను అభ్యసించడానికి ఢిల్లీ చేరుకున్నారు. హస్తినలో తొలి రోజులు కత్తిమీద సాము చేస్తున్నట్టుగా సవాళ్లతో సాగాయి. కన్నాట్‌ప్లేస్ దగ్గర చిత్రపటాలు గీయడం ద్వారా పికె తనకంటూ ఒక పేరు సంపాదించుకున్నారు. ఇందిరా గాంధీ, ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, వ్యోమగామి వాలెంటీనా తెరెస్కోవా, బి.డి.జట్టి, తదితరుల చిత్రపటాల రూపకల్పనతో ప్రసిద్ధి చెందారు. పికె పేరు విదేశాలకు పాకిపోయింది. చార్లొట్ అనే యువతి పికె పేరు విని ఆయనతో తన చిత్రపటం చేయించుకోవడానికి స్వీడన్ నుంచి వచ్చింది. ఇద్దరు ప్రేమలో పడ్డారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం వైవాహిక బంధంతో ఒక్కటయ్యారు. కానీ చార్లొట్‌కు స్వీడన్‌కు తిరిగి వెళ్ళాల్సిన సమయం ఆసన్నమైంది. మరింత స్థిరపడిన తర్వాత ఆమెను చేరుకోవాలని పికె నిర్ణయించుకున్నారు. భారత్‌లోనే ఉండిపోవాలని నిర్ణయించుకున్నారు. చార్లెట్, పికె మధ్య ఏడాది పాటు ఉత్తరాలు నడిచాయి. స్వీడన్ వెళదామనుకున్నాను. కానీ విమాన టికెట్లు కొనుక్కోవడానికి నా దగ్గర డబ్బుల్లేవు. దాంతో ఉన్నదంతా అమ్మేసి ఇంతకు ముందు ఎవ్వరూ కనీవినీ ఎరుగుని, అనుకోని యాత్రను చేపట్టాలని నిర్ణయించుకున్నాను అని పికె చెప్పారు. ఆయన ఒక సెకండ్ సైకిల్ కొనుక్కున్నారు. గుప్పెడు కుంచెలతో భారత్‌లో తూర్పు కనుమల నుంచి స్వీడన్‌లో అడవులకు యాత్ర చేశారు. నాకు నా తల్లిదండ్రుల ఆశీస్సులు ఉన్నాయి. నా జీవన యానంలో నేను కలిసిన అద్భుతమైన వ్యక్తులు నాకు సాయం చేశారు.





మరీ ముఖ్యంగా స్వీడన్ చేరుకోగలను అన్న ఆత్మవిశ్వాసం నన్ను ముందుకు నడిపింది అని పికె తెలిపారు. ఆయన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, టర్కీ గుండా ఐదు మాసాలు సైకిల్ తొక్కి ఐరోపా చేరుకున్నారు. పికె మార్గ మధ్యంలో రైలులో కూడా ప్రయాణించారు. ఎట్ట కేలకు స్వీడన్‌లో చార్లొట్ తల్లిదండ్రులను కలుసుకున్నారు. అక్కడ ప్రేమికులిద్దరూ అధికారికంగా వివాహం చేసుకున్నారు. స్వీడన్‌లో బొరస్‌లో స్వీడన్ ప్రభుత్వం అజమాయిషిలో కళ, సాంస్కృతిక సలహాదారుగా పికె పనిచేస్తున్నారు. ప్రస్తుతం పికె, చార్లొట్ సంతానమైన ఎమెలీ మహనందియా వోన్ షెడ్‌విన్, సిద్ధార్థలు తల్లిదండ్రుల ప్రేమ కథకు వెండితెర రూపం కల్పించాలని అనుకుంటున్నారు.

బస్సు బడిలో...







- పేద పిల్లల ముంగిట సంచార పాఠశాల
- డ్రాపవుట్లకు విద్యాబోధన
- దేశ రాజధాని న్యూఢిల్లీలో రోడ్డెక్కిన విద్యా రథాలు

న్యూఢిల్లీ: అర్థంతరంగా బడి మానేసిన పిల్లలకు చదువును దగ్గర చేయడమెలా? వారికి చదువు పట్ల ఆసక్తి కలిగించడమెలా? అనే అంతర్మథనం నుంచి పుట్టుకొచ్చాయి సంచార పాఠశాలలు(మొబైల్ స్కూల్స్). మీరు బడికి రాలేకపోతే అదే మీ దగ్గరకు వస్తుంది.. ఇదే సంచార పాఠశాల అనుసరిస్తున్న తారక మంత్రం. ఢిల్లీలో రెండు ఎన్‌జిఒలు కార్పొరేట్ కంపెనీల నిధులతో సంచార పాఠశాలలను నడుపుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు పాత బస్సులను తరగతి గదులుగా మార్చారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడంకోసం వాటిని రెసిడెన్షియల్ కాలనీల్లో తిప్పుతున్నారు. కాలనీల్లోని పార్కుల దగ్గర బస్సులను ఆపుతారు. బస్సులో టీచర్లు విద్యార్థులకు ఉచితంగా పాఠాలు చెబుతారు. సంచార పాఠశాలల కారణంగా విద్యార్థులకు ప్రయాణ దూరం తగ్గుతుంది. వారికి ఇంట్లో బాధ్యతలు చూసుకుంటూనే చదువుకునే అవకాశం లభిస్తుంది అని బటర్‌ఫ్లయిస్ ఎన్‌జిఒ సభ్యులు సుజోయ్ జోసెఫ్ తెలిపారు. సంచార పాఠశాలలు ఢిల్లీ వీధుల్లో చాలా సంవత్సరాలుగా తిరుగుతున్నాయి. కానీ నిధులు పెద్దగా లేకపోవడంతో ప్రస్తుతం నాలుగంటే నాలుగు బస్సులు నడుస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని బస్సులు నడపాలనే ఆశాభావంతో నిర్వాహకులు ఉన్నారు. తమకంటే చిన్నవారైన తమ్ముళ్ళు లేదా చెల్లెళ్ళను చూసుకోవడం నుంచి ఇంటికి దగ్గర్లో పాఠశాలలు లేకపోవడం లాంటి పలు కారణాలతో నగరంలో అర్థంతరంగా చదువు మానేసిన దాదాపు 800 మంది పేద పిల్లలకు సంచార పాఠశాలలు చదువు చెబుతున్నాయని జోసెఫ్ తెలిపారు. ఢిల్లీలో సంచార పాఠశాలలు సదర్ బజార్, ఒఖ్లా మండి, కశ్మీరీ గేట్, చాందిని చౌక్‌లోని ప్రాంతాల్లో విద్యా సేవలు అందిస్తున్నాయి. సంచార పాఠశాలలు విద్యార్థులను వారి ఇంటి దగ్గర ఎక్కించు కుంటాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యాబోధన ఉంటుంది. అనంతరం విద్యార్థులను వారి ఇండ్ల దగ్గర దిగబెడతారు.

ఈ ప్రాజెక్టు మురికివాడల్లో అణగారిన వర్గాలకు చెందిన పిల్లలకు విద్యబోధనకు ఉద్దేశించినది. సంచార పాఠశాలలు పిల్లలకు ఒక కరస్పాండెన్స్ కోర్సు ద్వారా పరీక్షలకు హాజరయ్యే అవకాశాన్ని కలిగిస్తాయి లేదా క్రమక్రమంగా ఒక మామూలు పాఠశాలలో చేరే మార్గాన్ని చూపిస్తాయి. ప్రభుత్వం చేపట్టిన సర్వ శిక్షాభియాన్ విధానం కింద 2001లో సంచార పాఠశాల ప్రాజెక్టు ప్రారంభమైనది. అనంతరం 2011 నాటి విద్యా హక్కు చట్టం కింద అలాంటి పాఠశాలలకు అవకాశం లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేసే ఎన్‌జిఓలకు సంచార పాఠశాలలను అప్పగించడం జరిగింది. విద్యార్థులు వారి దైనందిన కార్యకలాపాలతో పాటుగా చదువుకునే అవకాశాన్ని సంచార పాఠశాలలు కల్పిస్తున్నాయి అని చాందినిచౌక్ సంచార పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న తన్వీర్ అహ్మద్ తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం 2014-15 విద్యా సంవత్సరానికి ప్రాథమిక స్థాయిలో జాతీయ డ్రాపవుట్ రేటు 4.34 శాతం కాగా మాధ్యమిక స్థాయిలో అది 17.86 శాతం ఉంది.

ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం బడి పిల్లలను తిరిగి చదువు బాట పట్టించడానికి ప్రస్తుతం చేపడుతున్న చర్యలను సంచార పాఠశాలలు బలోపేతం చేస్తున్నాయని అహ్మద్ తెలిపారు. పిల్లలు అర్థంతరంగా బడికి రాకపోవడానికి పేదరికం, బడి అందుబాటులో లేకపోవడం రెండు ప్రధాన కారణాలుగా ఆయన చెప్పారు. అది వారికి, ప్రధాన విద్యాస్రవంతికి మధ్య ఒక వారధిగా వ్యవహరిస్తున్నదని ఆయన చెప్పారు. ఢిల్లీలో సంచార పాఠశాల ప్రాజెక్టును బటర్‌ఫ్లయిస్ ఎన్‌జిఒ, మేజిక్ బస్ ఫౌండేషన్ నిర్వ హిస్తున్నాయి. పలు కార్పొరేట్ కంపెనీలు వాటికి అండగా నిలుస్తున్నాయి. ఉత్తరాఖండ్ లాంటి ఇతర రాష్ట్రాల్లో సైతం ఇదే తరహా కార్యక్రమాలు నడుస్తున్నాయి.

ఏదీ నాటి ద్రావిడ నాయకత్వం

(మొదటిపేజీ తరువాయి)

నౌకాయానం ద్వారా వాణిజ్యం నెరపారు. అప్పుడే ద్రావిడ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు వారికున్న అత్యద్భుత శిల్పకళా నైపుణ్యాన్ని కూడా చైనా, కంబోడియా వంటి దేశాల్లో అవిష్క రించారు. అలాంటి జాతికి ఇప్పుడు సమర్థ నాయకత్వం కొరవడింది.

వాస్తవానికి ద్రావిడులు ప్రస్తుతం 24.50 కోట్ల మంది ఉన్నారు. ద్రావిడ సంస్కృతి, సంప్రదాయాలు పాటిస్తూ ద్రావిడ భాషలు మాట్లాడే వారంతా ఈ జాతికిందే వస్తారు. ఒకప్పుడు వింధ్య పర్వతాల దిగువన దక్షిణ భారతావనికే వీరు పరిమితమయ్యారు. ఉత్తరాదిలో నాగరికత వెల్లివిరియక ముందే వీరు పరిసర దేశాలకు కూడా వెళ్ళి అక్కడ స్థిరపడ్డారు. ఇలా ఇప్పుడు మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంక ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, పాకిస్థాన్‌లతో పాటు చైనా, కంబోడియా, మలేషియా, సింగపూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ద్రావిడులు కనిపిస్తారు. క్రీస్తుకు వెయ్యి సంవత్సరాల పూర్వమే అతిపెద్ద ద్రావిడ సామ్రాజ్యాలు ఏర్పాటయ్యాయి. చోళులు, పాండ్యులు, రాష్ట్రకూటులు, చేరులు, చాళుక్యులు తమ సామ్రాజ్యాల్ని విస్తరించారు. దక్షిణగంగ, తూర్పుగంగుల మధ్య కదంబ, హోయసల, పల్లవ, కలభ్ర, శాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండిన, పశ్చిమచాళుక్య, తూర్పు చాళుక్య, మైసూర్, కాకతీయ, జాఫ్నా, నాయక తదితర ద్రావిడ వంశాలు దీర్ఘకాలం రాజ్యాలను ఏలాయి. ద్రావిడులు ఆదినుంచి వాణిజ్యంతో పాటు ఆలయ శిల్పకళా నైపుణ్యంలో అగ్రగాములు. ద్రావిడ సంస్కృతిలో తమిళులే ప్రథములు. వీరు దక్షిణ చైనాతో వ్యాపార సంబంధాలు నెరపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న శిలాశాసనాల మేరకు క్రీస్తుపూర్వం 2600 నుంచి 1900 సంవత్సరాల మధ్యే వీరు లిపిని అభివృద్ధి చేశారు. ద్రావిడులు ప్రత్యేక యుద్ధకళల్ని



అభివృద్ధి చేసుకున్నారు. కళరిపాయట్టు కళ వీరి సొంతం. కొన్ని ప్రత్యేక తరహా ఆయుధాల్ని కూడా వీరే రూపొందించుకున్నారు. ద్రావిడులు ఆదినుంచి శక్తియుద్ధంలో ప్రావీణులు. మహాభారతంలో కూడా ద్రావిడుల ప్రస్తావన ఉంటుంది. రాజసూయయాగ సమయంలో దక్షిణాదికి ప్రత్యేకంగా సహదేవుడ్ని పంపమంటూ మిత్రులు సూచిస్తారు. ఇందుకుగాను కూడా చెబుతారు. దక్షిణాది రాజులంతా శక్తియుద్ధ ప్రావీణ్యులని, అర్జునుడు, భీముడు, నకులుడు ఈ ముగ్గురికి కూడా శక్తియుద్ధంలో పెద్దగా అనుభవం లేనందున సహదేవుడ్ని దక్షిణాదికి పంపాలంటూ పేర్కొంటారు. శిలంబం అనే యుద్ధవిద్యను కూడా ద్రావిడులే అభివృద్ధి చేశారు. ఆరో పల్లవ చక్రవర్తి బోధిధర్ముడు అతిపెద్ద బౌద్ధభిక్షువు. పలురకాల యుద్ధ విద్యలు అభివృద్ధి చేశాడు. ఆయనకే చైనాలో మార్షల్ ఆర్ట్స్‌కు ఆదిగురువుగా భావిస్తారు. అలాంటి ద్రావిడులు చైనాలో సుమారు 2600చోట్ల హిందూ దేవాలయాల్ని నిర్మించారు. ఇందులో శైవా రాధనకు చెందినవే అధికం. క్రీస్తుపూర్వం చైనాలో అతిపెద్ద వాణిజ్య రాజధానిగా ఉన్న రేవు నగరం క్వాంజోవో కెర్నిస్ పల్లవులు అక్కడ ఓ భారీ శివాలయం నిర్మించారు. కొన్ని లక్షల టన్నుల పరిమాణంలోని పర్వతాన్ని ఎంచుకుని దాన్నిలాగే గుడిగా చెక్కారు. దానిపై ద్రావిడ సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన కొన్ని శిల్పాల్ని చెక్కారు. ప్రపంచంలోనే అతిపెద్ద దైవ ప్రార్థనాలయంగా ఉన్న కంబోడియాలోని అంగ్‌కోర్‌వాట్ దేవాలయాన్ని కూడా తమిళులే నిర్మించారు. ఇక్కడి నుంచి వ్యాపారనిమిత్తం కంబోడియా వెళ్ళిన పల్లవ యువరాజు ఆ దేశంలోని ఓ యువతిని ప్రేమించి వివాహం చేసుకుని అక్కడే స్థిరపడ్డాడు. అక్కడి రాజ్యాన్ని వశపర్చుకున్నాడు. వారి సంతానమైన రెండో సూర్యవర్మ 11వ శతాబ్దంలో ఈ ఆలయాన్ని నిర్మించాడు. దీనిపై శాసనాలన్నీ తమిళ భాషలోనే ఉంటాయి. వియత్నాంలోనూ ద్రావిడులు హిందూ దేవాలయాల్ని నిర్మించారు. రష్యాలోని క్రెమ్లిన్ ప్యాలెస్ వద్ద కూడా కొన్ని నిర్మాణాలు చేశారు. అలా ప్రపంచ వ్యాప్తంగా చోళులు, పల్లవులు ద్రావిడ సంస్కృతిని చాటారు.

అలాంటి ద్రావిడులు ఇప్పుడు నాయకత్వ కొరతకు గురౌతు న్నారు. ఆర్యుల ఆధిపత్యం ముందు తలొంచాల్సిన దుస్థితిని ఎదు ర్కొంటున్నారు. స్వతంత్ర్యానంతరం ఉత్తర, దక్షిణ భారతాల మధ్య రాజకీయ అధికార పంపిణీ సమానంగా జరగాలని నాయకులు నిర్దేశించారు. కానీ కొన్ని దశాబ్దాలుగా ఉత్తరాది ప్రాబల్యం ముందు ద్రావిడ జాతి అణివేతకు గురౌతోంది. ఈ కారణంగానే తిరిగి ప్రత్యేక దక్షిణభారతమన్న నినాదం తరచూ వినబడుతోంది. ఆదిలో ప్రధానిగా ఉత్తరాది వారుంటే, రాష్ట్రపతిగా దక్షిణాదివారికి అవకాశ మిచ్చేవారు. రాన్రాను ఈ విధానం కొరవడింది. అదే ద్రావిడుల మనో భావాల్ని ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందంటూ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

బీసీలకు రాజ్యయోగం

- అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్
- సంతోష్, బడుగుల, బండ ప్రకాష్‌లకు ఛాన్స్
- అనూహ్యంగా రెండు స్థానాలు బీసీలకు
- రాజ్యసభ ఎన్నికల బాధ్యత కేటీఆర్‌కు అప్పగింత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక లో టీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు విలక్షణ ముద్రవేశారు. టీఆర్ఎస్‌కు దక్కే మూడు స్థానాల్లో రెండు స్థానాలను బీసీలకే అప్పగించి చరిత్రసృష్టిం చారు. యాదవ, ముదిరాజ్ సామాజికవర్గాలకు ఆదినుంచి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్.. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలోనూ అదే పంథా కొనసాగించారు. టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులుగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినిప ల్లి సంతోష్‌కుమార్ (కరీంనగర్ జిల్లా), పార్టీ రాష్ట్ర కార్యదర్శి బడుగుల లింగయ్యయాదవ్ (నల్లగొండ జిల్లా), పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండ ప్రకాష్ ముదిరాజ్ (వరంగల్ జిల్లా) లను ఎంపికచేసినట్టు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖ రరావు ఆదివారం తెలంగాణభవన్‌లో ప్రకటించారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి అవకాశం తక్కువగా ఉన్న బలహీన వర్గాలకు .. ఇలాంటి అత్యున్నత అవకాశాలు కల్పిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుండి పనిచేస్తూ.. ఆది నుండి పార్టీ కార్యక్రమాలను తెరవెనుక నుండి పర్యవేక్షిస్తున్న జోగినిపల్లి సంతోష్ కుమార్‌కు, ఆయనతో పాటు ఇద్ద రు బిసి నేతలను రాజ్య సభకు పంపాలని టిఆర్ఎస్ నిర్ణ యిం చడంపై పార్టీ వర్గాల్లో, బిసి వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్త మవు తున్నాయి. కాగా రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల నామి నేషన్లు, ఎన్నిక బాధ్యత ను రాష్ట్రమంత్రి కెటిఆర్‌కు సిఎం అప్ప గించారు. సోమవారం ఉదయం 11గంటలకు రాజ్య సభ అభ్యర్ధులుగా నేతలు నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

అనూహ్యంగా..

రాజ్యసభ సీటు కోసం అనేకమంది ప్రయ త్నించినా.. సా మాజికవర్గాల వారీగా కసరత్తులు చేసిన ముఖ్యమంత్రి కెసి ఆర్ భవిష్యత్ రాజకీయా లను దృష్టిలో పెట్టుకుని బిసిలకు పెద్దపీట వేశారు. ఓసి కోటాలో జోగినిపల్లి పేరు ముందే ఖరారు కాగా, యాదవ సామాజిక వర్గానికి కూడా సీటు ఇస్తానని ముందే ప్రకటించారు. మూడో సీటు మైనా రిటీ లేదా రెడ్డి సామాజికవర్గానికి ఇస్తారని ప్రచారం జరిగింది.

రాజ్యసభకు ఖరారైన జోగినిపల్లి సంతోష్‌కుమార్ కెసిఆర్ తోడల్లుడి కొడుకు. ఎంబిఏ చదివిన సంతోష్ టీఆ ర్ఎస్ ఆవిర్భావం నుండి కెసిఆర్ వెన్నంటే ఉన్నారు. సా మాజికసేవాకార్యక్రమాల్లోనే సంతోష్ ముందున్నారు. పార్టీ వర్గాలు సంతోష్ అంటే అత్యంత అభిమానంగా ఉంటాయి.

ఇక బడుగుల లింగయ్యయాదవ్ నల్లగొండ జిల్లా కేతే పల్లి మండలం భీమారం గ్రామానికి చెంది న నేత. బి.ఏ.బిఈడి చదివిన లింగయ్య 1982లో టిడిపి లో చేరారు. 2015వరకు ఆ పార్టీలో అనేక పదవులు ని ర్వ హించారు. 1998నుండి 2012వరకు నల్లగొండ జిల్లా టిడిపి అధ్యక్షునిగా పనిచేసిన లింగయ్య, 2015 మార్చి లో సిఎం కెసిఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

బండ ప్రకాష్ ముదిరాజ్ వరంగల్ జిల్లా వాసి కాగా, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పనిచేస్తున్నారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షునిగా కూడా వ్యవహరిస్తున్నారు. గతంలో కాంగ్రెస్‌లో పనిచేసిన ఆయన కు ముదిరాజ్ సామాజిక వర్గంలో బలమైన పట్టు ఉండ డంతో పాటు జాతీయ స్థాయిలోనూ సంబంధా లున్నాయి.

బీసీ సంక్షేమ సంఘం హర్షం

రాజ్యసభకు ఇద్దరు బీసీ అభ్యర్థులను ప్రకటించ డంపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం హర్షం ప్రకటించింది. ఇద్దరు బీసీలకు అవ కాశం కల్పించిన ముఖ్యమంత్రి కె చంద్రశేఖ రరావు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. బీసీల్లో అతిసాధార ణమైన పేదకుటుంబాలనుండి వచ్చిన బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాష్ ముది రాజ్‌లకు అవకాశం కల్పించడం చాల అభినందనీయమని ఆదివారం ఒక ప్రకటన లో హర్షం ప్రకటించారు.



పేరు: జోగినిపల్లి సంతోష్‌కుమార్
భార్య: రోహిణి
పిల్లలు: ఇషాన్, శ్రేయాన్
పుట్టిన తేదీ: 21.07.1975
వయస్సు: 42సంవత్సరాలు
చదువు: ఎంబిఏ, ఎంపిఎం
స్వగ్రామం: కొదురుపాక, బోయినపల్లి (మం), చొప్పదండి నియోజకవర్గం, కరీంనగర్ జిల్లా
ప్రస్తుత పదవి: టిఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి



పేరు: బండ ప్రకాష్ ముదిరాజ్
వయస్సు: 63
కులం: ముదిరాజ్ (బిసి-డి)
చిరునామా: నందిహిల్స్, హంటర్‌రోడ్, వరంగల్
విద్యార్హతలు: ఎం.ఎ, పిహెచ్‌డి
ప్రస్తుత పదవి: టిఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు



పేరు: బడుగుల లింగయ్యయాదవ్
వయసు: 60
కులం: గొల్లకుర్మ
చిరునామా: భీమారం గ్రామం, కేతేపల్లి మండలం,నల్లగొండజిల్లా
గతంలో నిర్వహించిన పదవులు: టిడిపి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి
టిఆర్ఎస్‌లో చేరిక: 2015
ప్రస్తుతం: టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి

ఎదురులేని జిన్‌పింగ్

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించారు. మిగిలిన 2,962 మంది కూడా జీవితకాల అధ్యక్ష విధానాన్ని ఆమోదిం చారు. వాస్తవానికి గత ఏడాది చివర్లోనే జిన్‌పింగ్ రెండోసారి అధ్యక్షుడయ్యారు. 2022చివరివరకు ఆయన ఆ పదవిలో కొనసాగే అవకాశముంది. అయినప్పటికీ జిన్‌పింగ్ అనుచరులు ఈ నిబంధన ఎత్తివేత కోసం గట్టిగానే పట్టుబట్టి సాధించుకున్నారు. దీంతో మావో తర్వాత ఆ స్థాయిలో అధికార చక్రాన్ని తిప్పగలిగే అవకాశం జిన్‌పింగ్‌కు లభించినట్లయింది. చైనా కమ్యూనిస్ట్ పార్టీలో జిన్‌పింగ్ ఆలోచనా విధానాల్ని చేర్చాలన్న ప్రతిపాదనకు మద్దతు లభించింది. దీనివల్ల ప్రస్తుత ప్రభు త్వంలో ఆయనకున్న అసమ్మతిని సునాయాశంగా తుంచే యిచ్చు. ప్రత్యర్థులు ఆయన్ను ఏ విధంగానూ సవాల్ చేయలేరు. కనీసం ఆయనకు ఎదురుపడి ప్రసంగాలు కూడా చేయలేరు.



తాజా నిర్ణయంతో చైనాలో సరికొత్త రాజకీయ శకం ఆవిర్భవించినట్లే. మావో తొలితరం కమ్యూనిజానికి బీజాలేస్తే మలితరం కమ్యూనిజానికి జిన్‌పింగ్ ఆద్యుడిగా మారినట్లే. మావో తరంలో చైనాను ఏకతాటిపైకి తెచ్చారు. అంతవరకు ఆ దేశం అంతర్గత అసమ్మతితో కొట్టుమిట్టాడేది. తరచూ ఘర్షణలు, అంతర్యుద్ధాలు జరిగేవి. మావో చేపట్టిన సంస్కరణలతో బలమైన ప్రభుత్వం ఏర్పాటైంది. అన్నివర్గాల్ని ప్రభుత్వం తన అధీనంలోకి తెచ్చుకోగలిగింది. పైకి ఐక్యతగా కనిపించినప్పటికీ చైనా ఇనుప చట్రం కింద బిగించబడింది. అదే సమయంలో ప్రపంచంలోనే ఆ దేశం అత్యంత వేగంగా పురోగమించడం మొదలెట్టింది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, వ్యాపార సామ్రాజ్యాల విస్తరణ జోరందుకుంది. ఒకప్పుడు సైనికపరంగా శక్తివంతంగా మారిన చైనా ఇప్పుడు వాణిజ్యపరంగా అగ్రగామిగా ఎదిగే ప్రయత్నం చేస్తోంది. ఈ దశలో పార్టీ విధివిధానాల్లో కీలకమార్పుల్ని తెచ్చే అవకాశం జిన్‌పింగ్‌కు లభించింది. అతత్వరలోనే చైనాలో మావోకు సరిసాటి నాయకుడిగా జిన్‌పింగ్ అవతరించే అవకాశాల్ని ఇది కల్పించింది. తొలి ఐదేళ్ళ పాలనలో జిన్‌పింగ్ పరిమితులకు లోబడే విధాన నిర్ణయాల్ని తీసుకోవాల్సి వచ్చింది. దీంతో ఆయన్ను వ్యతిరేకించే వర్గం బలపడింది. గత ఎన్నికల్లో జిన్‌పింగ్ రెండోసారి పార్టీ అధ్యక్షుడు కాకుండా ఈ వర్గం పలు ప్రయత్నాలు చేసింది. అయితే పొలిట్‌బ్యూరోలో స్పష్టమైన ఆధిక్యత ఉండడంతో పాటు అసమ్మతి నాయకుల మధ్య అనైక్యత జిన్‌పింగ్‌కు కలిసొచ్చింది. ఇకముందు ఈ పాటి సమస్య కూడా లేకుండా, అసలు అసమ్మతే తలెత్తకుండా అధికారపరంగా కూడా అణగదొక్కేసే అవకాశం ఆయనకొచ్చింది. ఇది చైనా అంతర్గత వ్యవహారమే అయినప్పటికీ ఉత్తరకొరియా తరహాలో ఆ దేశంలో కూడా పరోక్ష నియంతృత్వ విధానాలు పెచ్చరిల్లే ప్రమాదం లేకపోలేదని తాజా పరిణామాలపై అంతర్జాతీయ సమాజం విశ్లేషిస్తోంది.

ఉద్యమవారధి సంతోష్ కుమార్

(మొదటిపేజీ తరువాయి)

మెలుగుతారు. ఉద్యమసమయంలో తనకు అప్పగించిన బాధ్యతలను ఎక్కడా తేడారాకుండా పూర్తిచేసేవారు. కెసిఆర్‌ను కరీంనగర్‌లో అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలిస్తున్న ఉద్వేగభరిత వాతావరణంలోనూ తొట్రుపాటుకు అవకాశం లేకుండా.. సంయమనంతో వ్యవహరించి అధినేతతోనే కలిసిసాగారు. క్రమశిక్షణగల సైనికునిగా 18ఏళ్ళుగా అధినేత అప్పగించిన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతకాలం రాజకీయంగా ఏ పదవులు ఆశించకుండా నిస్వార్థంగా పార్టీకి సేవలందించిన సంతోష్ తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంటరై.. పెద్దల సభలో అడుగుపెట్టబోతున్నారు.

మానవత్వానికి ప్రతీక

కేవలం తెలంగాణ ఉద్యమం, టిఆర్ఎస్ రాజకీయాలకే సంతోష్ పరి మితం కాలేదు. ఎవరికి ఎపుడు ఆపద వచ్చినా ఆదుకునే వ్యక్తిత్వం సంతోష్‌ది. ఉద్యమసమయంలో అయినా, ఇపుడు ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా నిగర్విగా పేరు తెచ్చుకున్నారు. మెరుగైన చికిత్సకోసం సంబంధిత ఆస్ప త్రులతో సమన్వయం చేయడం.. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి లబ్దిపొం దందుకు అర్హులైతే వారికి సిఎంఆర్ఎఫ్ నుండి సహాయం అందేలా చూడడం, పేద విద్యార్థులకు స్వయంగా ఆర్థిక సహాయం అందించడంతో పాటు తెలంగాణ ఉద్యమసమయంలో వందలమంది విద్యార్థులకు సహాయం చేసి తన దాతృత్వం చాటుకున్నారు. దేవనార్ అంధుల పాఠశాలకు తరచూ వెళ్లడంతో పాటు వారి యోగక్షేమాలను కనుక్కొని ఆర్థికసాయం అందిం చారు. సమాజహితానికి తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన హరిత హారంలో కూడా చురుకైన పాత్ర పోషించారు.

బాధ్యత సక్రమంగా నెరవేరుస్తా: సంతోష్ కుమార్

తనను రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికచేయడం సంతోషంగా ఉందని, సీఎం కెసిఆర్ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన సంతోష్‌కుమార్ తెలిపారు. రాజ్యసభ అభ్య ర్థుల ప్రకటన అనంతరం తెలంగాణభవన్‌లో ఆయన ఆంధ్రప్రభతో మాట్లాడారు.

నేటి నుంచే బడ్జెట్ సమావేశాలు

- ఉదయం ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్
- అనంతరం శాసనసభ, మండలి బీఏసీల సమావేశం
- 8 కీలక బిల్లులు సభ ముందుకు
- గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నా.. సమావేశాలకు అడ్డుతగిలితే వేటే..
- 15న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఈటల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర బడ్జెట్ సమా వేశాలు ఈ నెల చివరివరకు జరిపే అవకాశం కనిపి స్తోంది. సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్న సమావేశాల తొలిరోజు ఉదయం 10 గంటలకు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. అనంతరం శాసనసభాధిపతి మధుసూదనాచారి, శాసనమండలి అధ్యక్షుడు స్వామిగౌడ్‌ల అధ్యక్షతన వేర్వేరుగా జరిగే శాసనసభ, శాసనమండలి సలహా మండలి(బీఏసీ) సమావేశం జరగనుంది. ఈ సమావే శాలకు ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు అధ్యక్షత వహించనున్నారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హరీష్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఉప సభాపతి పద్మాదేవేందర్, కాంగ్రెస్ తరపున ఆ పార్టీ శాసనసభా పక్ష నేత కుందూరు జానారెడ్డి, ఉపనేత పి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు,ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం తరపున ఆ పార్టీ శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, భారతీయ జనతాపార్టీ తరపున ఆ పార్టీ శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి, తెదేపా తరపున పార్టీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు పాల్గొనే అవకాశముంది.

భాజపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతూ బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి పాదయాత్రగా అసెంబ్లీకి, శాసన మం డ లికి చేరుకుంటారు. తెదేపా ఎమ్మెల్యేలు సైతం ఎన్టీఆ ర్ ఘాట్‌లో ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నివాళు లర్పించి శాసనసభా సమావేశాలకు హాజరవుతారు.

సభను అడ్డుకుంటే సస్పెన్షనే...

సోమవారం జరిగే గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకున్నా, అంత రాయం కలిగించినవారిని బడ్జెట్ సమావేశాల నుంచి సస్పెన్షన్ వేటు వేసేందుకు అధికారపక్షం తెరాస సిద్ధమవుతోంది. గవర్నర్ ప్రసం గించే సమయంలో నినాదా లు చేసినా..రన్నింగ్ కామెంటరీ చేసినా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో చివరి, పూర్తిస్థాయిగా జరిగే ఈ బడ్జెట్ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశాల్లో ఎనిమిది కీలక బిల్లులను సభ ముందుకు తెచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మరోవైపు అత్యంత కీలకమైన రైతు రుణమాఫీ, నిరుద్యోగ సమస్య, రైతుల ఆత్మ హత్యలు, తాగునీటి ఎద్దడి, బలవన్మరణాలు, శాంతి భద్రతల సమస్యలు, అవినీతి, రైతు సమన్వయ సమి తుల నియామకాల్లో జరిగిన అక్రమాలు, విద్యార్థుల సమస్యలు వంటి ముఖ్యమైన అంశాలను చర్చిం చారని సోమవారం జరిగే బీఏసీ సమావేశంలో కాం గ్రెస్,తెదేపా,బీజేపీలు పట్టుబట్టే అవకాశం ఉంది. విపక్షాలు ప్రస్తావించే అన్ని అంశాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని.. ఎన్ని రోజులుంటే అన్ని రోజులు సభను నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటిం చనుంది. సాధారణంగా బడ్జెట్ సమావేశాలు ఉమ్మడి రాష్ట్రంలో 40 రోజుల పాటు జరిగేవి. రాష్ట్రం విడిపోయాక పనిదినాల సంఖ్యను కుదించి 20 నుంచి 25 రోజుల పాటు సభను నడుపుతోంది. సోమవారం గవర్నర్ ప్రసంగం పూర్తయ్యాక ఉభయసభలు మంగళ వారానికి వాయిదాపడతాయి. బుధ, గురు వారాల్లో ప్ర శ్నోత్తరాల అంశంతో పాటు స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్చలకు శాసనసభ, శాసనమండలిలు అవకాశం ఇవ్వనున్నాయి. ఈ రెండు రోజుల్లో గవ ర్నర్ ప్రసంగంపై ఆయా పక్షాలు ఆయా సభలలో చర్చి స్తాయి. బుధవారం ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు గవర్నర్ ప్రసం గానికి ధన్యవాదాలు తెలుపుతూ సుదీర్ఘ ప్రసంగం చేసేందుకు పూర్తిస్థాయిలో సిద్ధమ వుతున్నారు. ఈ సందర్భంగా ఆయన తాను ప్రతిపాదించిన కొత్త ఫ్రంట్‌పై శాసన సభ వేదికగా అనేక అంశాలను ప్రస్తావిస్తారని తెలుస్తోంది. 15వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. శాసనమండలిలో విద్యాశాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి బడ్జెట్‌ను సభ ముందుంచుతారు. అనంతరం రెండ్రోజులు సభ వాయిదాపడి తిరిగి 19వ తేదీన సమావేశాలు ప్రారంభమవుతాయి.

సమావేశాలకు రేవంత్ వచ్చేనా..?

తేదేపాను వీడి కాంగ్రెస్‌లో చేరిన వికారాబాద్ జిల్లా కొడం గల్‌శాసనసభ్యుడు ఎనుముల రేవంత్‌రెడ్డి బడ్జెట్ సమా వేశాలకు హాజరు కావాలా? లేదా? అన్నది తేల్చుకోలేకపోతున్నారు. ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేశానని రేవంత్ ఇప్పటికే ప్రకటించినా రాజీనామా లేఖ శాసనసభాధిపతికి చేరలేదని తెరాస వర్గాలు ఆరోపిస్తున్నాయి. తెదేపాను వీడేసమయంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సంబంధిత లేఖను పార్టీ అధినేత చంద్రబాబుకు అందించానని రేవంత్ చెబుతున్న సంగతి తెలిసిందే.

ఒకవేళ శాసనసభ సమావేశాలకు రేవంత్ హాజరైతే ఏ స్థానంలో కూర్చుంటారు? అన్న ఆసక్తి నెలకొని ఉంది. కాంగ్రెస్‌లో చేరిన ఆయన ఆ పార్టీ సభ్యులకు కేటాయించిన స్థానాల్లో కూర్చుంటారా? లేక గతంలో తెదేపాలో ఉన్న సమయంలో కేటాయించిన ప్రాంతంలో ఆసీనులవుతారా? అన్నది చర్చనీ యాంశంగా మారింది. శాసనసభ సమావేశా లకు హాజరు కావాలా? లేదా? అన్న దానిపై ఇంత వరకూ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కాంగ్రెస్ శాసన సభాపక్షం మాత్రం రేవంత్‌ను సమావేశాలకు హాజరు కమ్మని కోరినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం ద్వారా తనకు వచ్చే జీతభత్యాలను కూడా ఆయన తీసు కోవడం లేదని శాసనసభలోని బ్యాంకు ఖాతను కూడా ఆయన రద్దు చేసుకున్నారని తెలుస్తోంది.

అసెంబ్లీ సమావేశాలకు చతుర్ముఖ వ్యూహం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావే శాలకు పోలీసులు అత్యంత కట్టు దిట్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నారు. అసెంబ్లీ తో పాటు పరిసర ప్రాంతాలలో చీమ చిటుక్కు మన్నా తెలుసుకునేందుకు వీలుగా చర్యలను ముమ్మరం చేశారు. బందోబస్తు ఏర్పాట్ల కోసం దాదాపు రెండు వేల మంది పోలీసులను నియమిస్తున్నామని చెప్పినప్పటికీ రెట్టింపు బలగాలను వినియో గించుకునేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

ప్రస్తుత ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ సమా వేశాలు కావడం, విపక్ష పార్టీలన్నీ ఈ సమా వేశాలలోనే ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సమా యాత్తం కావడంతో బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎన్నికల సందర్భంగా టిఆర్ఎస్ ప్రజల కిచ్చిన వాగ్ధానాలను నెరవేర్చక పోవడం పట్ల కొన్ని వర్గాలు ప్రభు త్వంపై ఆగ్రహంతో ఉన్నాయి. ఈ సమావేశాలలోనే వర్గీకర ణపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఎంఆర్ పిఎస్ బంద్‌కు పిలుపునిచ్చింది. నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీ ముట్టడికి బిజెపి యువమోర్చ కార్య కర్తలను సమాయాత్తం చేస్తోంది. రైతు రుణ మాఫీ విషయం లో ప్రభు త్వ వైఫల్యాన్ని ఎండగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే పోరాటం ముమ్మరం చేసింది. ఇదే విష యాన్ని అసెంబ్లీలో నిలదీసి ప్రభుత్వ వైఖరిని ప్రజలకు తెలియజేసేందుకు పార్టీ సమాయాత్తమవుతోంది.

బిసిల విషయంలో ప్రభుత్వ నిర్లిప్త వైఖరిపై గళమెత్తాలని టిడిపి సభ్యుడు ఆర్. కృష్ణయ్య నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలు ఏ క్షణంలోనైనా అసెంబ్లీ ముట్టడి, చలో అసెంబ్లీ లాంటి కార్యక్రమాలకు పిలుపు నిస్తే అడ్డుక ునేందుకు సన్నద్ధంగా ఉండేలా సిబ్బందికి విధులను కేటాయిం చారు. ఏ వైపు నుంచి అసెంబ్లీకి వచ్చేందుకు వీలు లేకుండా పలు చోట్ల బారికేడ్లను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ భవనం ఎదురుగా శాశ్వత బారి కేడ్లకు తోడుగా తాత్కా లికంగా మరో బారికేడ్‌ను సమావేశాల సంద ర్భంగా ఏర్పాటు చేసే అధి కారులు ఈసారి ఇందుకు అనుగుణంగా ఆకాశవాణి కేంద్రం ముందున్న రోడ్ డివైడర్‌లోనూ బారికేడ్లను ఉంచారు. అదే విధంగా పబ్లిక్ గార్డెన్ బస్టాప్‌ను మూసి వేసి అశ్వకదళాన్ని మొహరింప చేయా లని నిర్ణయించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అసెంబ్లీ బందోబస్తు కోసం ప్రత్యేకంగా ఎసిపిని నియమించిన ప్రభుత్వం ఆయన పర్య వేక్షణలో అసెంబ్లీ ఇన్నర్ బందోబస్తు బాధ్యతలను కట్టబెట్టారు. అసెంబ్లీ పరిసర ప్రాంతాలను స్థానిక పోలీసుల పర్యవేక్షణలో ఉంచగా, ఇందిరాపార్క్, పబ్లిక్ గార్డెన్, బషీర్‌బాగ్ తదితర ప్రాంతాలలో ప్రత్యేక పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు. అసెంబ్లీకి నాలుగు వైపుల బందోబస్తు పర్యవేక్షణ బాధ్య తలను నలుగురు ఎసిపిలకు అప్పగించారు.

బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు

శివార్లలో చెక్‌పోస్టులు

మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకు అనుమతి నిరాకరించిన పోలీ సులు సభకు ఎవరూ తరలి రాకుండా ఉండేందుకు వీలుగా రెండు రోజుల క్రితం శివార్లలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యేంత వరకు ఈ చెక్‌పోస్టులను కొనసాగిం చాల ని నిర్ణయించారు. ఇందిరాపార్క్, బాగ్‌లింగంపల్లి తది తర ప్రాంతాలలో ప్రత్యేక అవుట్ పోస్టులను కూడా ఏర్పాటు చేస్తున్నారు.



2019 వరకు ఇక్కడే ఉంటా

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొస్తానన్న నమ్మకం ఉందన్నారు. బడ్జెట్ సమావేశాల తర్వాత ఢిల్లీ వెళ్తానని, ముస్లిం రిజర్వేషన్లపై ఇప్పటికే మన ఎంపీలు పార్లమెంట్‌లో పోరాడుతు న్నారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే తాను ఢిల్లీ వెళ్ళి వివిధ పార్టీల నేతలను కలిసి ముస్లిం రిజర్వేషన్ల పెంపు ఆవశ్యకతను వివరిస్తానన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు.. ప్రత్యామ్నాయ అవసరాలపై భావసారూప్య పార్టీలతో మాట్లాడుతానన్నారు. రిజర్వేషన్ల అంశంపై అవసరమైతే ఎంపీలతో కలిసి ఢిల్లీలో ధర్నా చేస్తానన్నారు. రిజర్వేషన్లపై రాష్ట్రాలకే హక్కులుండాలని, కేంద్రం తీరు దీనిపై సరిగాలేదన్నారు.

థర్డ్ ఫ్రంట్ అవసరం: డీఎస్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రిజర్వేషన్ల అంశాన్ని రాష్ట్రాలకే వదిలి వేయాలని టీఆర్ఎస్ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో విలేకరుల సమా వేశం నిర్వహించిన ఆయన హర్యానా, పంజాబ్, మహారాష్ట్రతో సహా పలు రాష్ట్రాలు రిజర్వేషన్ల అంశంపై పోరాటం చేస్తున్నా యని అన్నారు. కేంద్ర పరిధిలో ఉన్న రిజర్వేషన్లను ఎస్టీలకు 6 నుంచి 10 శాతానికి, మైనార్టీలకు 4 నుంచి 12 శాతా నికి పెంచా లని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. నేరు గా సీఎం కేసీఆర్... పీఎం మోడీ, హోంశాఖ మంత్రికి ఈ అం శంపై నివేదించామని చెప్పారు. మాజీ ప్రధాని నరసింహారావు హయాంలో కేంద్ర పంచాయతీ రాజ్ శాఖలో రిజర్వేషన్లకు సం బంధించి పలు సవరణలు చేసిన అంశాన్ని డీఎస్ గుర్తు చేశారు.

విద్యార్థుల పరీక్షల నేపథ్యంలో బంద్ వాయిదా

ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ మాదిగ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో మంగళవారం నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విరమించుకుంటున్నట్లు ఎంఆర్‌పిఎస్ నేత మంద కృష్ణ మాదిగ ప్రకటించారు. వారాసిగూడలోని ఎం ఆర్‌పిఎస్ కార్యా లయంలో ఆదివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లా డుతూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. బంద్‌కు మద్దతు పలికిన పార్టీలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని, ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై వత్తిడి తేవాలన్నారు. బిల్లును పెట్టాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రభుత్వానికి లేఖ రాయాలని ఆయన డిమాండ్ చేశారు. వర్గీకరణపై ప్రధానమంత్రికి లేఖ రాశామని రాష్ట్ర మంత్రి కడియం శ్రీహరి ప్రకటించారని, లేఖలు ఎప్పుడు రాశారన్న వివరాలను బహిర్గతం చేయాల న్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలంటూ వ తేదీన ఢిల్లీలో ధర్నా చేస్తామన్నారు. సోమవారం నుంచి వర్గీకరణ కోసం ఎంపిలు మాట్లాడకపోతే మాదిగలకు శత్రువులుగా గుర్తించి రాజకీయ భవిష్యత్ లేకుండా చేస్తామన్నారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

కొత్త చెప్పులు

కొత్త చెప్పులు కరవడం
వేళ్ళకు పొక్కులు రావడం
సహజమే గాని
ఇవాళటి పరిస్థితి కాస్త భిన్నం.

ఎన్నో జతలు తీయించి
వాటిని ఎంపిక చేశాను.
గోధుమ వన్నె కప్పులతో
నల్ల పచ్చ తురాయి కుచ్చులతో
డిజైన్ చేసినవాడు కళావతంసుడే.

తొడిగినప్పుడు
స్నేహంగానే వున్నాయి
నా పాదాలు వాటికి కొత్తే
నచ్చి ముద్దు పెట్టుకుంటున్నాయో
నచ్చక కొరుకుతున్నాయో
తేల్చడం కష్టం!
అరవిందాలు కాదు గాని
నా పాదాలు వందలాది మైళ్లు నడిచిన
కష్టజీవి యాత్రా కావ్యాలు
వాటికి చరిత్ర కాబట్టదు కాబోలు.



ఓ రోజు రాత్రి
మెలకువ వస్తే అవి
నా గురించే
మాట్లాడుకుంటున్న స్ఫురణ.


అరె! రేపటి నుంచి వీటిని
వేరువేరు చోట్ల
విడవాలనుకున్నాను.
తెల్లారినంక ఆలోచిస్తే
జంటను విడదీయడం
పాపం అనిపించింది.
అందాన్నే చూస్తున్నాను గాని
వాటి కిర్రు చప్పుడులో
ఏదో సందేశం ధ్వనించింది నాకు.

వాటి ఉంగరాల్లో వేళ్ళు జొనిపి
వెడల్పు చేశాను.
బిగుసుకున్న కప్పులను
లాగుతూ వొదులు చేశాను.
కొబ్బరి నూనెతో ప్రేమగా రుద్దాను.
వాటిలో ఏదో హాయిని గమనించాను.
అంతే!
అవి నా పాదాలను
ప్రేమించడం ప్రారంభించాయి.

- డా॥ ఎన్.గోపి
9391028496

కాలంతో పరుగులెందుకు?!

కాలమా...ఎందుకా కవ్వింతలు!
నాతోనా నీ తుళ్లింతలు
పరిహసించకు నన్ను
పరుగులెత్తించకు నన్ను
కాలంతో పోటీ నాకెందుకు?
నీతో పరుగెత్తితే ఒరిగేదేమిటి?
అలుపు సొలుపుల నిస్సత్తువ తప్ప!
నువ్వొక మాయాజాలానివి
నువ్వొక కుళ్లు మోతు గాలానివి
నువ్వెవ్వర్నీ ప్రశాంతంగా ఉండనివ్వవు
నీతో పరుగులు పెట్టాలని శాసిస్తావు
లేకుంటే మనుగడ లేదని శపిస్తావు



పరుగెత్తి ఓడిపోవాలని ఆశిస్తావు
గమ్యంలేని ఆ గమ్యానివి నువ్వు
ఆగాలన్నా ఆగలేని అశక్తివి నువ్వు
ఆద్యంతాల్లేని నిర్వికారివి నువ్వు
నేనలా కాదు...నాకలా వీలు కాదు
నా పరుగుకి ఓ గమ్యం
నా పరుగులో ఓ మర్మం
నాకు నేనే ఓ భవబంధం
వీటితో ముడిపడి ముందుకు సాగాలి
అయినా ఏదో ఓ రోజు

అగమ్య జీవితం అనృత ఫలం!
అందుకే నీతో పోటీకి రాను రాను
రాలేక కాదు..రాకూడదని రాను!
ఇద్దరం పరిగెత్తాలని కోరుకోకు
అది ప్రకృతి ధర్మం కాదు
కాలచక్రం కదులుతుండాలి
మానవధర్మం నిలకడగానే ఉండాలి!


నేనెక్కడో ఓ చోట ఆగాలి
అదే నా గమ్యం అవుతుంది
ఆగకుంటే నాదీ అగమ్యమవుతుంది

- వయ్యస్సారెస్
9000013367

శతవసంతాల అనువాద ప్రబంధం

తిరుపతి వేంకట కవుల బుద్ధ చరిత్రము

చాలాకాలం క్రితం వరకూ మనదేశములో బౌద్ధమతమనగా ఒక నిరీశ్వర వాదమైన దుర్మతమనే పిచ్చి ఊహ ప్రచారములో నుండెడిది. అది వైదిక సంస్కృతి మీద వచ్చిన తిరుగుబాటు మతమనీ నాస్తిక భావ ప్రాతిపదికగలదని ఇట్లా ఎన్నో దుష్ప్రచారాలు కూడా ఆ మతం మీద జరిగినవి. 18వ శతాబ్ది ప్రారంభం వరకూ ఆసియాలో బౌద్ధమతమనే యొక మతమున్నదనే సంగతే యూరోపులో చాలా మందికి తెలియదనే విషయం చాలా ఆశ్చర్యకరమంటాడు. సర్ ఎడ్విన్ ఆర్నల్డ్(Sir, Edwin Arnold) తన కృతియైన ది లైట్ ఆఫ్ ఏసియా (The light of Asia) అనే కావ్యానికి వ్రాసిన అపూర్వమైన పీఠికలో "A generation ago little or nothing was known in Europe of this great faith of India which had nevertheless existed during twenty four centuries and at this day surpasses in the number of its followers and the area of its prevalence any other form or creed" బుద్ధుని జీవితాన్ని గురించి వచ్చిన మొదటి జీవిత చరిత్ర, అశ్వఘోషుని ''బుద్ధ చరిత్ర'' తరువాత క్షేమేంద్రుడు ''బుద్ధజననము''అనే గ్రంథము రచించాడు. విశేషమేమంటే ఇవి రెండూ ''పాళీ'' భాషలో గాక సంస్కృత భాషలో రచింపబడినవి. ఆ తరువాత కొన్ని శతాబ్దాల అనంతరం బుద్ధుని జీవితము విషయముగా, ఆంగ్ల సాహిత్యములో బాగా ప్రాచుర్యాన్ని సంతరించుకున్న గ్రంథం సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ (క్రీ.శ. 1832-1904) క్రీ.శ. 1879లో ప్రచురించిన ''దిలైట్ ఆఫ్ ఏసియా''. ఆర్నాల్డ్ తన కావ్యానికి "The Great Renunciation" (MAHABHINISHKRAMANA) అనే ఉపనామం (Sub title)తో సహా క్రీ.శ. 1885లో రెండవ ప్రతిని ముద్రించాడు. అది మొదలు ఈ గ్రంథం ఎన్నో ముద్రణలను పొంది ఎంతో మంది చదువరులచే ప్రశంసింపబడింది. సి.వి. రామన్, విశ్వేశ్వరయ్య, రాధాకృష్ణన్ లాంటి మేధావులెందరో దీన్ని ఒక పారాయణ గ్రంథంగా చేసుకున్నారంటే ఆశ్చర్యము లేదు. "Edwin Arnold's light of Asia, became one of my favourate books" అని 'ది డిస్కవరీ ఆఫ్ ఇండియా'(The Discovery of India)లో వ్రాసుకున్నాడు నెహ్రూ. ఇంతటి గొప్ప పుస్తకాన్ని క్రీ.శ. 1902 లోనే శతావధానులు తిరుపతి వేంకట కవులు తెలుగులో 'బుద్ధచరిత్రము' అనే పేరుతో ఒక ప్రబంధంగా అనువదించారు. బుద్ధ చరిత్రము ఒక వంద సంవత్సరాల క్రిందనే తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప అనువాద ప్రబంధం. శతాధిక గ్రంథములను వ్రాసి ప్రచురించిన తమ స్వతంత్ర గ్రంథములతో బాటు వారు రెండు అనువాద గ్రంథములను గూడా రచించారు. అందొకటి -ఆర్నాల్డ్ కవి ఆంగ్ల కావ్యానికి ''బుద్ధ చరిత్ర''మనే పేరుతో తిరుపతి వేంకట కవులు జేసిన తెలుగు అనువాద ప్రబంధము ఒకటైతే, రెండవది సంస్కృత 'దేవీభాగవతము'నకు ఆంధ్రానువాదము. శతావధానుల ఈ రెండు అనువాద కృతుల్లో ''బుద్ధ చరిత్రము'' ఆనాడు ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో పరిణతి సాధించిన పండితులనే గాక, బౌద్ధమతాన్ని గురించి తెలుసుకోవాలని ఆకాంక్షకలిగిన సామాన్యులను గూడా అలరించింది. ఈ అనువాద ప్రబంధాన్ని వీరిచే రచింపజేసి అంకితమందినవారు నాటి పోలవరం సంస్థానాధీశులు మరియు 'సరస్వతీ పత్రిక' ''అధిపతులైన శ్రీకొచ్చెర్లకోట రామచంద్ర వేంకట రామకృష్ణారావుగారు. అవధానులిద్దరూ కలిసి చేసిన ప్రబంధము ఈ అనువాద గ్రంథము. ఆర్నాల్డ్ తన (The light of Asia) ను ఎనిమిది ఆశ్వాసముల(Books)తో రమారమి 5300 పాదములు గల కావ్యంగా ప్రౌఢశైలిలో రచించితే తిరుపతి వేంకట కవులు దానిని ఆరు ఆశ్వాసముల ప్రబంధముగా రూపుకట్టించినారు. వారు ఈ అనువాద రచన చేసే కాలానికి గూడా (ఇరువదవ శతాబ్దము తొలినాళ్ళు) తెలుగునాట ఆంగ్లభాషతోనూ, చరిత్రతోనూ పరిచయం లేని చాలామంది సామాన్యులకు బుద్ధుని జీవితం గురించి గానీ,ఆ మత స్వరూపం గురించి గానీ తెలియదంటే అతిశయోక్తి కాదు. అటువంటి కాలంలో న్యాపతి సుబ్బారావు గారి సలహా మేరకు జమీందారు కె.ఆర్.వికృష్ణారావుగారు ఈ కవులతో అనువాదం చేయించే సమయంలో తిరుపతి వేంకట కవులకు చావలి సూర్యప్రకాశ రావుగారనే ఆంగ్ల పండితులు ఈ కావ్యానికి సంబంధించిన మూల విషయ సంగ్రహణలో సహాయం చేసినారు. ''బుద్ధచరిత్ర'' బుద్ధుని జీవి తము-బోధనలను సాధికారంగా తెలుగు వారికి అందించిన తొలి తెలుగు అనువాద ప్రబంధమై భాసిల్లింది.



ఆర్నాల్డ్ కృతిని అనుసరిస్తూనే తిరుపతి వేంకట కవులు 'బుద్ధ చరిత్ర' నొక స్వతంత్ర రచనయనునట్లుగా తీర్చిదిద్దినారు. ''ఈ ప్రబంధమంతయు బాల సుఖబోధకై లేనిపోని వర్ణనలు లేకుండా సులభశైలిలోనే వ్రాయగల్గితి''మని వారు ఈ ప్రబంధమునకు వ్రాసిన ముందుమాటలో చెప్పికొనినను, పూర్వకవుల శైలిలోని మెలకువలను జీర్ణించుకొని, నవనవోన్మేషమైన ప్రతిభతో వ్యవహారశైలికి గ్రాంథికతను ప్రసాదించి చదువరులకు ఆస్వాద యోగ్యముగా ఈ గ్రంథ నిర్మాణము జేసినారు. మహానుభావుడైన బుద్ధుని చరిత్రములో అంతఃసూత్రముగా నున్న **''అహింస్యాత్సర్వభూతాని''** యనువాక్యము, దానితో బాటు ఈ కావ్యమును అనువదింప సంకల్పించిన శ్రీకృష్ణారావు బహద్దర్ వారి ప్రోద్బలము కూడా ఈ రచనకు కారణము అయినవి. తిరుపతి వేంకట కవుల కావ్యంలో అహింసా తత్త్వము ఒక అంతఃసూత్రముగా జాలువారుతూ ఉంటుంది. దేవదత్తుని బాణంచే నిహతమైన అంచను సహజ కరుణా దృష్టితో సిద్ధార్థుడు కాపాడిన సందర్భములో-''ఈ నిఖిల జంతువులకు ప్రాణము ముఖ్యంబు. దానిని రక్షించిన యవ్వానిది తదాధి పత్యంబు''అని ముగిస్తారు. ఆర్నాల్డ్ కవి వ్రాసిన- ''But looking deep he saw/the thorns which grow upon the rose of life..How lizard fedon ant and snake on him'' పదాలకు పదును పెడుతూ కాయలు గాచిన అరచేతులతో మేడిపట్టే కర్షకుడినీ, బలవంతుడు బలహీనుణ్ణి మ్రింగే వరుసను ''అఱితి కాయలుగాయనవని దున్నచు కష్టపడుచుండు కాసరద్వయమునొకట... బట్టి చీమల మ్రింగెడు బల్లిని మరిదాని మ్రింగెడు పాము నద్దానిమింగు వైనతేయుని'' అనే పద్యంలో వర్ణిస్తారు. హింసను సూచించే వీటినన్నింటినీ చూసి కరుణా తరంగిత హృదయుడై ''మరి నేను దయగల వాడనేనా!'' అని ప్రశ్నించుకుంటాడు సిద్ధార్థుడు. యుక్తవయస్కుడై, స్వయంవరం పోటీలో పాల్గొని యశోధరను వివాహమాడే సందర్భములో ఒక చిన్నపద్యంలో వారు యశోధర శీలాన్ని, సిద్ధార్థుని తత్వాన్ని అక్కడ వున్న సభ్యుల మనస్తత్వాన్ని భాసింపచేస్తారు. గీ. మోమున పతివ్రతాత్వంబు మొలకలెత్త సభ్యులకు మాత్ర భావంబు చౌకళింప/ ధ్యాననిశ్చలుడైనయతని ఎదుటకు వచ్చినిల్చె యశోధరా వారిజాక్షి'' అది హైందవీయతకు అద్దంపట్టే పద్యం. వివాహమైన తరువాత మొత్తం నాలుగుమార్లు విహారానికి పోయిన గౌతముడు వరుసగా అస్థిపంజరములా వున్న ముదుసలినీ, కుష్టురోగినీ, కాటికిపోయే శవాన్నీ, తనచుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోని సన్యాసిని చూసి ఆలోచనలో పడుతాడు. ''I would not let one cry/ whom I could save/ How can be that Brahm/ would make a world and keep it miseralble'' అని ప్రశ్నించుకొని ప్రపంచంలోని దుఃఖ నివారణ మార్గాన్ని అన్వేషించే దృఢసంకల్పంతో భార్యనూ, కుమారుని వదిలి వెళ్లే యువరాజు మానసిక స్థితిని ...''My child, the hidden blossom of our loves/ whom if i wait to bless my mind will fail.. Now Iam fixes, and now I will depart...'' అంటూ ఆర్నాల్డ్ వ్రాస్తే, ఆ సంశయాత్మక స్థితిని క్లిష్టమైన సందర్భాన్ని నాటకీయంగా మన కళ్లముందు జరుగుతున్నట్లుగా తిరుపతి వేంకట కవులు ఆవిష్కరిస్తారు.

వ. ఒక కొంతేగును, సంశయించును సముద్యుక్తత్వమున్ జెందు వే/ఔక కొంతేగు/యదార్థస్థితంగను, నిరుద్యోగమ్ము వాటించు, వె/న్కకుదోచెంచుట కిచ్చగించు నటసన్న్యాసార్థియే యౌనుగా/కకటా యెవ్వనికేని శక్యముగునా యర్థాంగి వర్జించుటల్ ...''

ఇరువది తొమ్మిది సంవత్సరముల వయసులో సత్యాన్వేషణలో బయలుదేరిన సిద్ధార్థుడు రాజగృహం చేరి, ఇద్దరు వేదవిదులైన బ్రాహ్మణుల శుశ్రూష జేసి ఉపవాస నియమాది దీక్షలతో కృశీభూత శరీరుడై స్పృహ తప్పి మరణానికి చేరువ అవుతాడు. అక్కడొక గోపాల బాలుడు ఇచ్చిన పాలతో తేరుకొని జాతి, కుల విచక్షణ లేని మానవత్వాన్ని గ్రహిస్తాడు. తనకు పాలను ఇవ్వడానికి సందేహించిన ఆ బాలునితో **''నీ శరీరమందు నెత్తురు ఈ నా శరీరమందు మంచి దుగ్ధములు గలవె...మోముపై బొట్టు జందెంబు బుజంబునందు వర్తిలెనె జన్మమందయెవ్వరికిగాని''** అంటూ సిద్ధార్థుడు **''సుకృతము లొనర్చువాడే ద్విజుండును, దుష్కృత ములొనర్చువాడే చండాలుండు గాక వర్ణ భేదంబు గలదే''**అని మొదటిగా ఆ గొల్లబాలుడికి బోధిస్తాడు. ఈ కావ్యంలో సుజాత వృత్తాంతం లాంటి కొన్ని ఉపాఖ్యానాలు కూడా వున్నాయి. అవన్నీ ఈ ప్రబంధ ప్రయోజనాన్ని లక్ష్యంగా చేసుకొని ఉటంకించబడినవే. ఆ తథాగతుని జీవితమునూ, బోధనలనూ మళ్లీ మనం స్మరించుకొని, తరించడానికి నేటికీ ఒక వంద సంవత్సరాల కంటే ముందే బుద్ధుని జీవితము, బోధనల ఎడల ఆకర్షితులైన తిరుపతి వేంకటకవులచే అనువాద ప్రబంధంగా రచించబడిన ''బుద్ధచరిత్రము''అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- డా॥ పొత్తూరి వేంకట సుబ్బారావు
9989082101

నియోగి ఓ నిత్య ప్రయోగి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వారు 'విమర్శ' ప్రక్రియలో ప్రముఖ కవి, విమర్శకుడు. నియోగిని 2016సం. ప్రతిభా పురస్కారంతో సత్కరించడంతో 'ప్రతిభ'కు పట్టం కట్టినట్లయింది. వివిధ ప్రక్రియల్లో మూడున్నర దశాబ్దాల సాహితీ సేవకు గుర్తింపు దక్కింది.

55సం.ల నియోగి స్వతహాగా కవి. 1979 సం.లో తన మొదటి కవితతో కవిగా వ్యక్తమయ్యాడు. చక్కటి సాహిత్య నేపథ్యం పెద్దల దగ్గర నుండి అంది పుచ్చుకున్న వారసత్వం. యువకుడిగా తమ ఇంట్లోని లైబ్రరీలో వందల గ్రంథాలు అధ్యయనం చేసిన అనుభవం. ఆయన వెలువరించిన నాలుగు కవితా సంపుటాలు ఆర్తి, వల్లడి, నెగళ్ళు, కొలిమి. శీర్షికలు అమర్చడంలో కవిత్వం ప్రవహింపజేయడంలో ఆయనది విభిన్న శైలి. అందరి దారిలో కాదు. భిన్నంగా చూడాలి. భిన్నంగా పలకాలి. తనకంటూ ఒక ప్రత్యేక ఒరవడి కావాలన్నది ఆయన దృష్టి. దోపిడిదారుల వెన్ను విరవడం, బడుగు జీవులకు దన్నుగా నిలబడటం, సమాజం నుండే కవిత్వాన్ని చేదుకోవడం ఆయనకు ఇష్టం. 'నీది వామపక్ష భావ జాలం' అని ఎవరైనా అంటే 'నా ధోరణే అంత' అని సగర్వంగా ప్రకటిస్తాడు.



నియోగి కవి మాత్రమే కాదు. కథకుడు కూడా. ఓ పది కథలు రాసి వుంటాడు. 'నియో గజల్స్' పేరిట భావ కవిత్వఛాయతో విరివిగా రచనలు చేశాడు. 1947 సం. నుండి ఇటీవలి కాలం వరకు సాగిన తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో నిర్మితమైన 'కొలిమి' చలన చిత్రానికి మాటలు సమకూర్చాడు. ప్రయోగాలు చేయడమంటే నియోగికి ఇష్టం, అదే విమర్శలోనూ ఆయన్ను ఉన్నతంగా నిలిపింది. 'విమర్శ' అంటే 'తెగడ్త' కాదు. పొగడ్తా కాదు ఒక రచనలోని మంచి, చెడులను కూలంకషంగా విశ్లేషించడం ఆ రచనలో ఏది బాగుందో...ఎందుకు బాగుందో లోతుగా స్పర్శించడం. బాగా లేకపోతే ఎందుకు బాగులేదో సూచనాత్మకంగా వివరించడం. సహృదయత, నిష్పక్షపాతం, విషయ పరిజ్ఞానం సద్విమర్శకుడికి ఉండవలసిన ముఖ్య లక్షణాలు. ఇవన్నీ పుష్కలంగా పుణికి పుచ్చుకున్న నియోగి ఒక్కో సాహితీ వేత్తకు ప్రశ్నలు సంధిస్తూ వాటికి సమాధానాలు రాబట్టి 'ఆంధ్రప్రభ' సాహితీ గవాక్షంలో ప్రతివారం ధారావాహికగా ప్రచురించాడు. 'వజ్రాయుధం' ఆవంత్స సోమసుందర్ నుండి నేటి తొలి బంజారా రచయిత్రి సూర్య ధనుంజయ్ వరకు మూడు తరాల సాహితీ వేత్తలతో జరిపిన 'సంభాషణ'ని 'అక్షర ముద్రలు' పేరిట ఓ పుస్తకం వెలువ రించాడు. మొత్తం ఇరవై నాలుగు సాహితీవేత్తలతో జరిపిన ఈ పారదర్శక సంభాషణ ఓ గొప్ప ప్రయోగంలా నిలిచిపోయింది. ఈ మధ్య ఒక సాహిత్య సభలో ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ 'నియోగి' ప్రశ్నలకు సమాధానం చెప్పలేక చేతులెత్తేశాను'' అంటూ చమత్కరించారు. ప్రశ్నల రూప కల్పనలో 'నియోగి' ప్రదర్శించిన ప్రావీణ్యతకు ఓ సాహితీ శిఖరం ఇచ్చిన కితాబు ఇది. ''దిగంబర కవిత్వంలో బూతుపదాలు అవసరమా?'' అంటూ మహాస్వప్నను ప్రశ్నించి సమాధానం రాబట్టాడు. 'కవిత్వమంటే ఏమిటి?' అన్న ప్రశ్నకు కె.శివారెడ్డి ఇచ్చిన సుదీర్ఘ సమాధానం కవులందర్ని ఆలోచిం పజేస్తుంది. నియోగి సంధించిన ఓ ప్రశ్నకు స్పందిస్తూ డా.ఎన్.గోపి. ''ఈర్ష్యాసూయలు రచయితల్లో కాస్త ఎక్కువ మోతాదుల్లో ఉంటాయన్న'' నిఖార్సయిన నిజాన్ని నిర్భయంగా ఒప్పుకుంటాడు. ఇలా... వరవరరావు, మసనచెన్నప్ప, అద్దేపల్లి, అంపశయ్య నవీన్, బన్న అయిలయ్య, కొండ్రెడ్డి, కాత్యాయనీ విద్మహే వంటి అనేక మంది ప్రముఖుల అంతరంగాలకు అద్దం పడ్తూ పాఠకుల ముంగిట నిలిపిన వైవిధ్య ప్రక్రియా ప్రయోగం ''అక్షర ముద్రలు''. నియోగి మరో అడుగు ముందుకేస్తు ఒక్కో కవికి వంద ప్రశ్నలు సంధిస్తూ మరో నూతన ప్రయోగానికి తెరదీశాడు. ఒక కవికి వేసిన ప్రశ్నలు మరో కవికి చర్వితచరణం గాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడు. ఆ కవి కవితత్వాన్ని, కవిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని సమగ్రంగా ఆవిష్కరిస్తు బృహత్తర గ్రంథంగా వెలువరించాడు. కవి సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసి వ్యక్తిత్వాన్ని ఆలింగనం జేసుకుని 50 పుటల సుదీర్ఘ వ్యాసం ఒక భాగంగాను...వంద ప్రశ్నలకు సమాధానాలు మరో భాగంగాను తీర్చిదిద్ది పుస్తకాలుగా రూపకల్పన గావించాడు. ఎవరి ప్రశ్నలు వారివే. ఈ పరంపరలో 'ఉద్యమస్వరానికి వంద ప్రశ్నలతో' ప్రముఖ దళిత కవి డా. దామెర రాములు, ''నూరు ప్రశ్నల హోరు-ద్వానా జవాబుల జోరు'' మకుటంతో సాహితీ సవ్యసాచి డా.ద్వానా శాస్త్రి, 'వంద ప్రశ్నలకు- కేతవరపు వేల భావాలు' పేరిట ప్రముఖ రచయిత్రి డా. కేతవరపు రాజ్యశ్రీ గారలపై అపురూప గ్రంథాలకు తెరదీశారు. నియోగి రాసిన 50 పుటల వ్యాసాలు ఆయా సాహితీ వేత్తల 'బయోగ్రఫీ' లా...ప్రశ్నలన్నీ తీసేసి సమాధానాలను ఒక దగ్గర చదివితే వాళ్లవాళ్ల 'ఆటోబయోగ్రఫీ'లా గోచరిస్తుంది. తెలుగు సాహిత్య చరిత్రలో ఇదో వినూత్న ప్రయోగం. ప్రముఖ సాహితీవేత్త శ్రీరామ కవచం సాగర్‌పై పుస్తకం త్వరలో వెలుగుచూడనుంది. ఇలా మరెన్నో పుస్తకాలు వెలువరించాలని నియోగి సంకల్పం.

''ప్రశ్నలు-సమాధానాలు'' ఓ వినూత్న ప్రయోగమయితే వి.ఆర్.విద్యార్థి రాసిన నలభై పంక్తులు ''అపరిచితుడు'' కవితకు 84పుటల వ్యాఖ్యానం రాసి విమర్శకుడిగా నియోగి మరో గొప్ప ప్రయోగానికి అంకురార్పణ గావించారు. కవితలో 'ఎవరీవిడ?' అన్న పదంతో ప్రారంభమవుతుంది. కేవలం ఆ ఒక్క పదంతో స్ఫూర్తిని పొంది 'ప్రేరణ' పేరిట విమర్శనాత్మక వ్యాఖ్య గ్రంథరూపంలో వెలువరించాడు.

''అంతర్గతంగా ఏకమవుతేనే స్త్రీ అంటే ఏమిటో తెలిసేది'' అంటూ స్త్రీ ఉన్నతత్వాన్ని అక్షరీకరించిన పుస్తకం ఇది. కవిగా వి.ఆర్.విద్యార్థి. విమర్శకుడిగా నియోగి ప్రతిభలకు దర్పణం పట్టిన గ్రంథం 'ప్రేరణ'. సత్కారాల కోసం..పురస్కారాల కోసం వెంపర్లాడని స్వభావం నియోగిది. ఆయనకు తెలిసిందల్లా తోటి మనిషిని ప్రేమించడం... సాటివారి ప్రతిభను మెచ్చుకోవడం.. నిరంతరం రాసుకుపోవడం ఓ విధంగా నిరాడంబర అక్షరయాగం అతనిది. తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం అందుకున్న సందర్భంగా ఈ నిత్య ప్రయోగికి ఇవే నా అక్షరాక్షతలు.. శుభాభినందనలు.

- రమణ వెలమకన్ని
9866015040

కవితా మొగ్గలు

కవిత్వం మనసును పులకింపచేస్తేనే కదా
అక్షరలతలు నలుదిశలా పరిమళించేది
కవిత్వం సాహితీ కుసుమాల సౌరభం

కవిత్వం తరంగమై ప్రవహిస్తేనే కదా
కొత్తదారులను లోకానికి పరిచయం చేసేది
కవిత్వం నవరాగాల నవరససమ్మేళనం



కవిత్వం సాగరమై పోటెత్తితేనే కదా
గుండెలోని బాధల దుఃఖాన్ని ఒంపుకునేది
కవిత్వం కనిపించని రహస్య నేత్రం

కవిత్వం నదీ ప్రవాహమై పారితేనే కదా
కవితా వింజామరలు వికసించి నాట్యమాడేది
కవిత్వం నవపల్లవుల మృదంగనాదం

కవిత్వం అక్షర సౌరభాలను వెదజల్లితేనే కదా
తెలుగు సాహిత్యం కలకాలం నిలిచిపోయేది
కవిత్వం వెలుగుపంచే సహస్ర రవికిరణం.

- డా॥ భీంపల్లి శ్రీకాంత్
9032844017

సాహిత్య వార్తలు

సమీక్షా వ్యాసాలకు ఆహ్వానం

యం. బాలనాగయ్య స్మారక వ్యాస రచనా పురస్కారం-2018 కొరకు కొలకలూరి ఇనాక్ రాసిన 'మునివాహనుడు' నాటకంపై సమీక్ష వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. సాహితీ కిరణం సౌజన్యంతో నిర్వహించే ఈ పోటీకి వచ్చిన వ్యాసాలలో ఎంపికైన రచనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరసగా రూ.లు1500/-, రూ.లు500/- నగదు పారితోషికంతో పాటు జ్ఞాపిక బహూకరించబడుతుంది.. రచయితలు తమ వ్యాసాల్ని మూడేసి ప్రతులు, పాస్‌పోర్టు సైజు ఫోటోలను జతచేసి 31-3-2018లోగా ఈ క్రింది చిరునామాకు పంపాల్సిందిగా కోరుతున్నాం.
చిరునామా: సాహితీ కిరణం, 11-13-154,
రోడ్‌నెంబరు-3, అలకాపురి, హైదరాబాద్- 500035.
సెల్.నెం. 9849546762

మూడు గ్రంథాల ఆవిష్కరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, తిరుగంగ ప్రచురణలు మరియు తేజ ఆర్ట్‌క్రియేషన్స్ సంయుక్త నిర్వహణలో నాగరాజు రామస్వామి రాసిన సూర్యశిల, ఎదపదనిసలు, అనుస్వనం గ్రంథాల ఆవిష్కరణ సభ 16వ తేదీ సా. 6గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు) హైదరాబాద్ నందు డా॥తిరునగరి అధ్యక్షతన జరుగుతుంది.
ముఖ్య అతిథి, 'సూర్యశిల' గ్రంథ ఆవిష్కర్త కె. శివారెడ్డి, విశిష్ట అతిథి, 'ఎదపదనిసలు' గ్రంథ ఆవిష్కర్త మామిడి హరికృష్ణ, గౌరవ అతిథి, 'అనుస్వనం' గ్రంథ ఆవిష్కర్త ఏనుగు నరసింహారెడ్డిలు హాజరవుతారు. ఈ గ్రంథాల స్వీకర్తలుగా వరసగా ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, డా॥అమ్మంగి వేణుగోపాల్ లు హాజరవుతారు. గ్రంథాలను డా॥పి. లక్ష్మీనారాయణ, డా॥తిరునగరి దేవకీదేవిలు పరిచయంచేస్తారు.

తుమ్మూరి రామ్మోహన్‌రావు
తిరుగంగ ప్రచురణలు

- డా॥పోరెడ్డి రంగయ్య
తేజ ఆర్ట్‌క్రియేషన్

అగ్నిశిఖ ఆవిష్కరణ సభ

కటుకోఝ్వల రమేష్ కవితా సంపుటి అగ్నిశిఖ ఆవిష్కరణ కె. ఆనందాచారి అధ్యక్షతన 17వ తేదీ సాయంత్రం 5గం.లకు సి.ఇ.ఆర్, క్లబ్ జె.కె.కాలనీ, ఇల్లందు నందు జరుగుతుంది. ఈ కందుకూరి లక్ష్మీనారాయణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమయ్యే ఈ సభలో కె. శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ముఖ్యఅతిథులుగా కోరం కనకయ్య, ప్రొ॥ జయధీర్ తిరుమలరావు, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, దిండిగల రాజేందర్, మడత రమా వెంకట గౌడ్, విశిష్ట అతిథిలుగా చొల్లేటి రాజారెడ్డి, మువ్వా శ్రీనివాసరావు, యాకుబ్, శిరంశెట్టి కాంతారావు, వి. వీరాచారి, జ్వలిత, ఆత్మీయ అతిథిలుగా దిలావర్, మాల్యాశ్రీ, కపిల రవికుమార్, సంతోష్ తివారి, తాతోలు దుర్గాచారి, కంచర్ల శ్రీనివాస్, డా॥సి. హెచ్.రమేష్, డివి, సంపటం దుర్గా ప్రసాద్, రౌతు రవి, పొత్తూరి సుబ్బారావు, సమ్మెట ఉమాదేవి, సునంద, ఇందిర, విజయలక్ష్మిలు పాల్గొంటారు.

ఆహ్వాన కమిటి
తెలంగాణ సాహితి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

కలియుగ దేవతలు

వాళ్లు చట్టాతీత వ్యక్తులు
అవతార పురుషులు
ఆధునిక దేవతలు-

ఎన్నెన్నో అద్భుతాలు చేయగలరు
అపరాధాలూ చేయగలరు
ఒక్క గంటైనా జైలు కెళ్లకుండా
చిర్నవ్వుతో షూటింగులో చిందులేయగలరు.

వాళ్లతో మర్యాదగా ఉండండి
అభిమానించండి...ఆరాధించండి
నిలదీయకండి...ప్రశ్నించకండి
పక్కవాడి తుపాకీ లాక్కుని మీపై కాల్పులు జరపడం
వాళ్లకు మేకప్‌తో పెట్టిన విద్య-

వాళ్లను కాపాడడానికి కార్పొరేట్ ఆస్పత్రులు
క్యూలు కడతాయి
చట్టాలు వాళ్ల చుట్టాలై పులకరిస్తాయి
న్యాయవాదులే కాదు..

ఎవరైనా వాళ్లకు జేజేలు కొట్టాల్సిందే-
వాళ్లు జింకల్నే కాదు మనుషుల్నీ వేటాడగలరు
ఎయిర్ హోస్టెస్‌లూ..జూనియర్ ఆర్టిస్టులూ
ఒక లెక్కా?

వాళ్ల రూటే వేరు
శిక్షా స్మృతులకు ఎలా దొరుకుతారు?-

వాళ్లు అలక పాన్పెక్కినా...ఆత్మహత్యకు యత్నించినా
వాళ్లింట్లో పెళ్లి కుదిరినా...పెటాకులైనా
పత్రికలకు పతాక శీర్షికవుతుంది
ప్రచార సాధనాలకు సీరియల్ కథా కథనమౌతుంది
ఎఫ్.ఎం.రేడియోకి బోలెడు బాతాఖానీ దొరుకుతుంది-

వాళ్లకు తెలియని శాస్త్రం లేదు..రాని విద్యలేదు



అన్ని రంగాల్లోకీ విస్తరించగలరు...వికసించగలరు
రాజకీయమా? వారి చిటికెన వేలి ఆట
గౌరవ డాక్టరేట్ లివ్వడానికి
విశ్వవిద్యాలయాలే వారి వెంటబడతాయి
పద్మశ్రీ, పద్మభూషణ్ లేం ఖర్మ
నోబెల్ బహుమతులు కూడా వారి మెడల నలంకరించే
వరమాలలౌతాయి.

వాళ్ల ముక్కుపై ఈగవాలితే
జనం రోడ్లపై కొస్తారు
ఊరేగుతారు..ఊగిపోతారు
ఆత్మాహుతులకూ సిద్ధపడతారు
దిష్టిబొమ్మలతో పాటు తామూ తగలబడిపోతారు-

వాళ్లేం చెబితే అదే వేదం
వాళ్లేం చేస్తే అదే ఆదర్శం
వాళ్ల కట్టూబొట్టూ జుట్టూ బట్టా
ఆట పాట మాట బాటలన్నీ విలక్షణం
యువతరానికి అనుసరణీయం-

అసలు వాళ్ల ఇంట్లో పుట్టడమే సకల కళలకూ అర్హత
వాళ్ల హస్తస్పర్శయే అన్ని రంగాలకూ అమృత దీక్ష
వాళ్లకోసమే నిన్నటి కొండలూ, గుట్టలన్నీ
నేడు కాలనీలూ, స్టూడియోలూ,
ఫిల్మ్‌సిటీలుగా రూపాంతరం చెందాయ్
ఇదంతా వజ్రోత్సవాల నాటి పరిణామం-

ఇక శతవసంతోత్సవాల నాటికి
వాళ్లకోసం ప్రత్యేక రాజ్యాంగాన్ని లిఖించాల్సిందే!
వినూత్న శిక్షాస్మృతిని రూపొందించాల్సిందే!

- ఆచార్య ఎస్వీ సత్యనారాయణ
9618032390

అప్పుకుతోడు వడ్డీ పెరిగింది

●పన్నుల రాబడికంటే 10శాతం అధిగమించిన వైనం ●ఇప్పటికే వడ్డీలకు రూ.11,500 కోట్లు ●ఈ ఏడాది మొత్తం అప్పు రూ.1.56 లక్షల కోట్లు ●ఆర్థిక వ్యవస్థపై పెనుభారం ●కార్పొరేషన్ల అప్పులు అదనం ●2018-19లో మరింత పెరగనున్న రుణాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వ అప్పులు భారీగా పెరగ్గా మరోవైపు రెవెన్యూ వసూళ్లకంటే వడ్డీ చెల్లింపులు మించరాదన్న పరిమితిని దాటుతోంది. ఏ రాష్ట్రమైనా తన పన్నుల రాబడికంటే 10శాతానికి మించి రుణాలపై వడ్డీలకు చెల్లింపులు చేయరాదని ఎఫ్ఆర్‌బీఎం చట్టం చెబుతోంది. అప్పుడే ఆ రాష్ట్రం స్థిర ఆర్థిక వృద్ధిరేటును సాధిస్తున్నట్లుగా ఈ నిబంధన తెలుపుతోంది. జీఎస్‌డీపీలో 3 శాతానికి మించి అప్పులు చేయరాదని షరతు ఉంది. అయితే రెవెన్యూ మిగులు అధికంగా ఉన్న తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలకు మాత్రం 3.5 శాతం రుణ సేకరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. మిగులు రాష్ట్రాలుగా ఘనతను సాధించడంతో ఈ మేరకు కేంద్రం ఈ వెసులుబాటును వర్తింపజేసింది. అయితే తెలంగాణ రాష్ట్ర మొత్తం అప్పులపై వడ్డీలకు చెల్లింపులు రాబడుల్లో 10శాతంలోపే ఉండాలన్న షరతును అధిగమించడంతో భవిష్యత్ అప్పులపై భారీప్రభావం పడనుంది. తెలంగాణ ప్రభుత్వం వివిధ రూపాల్లో రుణసమీకరణ చేసుకుంటోంది. ప్రతిష్టాత్మక పథకాలకు బడ్జెటేతర రుణాలను, ఇతర పథకాలకు బడ్జెటరీ రుణాలను సేకరిస్తోంది. ప్రధానంగా రెండు పడక గదుల ఇండ్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఇరిగేషన్ ప్రాజెక్టులకు భారీగా రుణాలను అందిపుచ్చుకుంటోంది. అయితే 2017-18 ఆర్థిక ఏడాదిలో రూ.11,500 కోట్లను వడ్డీ చెల్లింపులకే ఖర్చు చేసే పరిస్థితి తలెత్తింది.

వడ్డీ భారం...

మొత్తంగా తెలంగాణ రాష్ట్ర అప్పులు దాదాపు రూ. 1.56లక్షల కోట్లకు చేరువయ్యాయి. రాష్ట్ర ఆవిర్భావం నాటికి వాటాగా రూ. 70 వేల కోట్ల అప్పు సంక్రమించగా అది ఏటేటా పెరుగుతూ ఇప్పుడు రూ. 2 లక్షల కోట్లకు చేరింది. తొలి ఏడాది 2014లో రూ.9వేల కోట్లకుపైగా రుణాలు చేయగా, రెండో ఏడాది రూ. 18 వేల కోట్లు, మూడో ఏడాది రూ.35 వేల కోట్లకు చేరుకుంది. నాలుగో ఏడాది డిసెంబర్ ముగిసే నాటికే రూ.24వేల కోట్ల అప్పులు చేసింది. విద్యుదుత్పత్తి, పంపిణీ మెరుగుదలకు అమలులోకి వచ్చిన ఉదయ్ పథకంలో రూ. 8293కోట్ల అప్పుతోపాటు, కార్పొరేషన్లకు స్వతహాగా అప్పులు చేస్తోంది. మిషన్ భగీరథ, కాళేశ్వరం, డబుల్ బెడ్‌రూం ఇండ్లక ు దాదాపు రూ. 65వేల కోట్ల అప్పు సమీకరించుకుంది. ఈ నేపథ్యంలో అప్పులపై వడ్డీ, రుణాల తిరిగి చెల్లింపులు భారం అవుతున్నాయి. ఈ వార్షిక ఏడాదిలో రాష్ట్ర మొత్తం అప్పు రూ. 1,56,821.49కోట్లకు చేరనుంది. జీఎస్‌డీపీలో ఈ ఏడాది మొత్తం అప్పుల శాతం 18.46 శాతం కానుందని అంచనాలున్నాయి. ఇందులో బహిరంగ మార్కెట్‌ద్వారా సేకరించిన రుణాలు రూ. 93284.40కోట్లు, కేంద్ర ప్రభుత్వంనుంచి అప్పు రూ. 9,184.55కోట్లు, అటానమస్ సంస్థలనుంచి అప్పుల రూపంలో రూ. 4338కోట్లు, ప్రత్యేక సెక్యూరిటీలు, చిన్న తరహా పొదుపు, ప్రావిడెంట్ ఫండ్‌ల ద్వారా రూ. 17,013 కోట్లుగా అంచనా వేశారు. అయితే ఇది ఏడాదికేడాది పెరుగుతూ వస్తుండటం గమనార్హం. రాష్ట్ర ఆర్థిక పురోగతి నేపథ్యంలో 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ద్వారా రాష్ట్రాల రుణ పరిమితి (ఎఫ్ఆర్‌బీఎం) స్థూల ఉత్పత్తిలో మరో 0.5 శాతం పెంచింది.

10 శాతానికి మించిన వడ్డీ భారం...

రాష్ట్ర పన్నుల ఆదాయం రూ.79 వేల కోట్లుగా ఉంది. ఇందులో 10శాతం అంటే రూ.7900కోట్లకు మాత్రమే అప్పులపైవడ్డీ చెల్లింపులకు అనుమతి ఉంది. అయితే ఇప్పు డాపరిధి దాటి రూ.11,500కోట్ల వడ్డీలు చెల్లించడంతో 3.5 శాతం రుణ సమీకరణ వెసులుబాటుపై ప్రభావం పడనుంది. 2016-17లో మిగులును సాధించడంతో 3.25 శాతం ఎఫ్ఆర్ బీఎం సౌలభ్యం కల్గింది. 2017-18లో 3.5శాతానికి ఎఫ్ఆర్ బీఎం పెంపుకు కేంద్రం ఆమోదం తెలిపింది. 2015-16లో రూ.7942 కోట్లుగా ఉన్న వడ్డీల భారం తాజాగా రూ.11,500కోట్లకు ఎగబాకింది. రాష్ట్ర ఆదా య స్థితిగతులకు కీలకమైన పన్నుల రాబడి రూ.79,624 కోట్లు, పన్నేతర ఆదాయం రూ. 6,601కోట్లు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూ.26,857కోట్లుగా నిర్థేశించుకుంది. అయితే ఈ ఏడాది అత్యంత ఎక్కువ రుణసేకరణకు కారణమైన ఇరిగేషన్ రంగానికి రూ. 20వేల కోట్లు, మిషన్ భగీ రథ,డబుల్ బెడ్ రూం ఇండ్లకు రూ. 10వేల కోట్ల అప్పు లు వడ్డీ భారానికి కారణమయ్యాయి. ఈ ఏడాది మొత్తం రుణపరిమితి రూ.26,096 కోట్లుగా కేంద్రం అను మతించింది. వచ్చే ఏడాది ఈ పరిమితిని పెంచుకోవడం అసాధ్యమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాది	రుణ మొత్తం	శాతం
2014-15	83845.78కోట్లు	16.06
2015-16	1,00,707.95	17.27
2016-17	1,23,821.49	18.46
2017-18	1,56,821.49	

హజ్ యాత్రికులకు శిక్షణా తరగతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హజ్ యాత్రికులకు పునర్చరణ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. హజ్‌కు వెళ్లే వారు పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవలసిన జాగ్రత్తలను ఈ సందర్భంగా తెలియచేశారు. హజ్ యాత్రకు ఎంపికైన వారు ఆరోగ్యంగా ఉండాలని, రోజుకు కనీసం మూడు కిలో మీటర్లు నడవగలగాలని సూచించారు. హజ్ యాత్ర సందర్భంగా ధృఢమైన ఆరోగ్య సంరక్షణ అత్యంత ప్రధానం అని హజ్ కమిటీ ఛైర్మన్ మసిహుల్లా ఖాన్ వివరించారు. హజ్ యాత్రికులు మధ్యవర్తులను ఎవరిని కూడా సంప్రదించవద్దని, తమకు అవసరమైన సహాయం, సమాచారం కోసం హజ్ కమిటీ సిబ్బందిని మాత్రమే సంప్రదించాలని సూచించారు. హజ్‌కు బయదేరడం, సౌదీ అరేబియాలో హజ్ సందర్భంగా ఉండే సమయంలో తీసుకోవలసిన చర్యల గురించి హజ్ కమిటీ సీఈవో ఎస్.ఎ. షుకూర్ వివరించారు. ఈ సంవత్సరం సుమారు 4 వేల మంది హజ్ యాత్ర చేయడానికి ఎంపిక కాబడ్డారని తెలిపారు. వారిని బృందాల వారిగా హజ్‌కు పంపించడం జరుగుతుందన్నారు.


రేపటి నుంచి టీ-శాట్ బోధన

●5 సబ్జెక్టులు, 30మంది ఉపన్యాసకులు:శైలేష్ రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎంసెట్, నీట్, ఐఐటీ, మెయిన్స్ 2018 పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు టీ-సాట్ బోధన కార్యక్రమాల ప్రసారాలు అందించనుందని సీఈఓ ఆర్.శైలేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం అందించిన ప్రసారాలు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, విద్యావంతుల నుంచి అనేక ప్రశంసలు అందాయన్నారు. గతసంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా 5 సబ్జెక్టులు, 30 మంది ఉపన్యాసకులు, 500 గంటల అవగాహన కార్యక్రమ ప్రసారాలు టీ-సాట్ నిపుణ, టీ-సాట్ విద్యా చానళ్లలో అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. మార్చి 13వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు జరిగే ప్రసారాలు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పాఠ్యాంశాల బోధన ఉంటుందన్నారు. టీ-సాట్ నిపుణతో పాటు టీ-సాటో విద్య చానళ్లలోనూ ఇవే పాఠ్యాంశాలు ప్రసారం అవుతాయన్నారు. మార్చి 13వ తేదీ నుంచి 31 వరకు, ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30 వరకు , మే నెలలో 1వ తేదీ నుంచి పరీక్ష జరిగే 5వ తేదీ వరకు రోజుకు 9 గంటల పాటు పాఠ్యాంశాలను బోధిస్తామన్నారు. ఈ ప్రసారాలను టీ-సాట్ శాటిలైట్ చానళ్లతో పాటు టీ-సాట్ యూట్యూబ్, వెబ్‌సైట్, యాప్‌లలో కూడా చూడవచ్చని ఆయన తెలిపారు.

ఉద్యోగాల భర్తీపై అసెంబ్లీలో చర్చించాలి

●తెలంగాణ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసెంబ్లీలో చర్చించాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. అసెంబ్లీలో చర్చించి ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన ప్రకటన చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగజేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఆదివారం నిరుద్యోగ జేఏసీ, యూనివర్సిటీ విద్యార్థుల సమావేశం బీసీ భవన్‌లో జరిగింది. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ర్యాగ అరుణ్, సంజయ్, రవీందర్‌రెడ్డి, భూపేష్ సాగర్, రాంబాబు, జి కృష్ణ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాల భర్తీ కోసం నిరుద్యోగులు, యూనివర్సిటీల విద్యార్థులు సంయుక్తంగా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. నేటి నుంచి జరిగే శాసనసభలో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. రాష్ట్రంలో గ్రూప్-1 పోస్టులు 1200, గ్రూప్-2 పోస్టులు 2000, గ్రూప్-3 పోస్టులు 8వేల వరకు, గ్రూప్-4, క్లరికల్ ఉద్యోగాలు సుమారు 36 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 6000 ఇంజనీరింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్లను జారీ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో 10,500 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 40వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

60ఏళ్లు దాటిన రైతులకు పెన్షన్లు

•రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘాల డిమాండ్



హైదరాబాద్,ఆంధప్రభ: రాష్ట్రంలో వ్యవసాయరంగంపై ఆధారపడి 60 ఏళ్ల దాటిన ప్రతిరైతుకు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులతో సమానంగా పెన్షన్లు ఇవ్వాలని రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రవ్యవసాయ బడ్జెట్‌పై రైతుసంఘాలు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ బడ్జెట్‌కు కేటాయిస్తున్న నిధులు 2శాతంకు మించటం లేదని దీన్ని ఈ 2018-19 బడ్జెట్‌లో రూ.13000కోట్లకు పెంచాలని రౌండ్ టేబుల్‌లో తీర్మానించారు. రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న అన్నిరకాల వ్యవసాయ రుణాలు రద్దు చేయాలని, ఇకపై వ్యవసాయ రుణాలు వడ్డీలేకుండా అందచేయాలని తీర్మానించారు. పంటలకు పెట్టుబడిపై 50శాతం అదనంగా ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని, మార్కెట్‌లో ధరల లోటు వ్యత్యాసాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరిత్యాల వలన జరిగే పంట నష్టాలకు సంబంధించి ఎకరాకు రూ.5465 ఏమూలకు చాలటం లేదని , పూర్తి నష్టాన్ని రైతుక ు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మధ్యదళారులను తొలగించాలని, విత్తన చట్టం అమలు చేయాలని, భూసార పరీక్షలు ఉచితంగా చేయించాలని, వ్యవసాయ పరిశోధనలకు అదనపు నిధులు కేటాయించాలని, పసుపు, నూనెగింజెలు, పత్తి, పంటల పరిశోధనలు చెపట్టాలని తీర్మానించారు. ఉద్యాన పంటలకు మైక్రో ఫైనాన్స్‌కు పూర్తి రాయితీ ఇవ్వాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటుచేసి టమోట జ్యూస్ ఫ్యాక్టరి, మిరప పేస్ట్ ఫ్యాకర్టీ, పప్పు నూనె మిల్లులు ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో ఏఐకెఎస్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, అఖిలభారత రైతు సంఘం నాయకులు జెవి చలపతిరావు, టి.సాగర్, సి.జంగారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం నేత పద్మ, చింతల చంద్రారెడ్డి, విత్తన రైతుల సంఘం నేత ప్రసాదరావు, పండ్లతోటలు కూరగాయల రైతు సంఘం నేత వి.సంజీవరెడ్డి, ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక వ్యవసాయం అనర్థాలకు మూలం : జస్టిస్ చలమేశ్వర్

హైదరాబాద్,ఆంధప్రభ: రసాయనిక ఎరువుల ద్వారా చేసే వ్యవసాయం అనర్థాలకు మూలమని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో రైతు నేస్తం అధ్వర్యంలో జరిగిన ప్రకృతి వ్యవసాయ సదస్సులో జస్టిస్ చలమేశ్వర్ ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ విధానాలు రైతులు కష్టాల పాలు చేస్తున్నాయన్నారు. దేశ ప్రజల ఆకలి తీరుస్తున్న అన్నదాతలు అంత సుఖంగా లేరన్నారు. పంటలకు లాభసాటి ధరలు లభించటం లేదన్నారు. సేంద్రీయ వ్యవసాయం లాభసాటిగా ఉంటుదన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న రైతునేస్తం ఫౌండేషన్‌ను అభినందించారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయంలో ఏపీ ముందంజలో ఉందన్నారు. రాష్ట్రాన్ని ఒకే క్లస్టర్‌గా మార్చి సేంద్రీయ సాగును ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వరరావు, పద్మభూషన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ , వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు రైతులకు సన్మానం చేశారు.

కేటాయింపులు కాదు.. నిధులు విడుదల కావాలి

●సీఎం గిరిజన పక్షపాతి

●పెప్సీ సదస్సులో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు దేవయ్య



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎస్సీ, ఎస్టీలకు నిధుల కేటాయింపులే కాదు విడుదల చేయడంలో కూడా ప్రభుత్వాలు ముందుకు రావాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు సుంకపాక దేవయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ పెప్సీ అధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు దళిత, గిరిజన వర్గాలకు సానుకూలంగా ఉన్నారని, నిధులను సైతం పెద్దయెత్తున కేటాయిస్తున్నారని అయితే, అధికార వర్గాలు మాత్రం విడుదల చేయడం లేదని మండిపడ్డారు. నామ్‌కే వాస్తే కేటాయింపుల వల్ల ఈ వర్గాలకు ఒరిగేదేమీ లేదన్నారు. ఈ విషయంలో పోరాటాలకు సిద్ధం కావాలని, కొట్లాడితే తప్ప నిధులు విడుదల కావన్నారు.

కార్పొరేషన్‌ల ద్వారా 99 శాతం పథకాలు అమలు

ఎస్సీ ఆర్థిక సంస్థ ఎండి లచ్చిరాం భూక్యా మాట్లాడుతూ, దళిత వర్గాలు సామాజికంగా ఎదగటానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్పోరేషన్ ద్వారా ప్రస్తుతం 99 పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. ఈ వర్గాలకు చెందిన నిరుద్యోగులు ఆర్థికంగా ఎదగడంతో పాటు సమాజంలో మంచి హోదా పొందేందుకు అనువైన పథకాలను చేపడుతున్నామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఎయిర్ హోస్టెస్ తదితర విభాగాలలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. గ్రామాలలో వైద్యులు లేని చోట ఆర్ఎంపీ, పీఎంపీలే వైద్యులుగా చెలామని అవుతున్న విషయం తెలిసిందేనని, దళిత నిరుద్యోగులకు కూడా వైద్యరంగానికి సంబంధించిన ఆక్యుపంక్చర్, పంచకర్మ శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. గడచిన మూడేళ్లుగా ప్రభుత్వం ఎస్సీ కార్పోరేషన్‌కు రూ. 1055 కోట్లు విడుదల చేసిందని, నిరుద్యోగులకు రుణాలు మంజూరైనప్పటికీ యూనిట్లు పెట్టకపోవడంతో అభివృద్దిలోకి రావడం లేదని ఆయన అంగీకరించారు.

రుణాలు తీసుకుని యూనిట్లు ప్రారంభించాలి

కేవీఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీజీ ప్రసాద్ శర్మ మాట్లాడుతూ, ఖాదీ విలేజ్ గ్రామీణ ఇండస్ట్రీద్వారా చేపడుతున్న పథకాలను గూర్చి వివరించారు. రుణాలు తీసుకుని యూనిట్లను ప్రారంభించకపోవడంతో బ్యాంకర్ల వద్ద నమ్మకం పోతుందని, ఒక్కరు చేసే తప్పు అందరిపై పడుతుందని అందువల్ల తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా పారిశ్రామిక వేత్త సాక శైలజ మాట్లాడుతూ, తాను కూడా 20ఏళ్ల క్రితం బ్యాంకులు సహకరించనందువల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నానని, చివరకు పోరాడి రుణం మంజూరు చేసుకున్నానని తెలిపారు. స్కోడా ఉమన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బ్యూటీ పార్లర్లు కరీంనగర్, సిరిసిల్లలో స్థాపించి వేలాది మంది మహిళలకు శిక్షణ ఇచ్చానని తెలిపారు. రుణాలు అందటం లేదనే నిరుత్సాహం వద్దని, ఓపికతో బ్యాంకర్లతో చర్చించి రుణాలు మంజూరు చేసుకోవాలని సూచించారు. ఆవేశాల వల్ల అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పెప్సీ సంస్థ చైర్మన్ ఇనగాల భీమారావు మాట్లాడుతూ, తన సంస్థ ప్రస్థానాన్ని వివరించారు. ప్రతి దళితుడు పారిశ్రామిక వేత్త కావాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ డీజీఎం వి మణియన్, సిడ్బీ ఏజీఎం ఎఎస్ రామయ్య, ఆరన్ విజయకుమార్, ఆంధ్రాబ్యాంకు ఏజీఎం టీ దీనదయాల్, దళిత నాయకులు గాంధీ, అభిరాం, పారిశ్రామిక వేత్త శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవా కారు బీభత్సం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఓ ఇన్నోవా కారు బీభత్సం సృష్టించింది. తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలీవిధంగా ఉన్నాయి. వివరాల ప్రకారం సికింద్రాబాద్ నుంచి వస్తున్న కారు(టీయస్09-ఇవి-8070) తిరుమలగిరి సిగ్నల్ పాయింట్ ముందు ఆర్డీఏ కార్యాలయం వద్ద వాహనాలను ఢీకొడుతూ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మూడు కార్లు,రెండు ద్విచక్రవాహనాలతో పాటు ఒక ఆటో దెబ్బతిన్నాయి. నిర్లక్ష్యంగా కారు నడిపిన నిఖిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు.

పాతబస్తీలో మరో తలాక్ కేసు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తలాక్ ఘటనలకు ఫుల్‌స్టాప్ పడటం లేదు. నగరంలోని పాతబస్తీలో మరో తలాక్ కేసు నమోదైంది. రైన్‌బజార్ పరిధిలోని యాకుత్‌పురాలో భార్యకు భర్త తలాక్ పత్రాలు పంపాడు. పుట్టింటికి వెళ్లిన భార్య ఇర్ఫానాకు ఖాజీ ద్వారా భర్త తలాక్ పత్రాలు పంపించాడు. రెండు నెలల క్రితం ఇర్ఫానాను భర్త ఖాజా వివాహమాడాడు. ఈ విషయంపై రైన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


అందుబాటులో జేఈఈ హాల్‌టికెట్స్

●15, 16 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష

హైదరాబాద్,ఆంధ్రప్రభ: దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించేజాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ మెయిన్-2018 హాల్ టికెట్లను నేటి నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సీబీఎస్ఈ ప్రకటించింది. మెయిన్ పరీక్ష ఓఎంఆర్ పద్ధతిలో ఏప్రిల్ 8న జరగనుంది. ఆన్‌లైన్‌లో 15, 16 తేదిల్లో నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రా లనుంచి జేఈఈ మెయిన్‌కు 50 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మెయిన్స్‌లో అర్హత సాధించిన వారు అడ్వాన్స్ పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంటుంది.

లేని పోస్టుకోసం ప్రొఫెసర్ల గలాట

●ఏపీకి డీఎంఈతో పాటు మరో మూడు పోస్టులు ●ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ●అడిషనల్ డైరెక్టర్ పోస్టుపై దృష్టి సారించని సీనియర్లు ●ఇన్‌చార్జీ డీఎంఈ పోస్టుకోసం కోర్టుకు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : లేని పోస్టు కోసం ప్రొఫెసర్లు తగువులాడు కుంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయిన తరువాత వైద్య ఆరోగ్య శాఖలోని డీఎంఈ, అకాడమిక్ డీఎంఈ, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ డీఎంఈతో పాటు ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పోస్టులను ఏపీకీ కేటాయించారు. ప్రస్తుతం తెలంగాణకు ఈ పోస్టులు లేకపోవడంతో పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇన్‌చార్జీ డీఎంఈ పోస్టు కోసం అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ పోటీ పడుతున్నారు. సీనియార్టీ ఆధారంగా ఈ పోస్టును ప్రభుత్వం భర్తీ చేస్తోంది. ప్రస్తుతం ఇప్పుడున్న డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి సీనియార్టీ లిస్టులో 59వ నెంబర్ అంటూ ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ గతంలో హైకోర్టులో పిటీషన్ వేశారు. ఆ కేసును కోర్టు సస్పెండ్ చేస్తూ గురువారం సాయంత్రం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే ఈ పోస్టు మన రాష్ట్రానికి లేదని రాష్ట్రం విడిపోయిన సందర్భంలో ఏపీకి కేటాయించినట్టు అధికారులు పేర్కొంటున్నారు.

2016లో ఉద్యోగుల ఫైనల్ కేటాయింపు

2016లో కమల్‌నాథ్ కమిటీ ఉద్యోగుల చివరి కేటాయింపులను చేసింది. అంతకుముందు ఏపీ, తెలంగాణ ఉద్యోగులు ఈ సీనియార్టీ లిస్టులో ఉం డడంతో దానిని అలాగే కొనసాగించారు. ఫైనల్ లిస్ట్ సమయంలో కొంతమంది ప్రొఫెసర్లు ఆంధ్రాకు వెళ్లిపో యారు. దీంతో ఉన్న వారి లిస్ట్ ప్రకారం ప్రభుత్వం పలు పోస్టులను భర్తీ చేస్తోంది. తదనంతరం కొందరి కేటాయింపులపై కోర్టుకు వెళ్లడంతో సీనియార్టీ జాబితాను అప్పటి నుంచి డీఎంఈ కార్యాలయం తయారు చేయలేకపోయింది.

అదనపు అర్హతలు ఉన్న వారికే డీఎంఈ

ప్రొఫెసర్లుగా 5 సంవత్సరాలు పూర్తి చేసిన వారిని సీనియార్టీ ఆధారంగా మొదట అడిషనల్ డైరెక్టర్ పోస్టులో నియమిస్తారు. ఇంకా అదనపు అర్హతలు ఉన్న వారిని డీఎంఈగా నియమిస్తారు. అయితే సీనియార్టీ ఉన్న ప్రతి ప్రొఫెసర్ కూడా అడిషనల్ డైరెక్టర్ పోస్టు కాకుండా డీఎంఈ పోస్టు కోసం ఎదురు చూస్తుండడంతో దానికి పోటీ పెరుగుతోంది. దీంతో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కోర్టుల వరకు వెళుతున్నారు.

అసలు గొడవ ఏమిటంటే..

మెడికల్ ఎడ్యుకేషన్ నిబంధనలకు, హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా డీఎంఈ రమేష్‌రెడ్డి నియామకం జరిగిందనిప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ కోర్టుకు వెళ్లారు. అసలు సీనియార్టీ లిస్టును కోర్టుకు సమర్పించకపోవడంతోనే ఇబ్బందులు ఎదురయినట్టు సీనియర్లు పేర్కొంటున్నారు. 2016లో కమల్‌నాథ్ కమిటీ ఫైనల్ ఉద్యోగుల కేటాయింపు తరువాత కొందరు సీనియార్టీ జాబితాపై కోర్టుకు వెళ్లారు. దీంతో పుణ్యకాలం కాస్త అయిపోయింది. 2017 సంవత్సరం డిసెంబర్ వరకు కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాయి. దీంతో 2018 జనవరి నుంచి ఫైనల్ లిస్టును తయారు చేసే పనిలో డీఎంఈ కార్యాలయం ఉన్నట్టు సమాచారం. ఈలోగా కోర్టు తీర్పుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చినట్టు సీనియర్ల పేర్కొంటున్నారు.

మెడికల్ ఎడ్యుకేషన్ నిబంధనలు, తెలంగాణ సబార్డినేట్ రూల్ 10 (హెచ్)కు లోబడి కొత్త డీఎంఈని నియ మించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పులో స్పష్టం చేసింది. డీఎంఈగా రమేష్‌రెడ్డి చట్టవిరుద్ధంగా ఎంపిక చేశారంటూ ప్రొఫెసర్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ రామచంద్రరావు తీర్పునిచ్చారు. డీఎంఈ నియామకం చేయాల్సి ఉందని అలాకాకుండా సివిల్ అసిస్టెంట్ సర్జెన్‌గా నియమితులైన వారితో సీనియారిటీ జాబితా రూపొందించిన వారిలో ఒకరిని ఏపీ ప్రభుత్వం డీఎంఈ నియమించిందని న్యాయవాది పేర్కొన్నారు.

వివాహ నమోదు చట్టాలకు పదును

హైదరాబాద్, ఆంధప్రభ: బంగారు తెలంగాణ రాష్ట్రసా ధన లక్ష్యాల్లో భాగంగా సామాజిక మార్పులకు టీఆర్ఎస్ సర్కారు నడుం బిగించింది. వివాహ చట్టాల అమలుపై దృష్టి పెట్టింది. వివాహ నమోదుకు సంబంధించిన చట్టాలకు పదునెక్కిస్తోంది. రాష్ట్రంలో జరిగే ప్రతి వివాహాన్ని నమోదు చేసే దిశగా ప్రజల్లో అవగాహణ పెంచి వివాహ నమోదును త ప్పని చేస్తోంది.ఈ దిశగా క్షేత్రస్థాయి ప్రభుత్వ యంత్రాగాన్ని సన్నద్ధం చేస్తోంది. వివాహ నమోదు చట్టాల అమలు బాధ్య తలను స్థానిక సంస్థలకు అప్పగించింది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఇందుకోసం వివాహ రిజిస్ట్రేషన్ అధికారులుగా ఆయా స్థానిక సంస్థల అధికారులకే ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఈ దిశలో వేగంగా అడుగులు వేస్తోం ది. గ్రామాల్లో జరిగే ప్రతి వివాహాన్ని తప్పనిసరిగా రిజిస్ట్రర్ చేయాలని పంచాయ తీరాజ్ శాఖ కమీషనర్ నుంచి అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా పంచాయతీ అధికారులనుంచి ఎంపీడీవోలకు ,అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామ పంచాయతీ సెక్రటరీలకు సర్క్యులర్లు జారీ అయ్యా యి. బాల్య వివాహాలను అరికట్టి ఆరోగ్యవంతమై న సమాజాన్ని ఏర్పరచటంలో భాగంగా వివాహా నికి చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మ్యారేజెస్ రిజిస్ట్రేషన్ యాక్ట్‌ను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రతి వివాహాన్ని తప్పునిస రిగా రిజిస్టర్ చేయ్యాలి. ఈ చట్టంలో వధూ వరులకు పెళ్లీడుకు సంబందించిన వయ స్సును నిర్దేసించింది. వివాహం జరిగే సమయం నాటికి వధువుకు 18ఏళ్లు పూర్తిగా నిం డి ఉండాలి. అదేవిధంగా వరుడి కనీస వయస్సు 21 సంవత్సరాలు నిండి వుండాలి. వయసు నిర్ధారణకు బర్త్ సర్టిఫికెట్ , లేదా విద్యా భ్యాసానికి సంబందించిన సర్టిఫికెట్‌ను ప్రమాణికంగా తీసుకుంటారు. అంతే కాకుండా వివాహానికి సంబందిం చిన వివాహ ఆహ్వాన పత్రికను ,వధూ వరుల ఫొటో లు వివాహ నమోదు అధికా రికి (పంచాయతీ కార్యదర్శి) సమర్పి ంచాలి. వ ధూ వరుల తల్లితండ్రులు లేదా ఇరువైపులనుంచి ముగ్గురు పెద్ద లు వివాహాన్ని ధృవపరుస్తూ సాక్షిసంతకాలు చేయాల్సి వుంటుంది.



ఎన్‌టీపీసీ చేతికి కాంతి, నబీనగర్ ప్లాంట్‌లు

• రూ.3,000 కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీ ఎన్‌టీపీసీ బీహార్ స్టేట్ పవర్ హోల్డింగ్ కంపెనీ లిమిటెడ్‌తో పాటు దాని రెండు భాగస్వామ్య ప్లాంట్‌లు నబీనగర్, కాంతిలను రూ.3,000 కోట్లకు టేకోవర్ చేసుకోనుంది. ఒక నెలలోపే ఈ తంతు పూర్తవుతుంది. ప్రస్తుతం సంప్రదింపులు జరుగుతున్నాయని విశ్వసనీయవర్గాల సమాచారం. గతంలో బీహార్ రాజకీయ నాయకులు పలు మార్లు నబీనగర్, కాంతి పవర్ ప్లాంట్‌ల నుంచి బీఎస్‌పీహెచ్‌సీ వాటాలు ఎన్‌టీపీసీకి విక్రయించాలనే ప్రతిపాదనలు చేశాయి. కాగా ఎన్‌టీపీసీ బీహార్‌లోని విద్యుత్ ప్లాంట్‌లతో పాటు రాజస్థాన్‌లోని విద్యుత్ ప్లాంట్‌లను టేకోవర్ చేసుకోవాలని చూస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం దీనిపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.



మొండి బకాయిలు ఫర్ సేల్

• ఎస్‌బీఐ, యూకో బ్యాంకులు సిద్ధం

• రూ.1,245 కోట్ల ఆస్తుల వేలం



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూకో బ్యాంకులు తమ ఖాతా పుస్తకాల్లో ఉన్న మొండిబకాయిలు విక్రయించడానికి సిద్ధం అయ్యాయి. మొత్తం రూ.1,245 కోట్ల ఆస్తులు విక్రయించడానికి ఏఆర్‌సీ, బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఎఫ్‌ల నుంచి బిడ్‌లను ఆహ్వానించాయి. ఇటీవల కాలంలో బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండిబకాయిల పట్ల ప్రభుత్వంతో పాటు ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేశాయి. తాజాగా ఆర్‌బీఐ దీనికి సంబంధించిన గైడ్‌లైన్స్‌ను కూడా విడుదల చేసింది. పీఎస్‌యు బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండిబకాయిల ఆస్తులను విక్రయించి ఇచ్చిన రుణాలను రాబట్టుకోవాలని బ్యాంకులకు ఆర్‌బీఐ దిశానిర్దేశం చేసింది. దీంతో ఎస్‌బీఐ, యూకో బ్యాంకులు తమ ఖాతా పుస్తకాల్లో ఉన్న ఎన్‌పీఏలు లేదా మొండిబకాయిల ఖాతాలను విక్రయించాలని నిర్ణయించాయి. జినిత్ బిర్లా (ఇండియా)లిమిటెడ్, సోనా అల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తులను ఎఆర్‌సీ/ బ్యాంకులు/ ఎన్‌బీఎఫ్ సీలు/ ఎఫ్‌ఐలకు విక్రయించాలనుకుంటున్నట్లు ఎస్‌బీఐ బిడ్ డాక్యుమెంట్లో పేర్కొంది. సోనా అల్లాయ్స్ ఎస్‌బీఐకి రూ.647.64 కోట్లు బకాయి పడితే.. జెనిత్ బిర్లా రూ. 139.36 కోట్లు బకాయి పడింది. ఆసక్తిగత పార్టీలు (సంస్థలు) మార్చి 12వ తేదీగా దరఖాస్తు చేసుకోవచ్చునని... ఈ-బిడ్‌లు (ఈ-వేలం) మార్చి 23న జరుగుతుందని ఎస్‌బీఐ ప్రకటనలో వివరించింది. ఇక యూకో బ్యాంకు విషయానికి వస్తే తమ ఖాతాలో మొత్తం 13 ఎన్‌పీఏ ఖాతాలను గుర్తించింది. వీటి మొత్తం విలువ రూ. 457.98 కోట్లుగా తేలింది. యూకో బ్యాంకు కూడా ఎఆర్ సీలు, బ్యాంకులు, ఫైనాన్షియల్ ఇన్సిస్టిట్యూట్ (ఎఫ్ఐ)లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు(ఎన్‌బీఎఫ్‌సీ)లు మార్చి 13వ తేదీన ఎన్‌పీఏ ఆస్తులను విక్రయిస్తామని స్పష్టం చేసింది. గత వారం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియాలు, మౌలిక రంగానికి చెందిన ప్రాజెక్టులకు రుణాలు ఇచ్చే ఐఎఫ్‌సీఐ బ్యాంకులు... ఈ మూడు బ్యాంకులు కలిసి వివిధ రకాల కంపెనీలకు ఇచ్చిన రుణాల్లో రూ.16,349 కోట్లు ఎన్‌పీఏ ఖాతాలుగా మారిపోయాయి. కాగా ఈ ఎన్‌పీఏలను విక్రయించి తమ అప్పులను రాబట్టుకోవాలని ఈ బ్యాంకులు నిర్ణయించాయి. ప్రస్తుతం ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో మొండిబకాయిలు లేదా ఎన్‌పీఏ విపరీతంగా పెరిగిపోతున్నాయి. డిసెంబర్ చివరి నాటికి ఈ బ్యాంకుల్లో ఎన్‌పీఏ రూ.8.41 లక్షల కోట్లకు చేరాయి. దీంతో ఇటీవల కాలంలో పీఎస్‌బీ బ్యాంకులు రుణాలు వసూలు చేసుకోవడానికి గట్టి చర్యలు తీసుకోవడం మొదలుపెట్టాయి. ఇచ్చిన రుణాలు మొండిబకాయిలు మారిపోతే వెంటనే స్పందించి వాటిని రాబట్టుకోవడానికి గట్టి చర్యలకు ఉపక్రమిస్తున్నాయి. కంపెనీలకు ఇచ్చిన బకాయిల నువసూలు చేసుకోవడానికి లేదా ఎన్‌పీఏ ఖాతాలను వసూలు చేసుకోవడానికి నేషనల్ కంపెనీ లా ట్రైబ్యూనల్ (ఎన్‌సీఎల్‌టి)ని ఆశ్రయించి బకాయిలు రాబట్టుకుంటున్నాయి.

అదే కార్పోరేట్ రుణాల విషయానికి వస్తే ..

మేనేజర్‌కు స్వేచ్ఛ ఉండదు. ఎందుకంటే రాజకీయ నాయకుల జోక్యం ఎక్కువగా ఉంటుంది. బ్యాంకు మేనేజర్లపై ఒత్తిడి తెచ్చి రుణాలు ఇప్పించుకుంటాయి. అటు తర్వాత ఈ రుణాలు బ్యాంకులకు తిరిగి చెల్లించరు. ఈ జాఢ్యానికి అడ్డుకట్ట వేయడానికి ఒక్కటే ఒక్క పరిష్కారం పీఎస్‌యు బ్యాంకులను ప్రైవేట్‌పరం చేయడమేనని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకుల్లో తమ వాటాను 33 శాతానికి కుదించుకోవాలని సూచిస్తున్నాయి. అదే సమయంలో ఈ వాటాలను ఏకంపెనీలు కొనుగోలు చేస్తున్నాయో కూడా ప్రభుత్వం ఓ కంట కనిపెడుతూ ఉండాలి. కొత్తగా బ్యాంకింగ్ లైసెన్సుల జారీ విషయంతో ఆర్‌బీఐ జాగ్రత్తగా ఆచితూచి వ్యవహరించింది. అదే విధంగా పెద్ద కార్పొరేట్‌లకు రుణాలు ఇచ్చే విషయంలో ఆర్‌బీఐ కఠిన నిబంధనలు అమలు చేయాలని బ్యాంకులను ఆదేశించడం శుభపరిణామమని ఈ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు.

పీఎస్‌యు బ్యాంకులు 5 లేదా 6 చాలా?


పీఎన్‌బీలో నీరవ్‌మోడీ స్కాం వెలుగు చూసిన తర్వాత ఆర్థికవేత్తలు, వ్యాపారస్తులు, విశ్లేషకులు ప్రధానంగా ఒక అంశం ప్రస్తావించారు. ప్రభుత్వం వ్యాపారం చేయరాదు .... ప్రస్తుతం నీరవ్ ఇచ్చిన షాక్ నుంచి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలని... ఇది ప్రభుత్వానికి చక్కటి అవకాశం అని చెబుతున్నారు. చాలా మంది ఆర్థికవేత్తలు, విశ్లేషకులు కూడా గత అర్ధదశాబ్దం నుంచి ఒక్కటే మాట పదే పదే ప్రభుత్వానికి చెబుతూ వస్తున్నారు. ప్రభుత్వారంగానికి చెందిన 21 బ్యాంకులు గతంలో 27 బ్యాంకులు ఉండేవి.. (భారతీయ మహిళా బ్యాంకులతో పాటు స్టేట్ బ్యాంకుకు చెందిన అనుబంధ) బ్యాంకులను విలీనం చేసిన తర్వాత ఇవి ప్రస్తుతానికి 21కి దిగివచ్చాయి.) ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఐదు లేదా ఆరు పెద్ద బ్యాంకులకు పరిమితం చేస్తే చాలు అని అంటున్నారు.అయితే ఈ ప్రతిపాదన చాలా మందికి రుచించడం లేదు.. వారిలో ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్‌కుమార్ కూడా ఒకరు. వారంతా చెప్పేదేమిటంటే ప్రైవేట్ బ్యాంకుల్లో కూడా మొండిబకాయిలు బెడద కొనసాగుతోందని వాదిస్తున్నారు. ఆయనతో పాటు మరి కొందరు కూడా ప్రైవేట్ బ్యాంకుల్లో కూడా మొండి బకాయిలు పెరుగుతున్నాయని వాదిస్తున్నారు. ఇక్కడ వాస్తవం మాత్రం ఇలా ఉంది. సెప్టెంబర్ 30, 2017 నాటికి ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకుల్లో మొత్తం మొండిబకాయిలు రూ.6,89,806 కోట్లు ... పీఎస్‌యు బ్యాంకులు ఇచ్చిన మొత్తం రుణాల్లో ఇది 13.5 శాతంగా తేలింది. దీని గురించి సామాన్యపాఠకుడు కూడా సులువుగా అర్థం చేసుకోవాలంటే బ్యాంకు ఇచ్చిన రూ.100 రుణంలో 13.5 శాతం తిరిగి రావడం లేదు.. బ్యాంకు నుంచి రూ.100 తీసుకొన్న వ్యక్తి రూ.13.5 శాతం తిరిగి చెల్లించడం లేదని అర్థం. దీనికి వ్యతిరేకంగా ప్రైవేట్ రంగానికి చెందిన బ్యాంకుల్లో మొండిబకాయిలు అదే కాలంలో రూ.86,281 కోట్లుగా ఉన్నాయి. అంటే ఇక్కడ ఎన్‌పీఏ 3.8 శాతంగా ఉంది. వివరంగా చెప్పాలంటే బ్యాంకు రూ.100 రుణం ఇస్తే రూ.3.8 తిరిగి బ్యాంకుకు రావడం లేదు. అయితే ఇక్కడ కూడా పరిస్థితి అంత బాగా లేదని చెప్పుకోవచ్చు..

పీఎస్‌యు బ్యాంకుల మొత్తం ఎన్‌పీఏ రుణాలు 87.25 శాతం

పీఎస్‌యు బ్యాంకుల మొత్తం ఎన్‌పీఏ రుణాలు 87.25 శాతం తేలాయి.అదే సమయంలో పీఎస్‌యు బ్యాంకుల ఆస్తులు మాత్రం 68.9 శాతంగా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే ప్రైవేట్ బ్యాంకులతో పోల్చుకుంటే పీఎస్‌యు బ్యాంకుల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని ఖచ్చితంగా చెప్ప వచ్చు. అయితే ఇక్కడ ప్రైవేట్ బ్యాంకులు కూడా ఎన్ పీ ఏలతో సతమతమవుతున్నాయని వాదించే వారు ఉన్నారు. అయితే అది ఆయా బ్యాంకుల యాజమాన్యం సమస్య. ఇక్కడ పీఎస్‌యు బ్యాంకుల విషయానికి వస్తే ఇది భారతీయ పౌరుడు చెల్లించే పన్నులతో నడుస్తున్న బ్యాంకులు కాబట్టి ప్రజల సొమ్ము పెద్దలకు దోచిపెడుతున్నారనే విషయం స్పష్టంగా తెలుస్తోంది.

పీఎస్‌యు బ్యాంకుల్లో మొండిబకాయిలు రూ.6,19,265 కోట్లు


మార్చి 31,2017 నాటికి చూస్తే పీఎస్‌యు బ్యాంకుల్లో మొత్తం మొండిబకాయిలు రూ.6,19,265 కోట్లుగా తేలింది. వాటిలో 69 శాతం లేదా రూ.4,24,434 కోట్లు కార్పొరేట్లకు ఇచ్చిన రుణాలే. కార్పొరేట్లు పీఎస్‌యు బ్యాంకులనుంచి పెద్దమొత్తంలో రుణాలు తీసుకొని డిఫాల్ట్ అవుతున్నాయి. అదే రిటైల్ రుణాలు ఉదాహరణకు ఆటో రుణాలు, గృహరుణాల విషయానికి వస్తే చాలా తక్కువగా ఉన్నాయి. గృహరుణాల్లో ఒక శాతం, ఆటో రుణాలు 1.4 శాతం మాత్రమ డిఫాల్ట్ కనిపిస్తోంది. ఎందకింత వ్యత్యాసం అంటే రిటైల్ రుణాలు ఇచ్చే ముందు బ్యాంకు మేనేజర్ అన్నీ పత్రాలను గ్యారంటీగా తీసుకొని ఇచ్చిన రుణం తిరిగి వస్తుందా రాదా అని క్షుణ్ణంగా అధ్యయం చేసిన తర్వాత కానీ రుణం ఇవ్వడు.





ఎగుమతిదార్ల జీఎస్టీ రీఫండ్‌లివ్వండి

• ఆర్థిక మంత్రిత్వ శాఖతో పీఎంఓ



న్యూఢిల్లీ: కొత్త జీఎస్టి అమల్లోకి వచ్చి ఎనిమిది నెలలు అయిన తర్వాత కూడా తమకు జీఎస్టి రీఫండ్స్ రావడం లేదని ఎగుమతిదారులు పెద్దెత్తున ఫిర్యాదులు చేయడంతో ప్రధానమంత్రి కార్యాలయం స్పందించింది. వాణిజ్య, ఆర్థికమంత్రిత్వశాఖకు చెందిన ఉన్నతాధికారులతో పీఎంఓ సోమవారం నాడు సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో తయారీరంగానికి చెందిన ఎగుమతిదారులకు రీఫండ్స్ జాప్యం వల్ల ఎగుమతులపై ఎంత మేరకు ప్రభావం చూపుతుందనే అంశంపై చర్చిస్తారు. కాగా ఎగమతిదారులు తమకు రీఫండ్స్ ఇవ్వాలని గత ఐదు నెలల నుంచి వరుసగా పోరాడుతున్నారు. రీఫండ్స్ బకాయిల జాప్యం వల్ల మూలధనం కొరతతో ఇబ్బందులు పడుతున్నామని ఎగుమతిదారులు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే రెవెన్యూశాఖ మాత్రం ఎగుమతిదారులు కస్టమ్స్‌శాఖకు సమర్పించే దరఖాస్తులు (ఫాం)కు జీఎస్‌టిఎన్ నెట్‌వర్క్‌కు సమర్పించే దరఖాస్తుల్లో వ్యత్యాసం ఉందని వాదిస్తోంది. కాగా సెంట్రల్‌బోర్డు ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) మాత్రం గత అక్టోబర్ నుంచి రూ.4,000 కోట్ల వరకు రీఫండ్స్ చేసినట్లు చెబుతోంది. ఎగమతిదారులు జీఎస్టి నెట్‌వర్క్ (జీఎస్టిఎన్) ద్వారా సమర్పించే ఫాంలు ఉదాహరణకు జీఎస్‌టిఆర్ 1 లేదా టేబుల్ 6ఏ లేదా జీఎస్‌టిఆర్ 3బీ, కస్టమ్స్‌శాఖకు సమర్పించేషిప్పింగ్ బిల్లులో వ్యత్యాసాల కారణంగా రూ.10వేల కోట్ల వరకు క్లెయిములు నిలబడిపోయాయి. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం సోమవారం జరిగే సమావేశానికి ఆర్థికశాఖ కార్యదర్శి హస్ముఖ్ ఆదియా, వాణిజ్య కార్యదర్శి రితా టియోటియా, సీబీఈసీ చైర్‌పర్సన్ వనజా సర్నాతో పాటు విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ (డీజీఎఫ్‌టి)కి చెందిన ఉన్నతాధికారులు హాజరవుతారని అంటున్నారు. శనివారం నాడు జరిగిన జీఎస్టి కౌన్సిల్ సమావేశంలో ఈ- వాలెట్ స్కీంను అక్టోబర్ 1 వరకు వాయిదా వేసింది. ఈ వాలెట్ స్కీం ద్వారా ఎగుమతిదారులకు రీఫండ్‌లు ఇవ్వడం జరుగుతుంది. ఎగమతిదారుల ఇబ్బందుల సడలించేందుకు జీఎస్టి కౌన్సిల్ క్లెయిమ్ మినహాయింపులను మరో ఆరు నెలల పాటు అక్టోబబర్ 1, 2018 వరకు పొడిగించింది. ఇదిలా ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం ఎగుమతులు ఏప్రిల్ నుంచి జనవరి వరకు 11.75 శాతం పెరిగి 247.89 బిలియన్ డాలర్లకు చేరాయి.. కాగా క్రితం ఏడాది ఇదే కాలంలో 221.82 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

సైబర్ సెక్యూరిటీకీ భలే డిమాండ్

• ఏడాదిలో మూడు రెట్లు పెరిగింది

ముంబై: దేశంలో భారీ ఎత్తున పెరుగుతున్న సైబర్ దాడులతో పాటు ప్రభుత్వ స్థాయిలో సైబర్ గూఢచర్యం పెరిగిపోవడంతో ఈ రంగానికి చెందిన నిపుణుల డిమాండ్ విపరీతంగా పెరిగి పోయింది. కేవలం 12 నెలల కాలంలో వీరి డిమాండ్ మూడు రెట్లు పెరిగింది. కంపెనీలు కూడా సైబర్‌దాడులతో తమ సమాచారం లీక్ అవుతుందన్న ఆందోళనతో సైబర్ సెక్యూరిటి నిపుణులను పెద్దెత్తున రిక్రూట్ చేసుకొంటున్నాయి. దీంతో ఈ రంగానికి చెందిన నిపుణుల డిమాండ్ రోజు రోజుకు పెరిగిపోతోంది.

రాబోయే రోజుల్లో ఇంటర్నెట్ వినియోగంతో పాటు ఈ-కామర్స్‌కు డిమాండ్ ఊపందుకుంటోంది. కస్టమర్లకు ఈ కామర్స్‌పై కూడా అవగాహన పెరుగుతోంది. దీంతో సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెరుగుతోందని ఔట్‌బౌండ్ రిక్రూట్‌మెంట్ సొల్యూషన్ బీలాంగ్ తాజా నివేదికలో పేర్కొంది. గత 12 నెలల నుంచి కంపెనీలు సైబర్ నిపుణుల ఎంపిక సరళి గణాంకాలను పరిగణనలోకి తీసుకొని నివేదికలో తయారు చేసింది. కంపెనీలు తమ డేటాతో



పాటు సిస్టమ్స్‌ను సైబర్‌దాడుల పరం కాకుండా ఉండేందుకు సైబర్‌సెక్యూరిటి నిపుణులను టెక్, నాన్‌కంపెనీలు పెద్దెత్తున తీసుకుంటున్నాయి. ప్రస్తుతం దేశంలో టెక్, నాన్ కంపెనీల్లో సుమారు 10 వేల నుంచి 15 వేల వరకు ఉద్యోగాలున్నాయని పేర్కొంది. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటి నిపుణుల డిమాండ్ ఎక్కువగా టెక్నాలజీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఎక్కువగా ఉన్నాయని నివేదికలో వెల్లడించింది. వీటితో పాటు ఐటీఈఎస్‌లో 25 శాతం, సాఫ్ట్‌వేర్ ప్రొడక్టు(నాన్ సెక్యూరిటి) షేర్డు సర్వీసెస్ లేదా క్యాపిటివిస్ 24 శాతం, సెక్యూరిటీ కంపెనీలు 9 శాతం వరకు ఉన్నాయి.

వీరి డిమాండ్ దేశంలోని టాప్ 10 ఐటి హబ్‌లు ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, ముంబై, పూనేలతో పాటు ఇతర నగరాల్లో ఉంటాయని నివేదిక రూపొందించిన కౌల్ అన్నారు. రోజు రోజుకు టెక్నాలజీలో శరవేగంగా మార్పులు జరుగుతుండటంతో కంపెనీలు కూడా సైబర్ సెక్యూరిటి నిపుణలను రిక్రూట్ చేసుకునే పనిలో పడ్డాయి. నిపుణుల కొరత కారణంగా ఉన్న సిబ్బందికే శిక్షణ ఇచ్చి ఆ కొరతను నివారించుకోవాలనుకుంటున్నాయని నివేదికలో వివరించింది.

ఆరు రోజుల్లో... రూ.6వేల కోట్ల పెట్టుబడులు వెనక్కి



• నష్టాల్లో కొనసాగుతున్న స్టాక్ మార్కెట్లు • ఇతర మార్కెట్లకు తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు

న్యూఢిల్లీ : ఈ నెల మొదటి వారంలో కేవలం ఆరు ట్రేడింగ్ సెషన్‌లలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)లు క్యాపిటల్‌మార్కెట్ల నుంచి రూ.6,000 కోట్ల వరకు పెట్టుబడులు తరలించుకుపోయారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో అవకాశాలు మెరుగ్గా కనిపించడంతో దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు తప్పించి విదేశాలకు తరలిచుకుపోయాయి. ఈ నెల 1-9వ తేదీ వరకు ఎఫ్‌పీఐలు ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.2,410 కోట్లు, డెట్ మార్కెట్ నుంచి రూ.3,473 కోట్లు ఉపసంహరించుకుపోయారు. మొత్తానికి చూస్తే ఈనెల మొదటివారంలో రూ.5,883 కోట్లు దేశీయ మార్కెట్ల నుంచి తరలించుకుపోయారని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. దీనికి ముందు అంటే ఫిబ్రవరి నెలలో క్యాపిటల్ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు రూ. 11వేల కోట్ల వరకు తరలించుకుపోయారు. దీనికి ప్రధాన కారణం రాబోయే రోజుల్లో ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లు పెంచుతుందన్న అంచనాతో డాలర్‌కు డిమాండ్ పెరుగుతోందని, దీంతో పాటు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో పెట్టుబడులతో పెడితే లాభాలు మెరుగ్గా ఉంటాయనే అంచనాతో విదేశీ పెట్టుబడులు తరలిపోతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆర్థికమంత్రి దీర్ఘకాలికి మూలధనం లాభాలపై (ఎల్‌టిసీజీ) టాక్స్ విధిస్తామని ప్రకటించడంతో మొట్టమొదటిసారి విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. అటు తర్వాత ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న అంచనాతో పాటు రుణాలు ఖరీదైన వ్యవహారంగా మారుతాయన్న అంచనాతో విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు తరలించుకుపోవడానికి ప్రధాన కారణంగా మారింది. అటు తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంకులో భారీ స్కాం వెలుగుచూడ్డంతో దేశీయ మార్కెట్లు కుప్పకూలడం మొదలయ్యాయి.

ఈ వారం మార్కెట్ ఐఐపీ గణాంకాలు కీలకం

న్యూఢిల్లీ: ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీలకం కానున్న అంశాల విషయానికి వస్తే పారిశ్రామికోత్పత్తి గణాంకాలతో పాటు ద్రవ్యోల్బణం గణాంకాలు కీలకం కానున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణం 4.74 శాతానికి దిగిరావచ్చునని చెబుతున్నారు. కాగా జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతంగా నమోదుకాగా.. టోకు ద్రవ్యోల్బణం మాత్రం ఆరు నెలల కనిష్ఠానికి 2.84 శాతానికి దిగివచ్చింది.

డిసెంబర్ 2017లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.21 శాతం, టోకు ద్రవ్యోల్బణం 3.58 శాతంగా నమోదైంది. ఇదిలా ఉండగా పారిశ్రామికోత్పత్తి డిసెంబర్‌లో 7.1 శాతానికి ఎగబాకింది. తయారీ రంగం పుంజుకోవడంతో పాటు క్యాపిటల్‌గూడ్స్, నాన్ డ్యూరబుల్ కన్స్యూమర్‌గూడ్స్ రంగం జోరందుకోవడమే దీనికి కారణం.. ఈ వారం మార్కెట్ ట్రేడింగ్‌కు ఐఐపీ గణాంకాలతో పాటు రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు అత్యంత కీలకమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కాగా ఈ వారం మార్కెట్లకు ఆటో, ప్రైవేట్ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగాలకు చెందిన షేర్లపై ఓ కన్నేయవచ్చునని సూచిస్తున్నారు.

తరిగిన మార్కెట్ క్యాప్ రూ.67,153 కోట్లు

• టాప్ 10 కంపెనీల్లో ఎనిమిది పతనం

ముంబై : గత శుక్రవారంతో ముగిసిన స్టాక్ మార్కెట్లో టాప్ పది కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.67,153.81 కోట్ల వరకు క్షీణించింది. బెంచి మార్కు సూచి రెండు శాతం కంటే ఎక్కువగానే నష్టపోయింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్ తప్పించిన మిగలిన అన్నీ కంపెనీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐలమార్కెట్‌క్యాప్ భారీగా నష్టపోయింది. రిల్ మార్కెట్ క్యాప్ రూ.25,533.65 కోట్లు క్షీణించి రూ.5,77,751.85కోట్ల వరకు దిగివచ్చింది. ఓఎన్‌జీసీ మార్కెట్ క్యాప్ రూ.12,704.90 కోట్లు నష్టపోయి రూ.2,30,549.07 కోట్లకు పడిపోగా... స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ..ఎస్‌బీఐ మార్కెట్ క్యాప్ రూ.8,114.13 కోట్లు నష్టపోయి రూ.2,18,520.44 కోట్లకు, మారుతి సుజుకి ఇండియా మార్కెట్ క్యాప్ రూ.6,393.52 కోట్లు తగ్గి రూ.2,61,735.76 కోట్లకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మార్కెట్ విలువ రూ.6,367.69 కోట్లు నష్టపోయి రూ.4,80,675.75 కోట్లకు, హిందుస్తాన్ యూనీలీవర్ రూ.5,419.33 కోట్లు దిగివచ్చి రూ.2,81,514.77 కోట్లకు, ఐటీసీ రూ.5,122.88 కోట్ల క్షీణించి రూ.5,80,890.57 కోట్లకు దిగిరాగా.. దీనికి వ్యతిరేకంగా హెచ్‌డీఎఫ్‌సీ రూ.959.68 కోట్లు పెరిగి రూ.3,00,882.84 కోట్లకు, ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాప్ రూ.688.13 కోట్లతో రూ.2,54,099.85 కోట్లకు చేరింది. బీఎస్‌ఈలో టాప్ 10 కంపెనీలు ఇలా ఉన్నాయి. టీసీఎస్ నెంబర్‌వన్ స్థానంలో ఉండగా.. తర్వాతిస్థానాలు ఇలా ఉన్నాయి రిల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, మారుతి సుజుకి, ఇన్ఫోసిస్, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐలు ఆక్రమించాయి.



ప్రభుత్వానికి కోల్ ఇండియా డివిడెండ్ రూ.8,044 కోట్లు

• సీఐఎల్‌లో ప్రభుత్వం వాటా 78.55 శాతం

కోలకతా : ప్రభుత్వరంగానికి చెందిన కోల్ ఇండియా నుంచి ప్రభుత్వానికి 2017-18 ఆర్థిక సంవత్సరంలో మధ్యంతర డివిడెండ్ కింది రూ.8,044 కోట్లు వచ్చే అవకాశాలున్నాయి. షేరుపై రూ.16. 50 డివిడెండ్ ఇవ్వాలని కోల్ ఇండియా బోర్డు నిర్ణయించింది. మొత్తానికి ప్రభుత్వానికి కంపెనీ నుంచి రూ.10,242 కోట్ల డివిడెండ్ అందుతుంది. కాగా కోల్ ఇండియా బోర్డు ఆఫ్ డైరెక్టర్లు శనివారం నాడు సమావేశమై 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.10 ముఖ విలువ కలిగిన షేరుపై రూ. 16.50 మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని నిర్ణయించినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. కాగా కోల్ ఇండియా ప్రభుత్వానికి 78.55 శాతం వాటా కలిగి ఉంది. దీంతో పాటు ప్రభుత్వానికి రూ.2,085 కోట్లు అకౌంట్ టాక్స్ రావచ్చునని ఆశిస్తోంది.

ప్రమాద బీమా ఆంక్షలు కఠినతరం

- కార్లు, ఆటోలు, బైక్ నడిపే వారు తస్మాత్ జాగ్రత్త
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇక మీదట ప్రతి ఒక్క ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాల్సిందే. కారు నడిపే వారు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవలసిందే. ఆటో వాలాలు నిబంధనల మేరకే ప్రయాణికులను ఎక్కించు కోవలసిందే. ఈ మూడు మార్గదర్శకాలను ఉల్లంఘించి రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి బీమా వర్తించదు. ప్రమాదంలో క్ష తగాత్రులైన వారికి, మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు వర్తించవు. ఈ మేరకు సుప్రీంకోర్డు జారీ చేసిన మార్గదర్శకాలు కఠినంగా అమలు కాబోతున్నాయి. రోడ్డు ప్రమాదాలను నివారించడం, వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించకుండా పర్యవేక్షించడం కోసం సుప్రీంకోర్డు ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలను జారీ చేసింది. వాటి అమలు పైన రాష్ట్ర స్థాయిలో పోలీసు, రవాణా, బీమా అధికారుల స్థాయిలో కసరత్తు జరుగుతుంది. త్వరలోనే ప్రచార కార్యక్రమం ప్రారంభించి, సుప్రీంకోర్డు మార్గదర్శ కాలను అమలు జరపడానికి చర్యలు తీసుకుంటామని రవాణా అధికారులు పేర్కొన్నారు. ఏప్రిల్ నుండి ఈ నిర్ణయాలు అమలులోకి రాబోతున్నాయి. ఇక మీదట బీమా, రవాణా, పోలీసు అధికారులు సంయుక్తంగా నిబంధనల అమలును పర్యవేక్షించ వలసి ఉంటుంది. త్వరలోనే రాష్ట్ర స్థాయిలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు బీమా నిబంధనల అమలు పై సమావేశం కాబోతున్నారు. ఈ భేటీలో తీసుకునే నిర్ణయాల మేరకు క్షేత్ర స్థాయిలో సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలుకు మార్గదర్శకాలను జారీ చేయవలసి ఉంటుందని రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

1. సీటు బెల్టు పెట్టుకోకుండా ఉన్న సమయంలో కారు ప్రమాదానికి గురైన పక్షంలో బీమా వర్తించదు.

2. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైన పక్షంలో కూడా బీమా వర్తించదు.

3. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేర వేసే సందర్భాల్లో జరిగే ప్రమాదాలకు బీమా వర్తించదు. ప్రమాదాలకు గురైన వారికి, మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించే ప్రభుత్వ సథకాలు వర్తించవు.

4. అతి వేగంగా వెళ్లే వారిని గుర్తించి శిక్షలు విధించే అవకాశం ఉంది.

5. ఫోన్ మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన వారికి శిక్ష తప్పదు.

6. మద్యం సేవించి వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైన పక్షంలో ప్రమాదబీమా వర్తించదు. అలాంటి వారికి చట్టం పరిధిలో శిక్ష విధించే అవకాశం ఉంది.

7. తప్పుడు మార్గంలో ప్రయాణం చేస్తూ ప్రమాదానికి గురైన వ్యక్తులకు, వాహనాలకు బీమా వర్తించదు. అదే విధంగా సరైన మార్గంలో వచ్చే వారిపై ఎలాంటి కేసులు ఉండవు.

8. రాంగ్ రూట్‌లో వచ్చు వారివల్ల ఇతరులకు ప్రమాదం జరిగితే ఆ ప్రమాదానికి కారణమైన వ్యక్తి నుండి జరిమానా వసూలు చేసి ప్రమాదానికి గురైన వ్యక్తికి చెల్లించడం జరుగుతుంది. పరిహారం ఇవ్వని పక్షంలో కఠిన కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది.

9. ప్రమాదాలకు కారణమైన వారి పక్షాన మధ్యవర్తిత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం, వారి డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేయడం లాంటి కఠిన చర్యలు అమలు జరపడానికి అవకాశం ఉంది.

10. వేగాన్ని నియంత్రించడం, ప్రమాదాలను అరికట్టడం, వాహనదారులు నిబంధనలు పాటించడం కోసం మరిన్ని మార్గదర్శకాలను అమలు జరపడానికి చట్టం వీలు కల్పిస్తుంది.

ఇప్పటి వరకు బీమా నిబంధనల అమలులో కఠినత్వం లోపించింది. కొత్త నిబంధనలతో వాహనదారులు బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఉంది. రవాణా, పోలీసు, బీమా సంస్థలు నిబంధనల పరిధిలో కఠిన చర్యలు తీసుకున్న పక్షంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ప్రమాదాల్లో బీమా వర్తింపచేయకపోవడం కఠిన నిర్ణయాల్లో అత్యంత ప్రధానమైన అంశం అని అధికారులు తెలిపారు. నిబంధనల పరిధిలో వాహనాలను నడుపుతున్నప్పుడు జరిగే ప్రమాదాలకు మాత్రమే బీమా వర్తించే విధంగా మార్గదర్శకాలను కఠిన తరం చేశారు. ప్రస్తుతం బీమా చేసిన వాహనం ప్రమాదానికి గురైన పక్షంలో పరిహారం చెల్లించడం జరుగుతుంది. ఇక మీదట బీమా పరిహారం చెల్లించడంలో నిబంధనల అమలును కూడా అధికారులు పరిశీలించవలసి ఉంటుంది. గత కొంత కాలంగా రోడ్డు ప్రమాదాలు పెరగడం పట్ల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నిబంధనలు కఠినంగా అమలు జరపడంతో వాహనదారుల్లో మార్పు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ప్రమాదాలను నివారించడం, సురక్షితమైన ప్రయాణానికి దోహదపడే మార్గదర్శకాలను ప్రతి పౌరుడు వాహనం నడిపే సమయంలో పాటించాలని కోరింది. లేని పక్షంలో చట్టం పరిధిలో శిక్ష తప్పదని హెచ్చరించింది.

సునామీ పీడకలలకు ఏడేళ్లు

టోక్యో: 2011 మార్చి11న జపాన్‌లో సంభవించిన సునామి బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. టోక్యోతోపాటు ఈశాన్యప్రాంతంలో సునామి ధాటికి ఫుకుషిమా న్యూక్లియర్ పవర్ ప్లాంట్ పేలడంతో 18వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. సునామి ప్రభావానికి వందల సంఖ్యలో భవనాలు నేల మట్టమయ్యాయి. చాలా ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఈ భయానక ప్రకృతి విపత్తు జరిగి నేటితో ఏడేళ్లు పూర్తయింది. ఈ విపత్తులో 70వేల మందికి నిరాశ్రయులయ్యారని, సునామిలో దెబ్బతిన్న ప్రాంతాల పునర్నిర్మాణం కొన సాగుతుందని జపాని ప్రధాని షింజో అబే అన్నారు. రేడియో ధార్మిక న్యూక్లియర్ పవర్‌ప్లాంట్‌ను పునరుద్ధరించడం సవాలుతో కూడుకున్నదని, తిరిగి యథాస్థితికి రావాలంటే దశాబ్దాలు పట్టే అవకాశముందని షింజో అబే పేర్కొన్నారు.

తొలి రోజే రోబో ఉద్యోగం ఊడింది

కాలిఫోర్నియా: ఓ ప్రముఖ రెస్టారెంట్ బర్గర్ల తయారీకోసం రోబోని నియమించుకుంది. రోబో ద్వారా ఆ రెస్టారెంట్‌కి విసేష గుర్తింపు వచ్చింది. రోబో తయారు చేసిన బర్గర్లు తిందామని కస్టమర్లు రెస్టారెంట్ ముందు బారులుతీరారు. అయితే ఉద్యోగంలో చేరిన ఒక్క రోజులోనే ఆ రోబోకి చేదు అనుభవం ఎదురైంది. రద్దీ సమయంలో కస్టమర్ల నుంచి వచ్చిన ఆర్డర్లకు తగ్గట్టుగా వేగంగా పనిచేయదన్న కారణంగా, యాజమాన్యం దాన్ని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. పసడేనా ప్రాంతంలోని కాలిబర్గర్ రెస్టారెంట్ 'ఫ్లిప్పీ' అనే రోబోను నియమించుకుంది. దీని పని ఏంటంటే బర్గర్లను తిప్పి పెనంపై వేయడమే. అయితే రెస్టారెంట్లో రద్దీ సమయంలో భారీ సంఖ్యలో వస్తున్న ఆర్డర్లకు తగ్గట్టు పనిచేయలేకపోతుందట. దీంతో దాన్ని రూపొందించిన నిర్వాహకులకు అప్పగించారు. అయితే, కస్టమర్లను నిరుత్సాహ పరచకుండా ఉండేందుకు, 'త్వరలోనే ఫ్లిప్పీ బర్గర్లను తయారుచేస్తుంది' అనే బోర్డు ఆ రెస్టారెంట్లో దర్శనమిస్తోంది. దీని రూపకర్తలైన 'మిసో రోబోటిక్స్' సంస్థ ఈ విషయంపై స్పందించింది. రెస్టారెంట్లో రద్దీ సమయంలో ఆర్డర్లకు తగ్గట్టుగా వేగంగా పనిచేసేందుకు ఈ రోబో కోడింగ్‌లో మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ రోబోను మెరుగుపరిచేపనిలో పడింది. మరోవైపు రోబోతో కలిసి వేగంగా పనిచేయడంపై రెస్టారెంట్ సిబ్బందికి శిక్షణ కూడా ఇప్పిస్తున్నారు.

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

- మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్రతి 5 సంవత్సరాల లోపు చిన్నారికి పోలియోచుక్కలు వేయించే విధంగా తల్లీ దండ్రులు శ్రద్ధ వహించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మా రెడ్డి పేర్కొన్నారు. రెండోవిడత పల్స్‌పోలియో కార్య క్రమాన్ని ఆదివారం అఫ్జల్‌సాగర్ యూపీహెచ్‌సీలో పిల్లలకు పోలియోచుక్కలు వేసి మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలియోరహిత సమాజ సుస్థిర తకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. ప్రతిఒక్కరూ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈరోజు పోలియో చుక్కలు పడని వారు హైదరాబాద్‌లో వరుసగా రెండు రోజుల పాటు వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలను వేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేయా లని ప్రభుత్వం సంకల్పించిదన్నారు. 22,768 పోలియో కేంద్రాల ద్వారా 95 వేల 500 మంది సిబ్బంది పోలియో చుక్కలను వేస్తున్నామన్నారు. ప్రయాణాల్లో ఉన్న వారి కోసం 737 ట్రాన్సిట్ కేంద్రాల ద్వారా అన్ని బస్టాండ్లలో, రైల్వే స్టేషన్‌లలో మరియు ప్రధాన కూడళ్లలో ఈ పోలియో చుక్కలను వేయనున్నామన్నారు. వీరితో పాటు 787 మొబైల్ టీం, 2,280 రూట్ సూపర్ వైజర్స్, 8,711 మంది ఎఎన్ఎంలు, 27,045 ఆశా వర్కర్లు, 32,082 అంగన్‌వాడీ వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. ఈ ఏడాది జనవరి 28వ తేదీన నిర్వహించి మొదటి విడత పల్స్‌పోలియో కార్యక్రమం వందకు వంద శాతం విజయవంతం అయ్యిందన్నారు.

ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటీవ్, స్కూల్ ఎడ్యుకేషన్, పంచాయతీ రాజ్, ఐకేపీ, నేవీ, ఆర్టీసీ శాఖల సమన్వయంతో పోలియో చుక్కల కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పద్మజ, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ లలితకుమారి, డీఎంఈ రమేష్‌రెడ్డి, జేడీ విక్రం, చీఫ్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, డెమో ఆఫీసర్ జె.రాములు. ఓఎస్డీ గంగాధర్‌లు పాల్గొన్నారు.

ముంబైకి 'మహా' మార్చ్



ముంబై: అన్నదాత కన్నెర్ర చేస్తే.. దేశ ప్రజల ఆకలిని తీర్చే కర్షకుడు కదం తొక్కితే.. తానెదుర్కొంటున్న కష్టనష్టాలపై కడుపు మంటతో ఉద్యమ బాట పడితే.. తనగోడు వినిపించుకోని ప్రభుత్వంపై తిరుగుబావుటా ఎగురవేస్తే.. అది 'మహా' మార్చ్ అవుతుంది. నాసిక్ నుంచి మొదలై ముంబైకి చేరిన రైతు ఉద్యమం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాశం అయింది. ఎందుకంటే దేశంలో మిగతా రంగాలమాటెలా ఉన్నా, కడుపు మంటను అణచుకుని ఇప్పటి వరకు సహనంతో ఉన్నది ఒక్క రైతాంగం మాత్రమే. అలాంటి రైతాంగమే ఇప్పుడు రోడ్డెక్కింది. రికార్డు స్థాయిలో వేలాది మంది అన్నదాతలు 180 కి.మీ మేర పాదయాత్ర చేపట్టడం బహుశా ఇదే తొలిసారేమో!

రుణ మాఫీ అమలు సహా ఇతర సమస్యలు పరిష్కరించాలని సుమారు 30 వేల మంది రైతులు మార్చి 6న నాసిక్ నుంచి ముంబైకి మహా యాత్రగా బయల్దేరారు. మార్గ మధ్యలో వారికి థానె, పాల్ఘడ్ తదితర జిల్లాల రైతులు జతకలిశారు. నేడు ర్యాలీ ముంబై చేరుకునే సరికి రైతుల సంఖ్య 70 వేల దాకా చేరింది. భారతీయ కిసాన్ సభ ఈ పోరాటానికి నేతృత్వం వహిస్తోంది. ముంబై-అగ్రా జాతీయ రహదారి మీదుగా మార్చ్ కొనసాగింది. రైతులు భోజనాలు, నిద్ర లాంటి అవసరాలను రోడ్లపైనే తీర్చుకుంటున్నారు. ఈ మహా పాదయాత్రలో మహిళా రైతులు, 90 ఏళ్లకు పై బడిన వృద్ధులు కూడా ఉండటం పరిస్థితి తీవ్రతను చాటిచెబుతోంది.

ఈ ఏడాది అకాల వర్షాలు రైతన్నలను నిండా ముంచాయి. పింక్ బాల్ వార్మ్ చీడ పత్తి పంటను దెబ్బతీసింది. ఫిబ్రవరిలో కురిసిన వడగళ్ల వానలకు లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 19 జిల్లాల్లో రబీ పంట తుడిచిపెట్టుకుపోయింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు చూస్తూ ఉంది. గత ఏడాది మహారాష్ట్ర సర్కార్ రూ. 34 వేల కోట్ల రుణాల మాఫీకి హామీ ఇచ్చినా అది క్షేత్రస్థాయిలో సరిగా అమలు కాలేదు. దీంతో అన్నదాతల్లో అసంతృప్తి కట్టలు తెంచుకుని ఉద్యమానికి దారి తీసింది.

బడ్జెట్ భరోసా!

- వంద శాతం ఆచరణాత్మకం కావాలి
- అప్పుడే విశ్వసనీయత పెరిగేది
- ఏపీ ప్రభుత్వానికి నిపుణుల సూచనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: విభజనానంతర ఆర్థిక ఇబ్బందుల్లో కూడా అన్ని కులాలు, మతాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని భారీ బడ్జెట్ ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేటాయింపులన్నింటిని నూరుశాతం వ్యయం చేయా ల్సిన ఆవశ్యకత ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. మన దేశంలో బడ్జెట్‌ను ఆషామాషీగా భావిస్తారు. ప్రతిపాదనల్ని పలు సార్లు సవరిస్తారు. బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఆ ఖాతాలకు విడుదల చేసిన నిధులు చాలా తక్కువగా ఉంటాయి. బడ్జెట్ పేరిట ఆయా వర్గాల్ని ఆకర్షించి తమకు అనుకూలంగా మార్చుకోవడం తప్ప పలు సందర్భాల్లో ఈ పథకాల వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరదు. బ్రిటన్‌లో ఒకసారి విద్య ఖాతా క్రింద కేటాయించిన నిధులు ఖర్చుకాలేదు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ప్రభుత్వం భారీ ప్రకటనచ్చింది. నిధులు మురిగిపోతున్నందున అర్హులంతా ముందుకొచ్చి దరఖాస్తులు చేసుకుని ఈ ఖాతా క్రింద ప్రయోజనాలు పొందాల్సిందంటూ ఆ ప్రకటనలో కోరింది. కేటాయింపుల్ని పూర్తిగా వ్యయం చేయలేని పక్షంలో ప్రభుత్వం ప్రజలకు, విపక్షాలకు జవాబుదారి కావాల్సి ఉంటుంది. అయితే భారత్‌లో ఇలాంటి సంప్రదాయం లేకపోయినప్పటికీ ప్రజల పట్ల బాధ్యత వహిస్తున్న ప్రభుత్వం ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈసారి బడ్జెట్‌లో సమాజంలోని అన్ని కులాల సంక్షేమానికి నిధులు కేటాయించారు. వారంతా దీనిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తమకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశిస్తున్నారు. తమ జీవన ప్రమాణాలు పెరుగు తాయని భరోసాగా ఉన్నారు. అలాగే విద్య, వైద్యం వంటి రంగాలకు కేటాయింపులు పెంచడంతో సమాజంలోని అన్ని వర్గాలు భవిష్యత్ పట్ల భరోసాగా ఉన్నాయి. అయితే ఇవేవీ కేవలం ప్రకటనలు, ఊరింపులకే పరిమితం కాకూడదు. ఆచరణాత్మకలోకి వచ్చినప్పుడే ప్రభుత్వం పట్ల విశ్వసనీయత పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. అసలే దేశంలో వందలు, వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ఐదారు కోట్లు కేటాయించడం పరిపాటిగా మారింది. కొన్ని సందర్భాల్లో ఈ మొత్తాన్ని కూడా వ్యయం చేయడంలేదు.

రహదారుల నిర్మాణానికి భూసేకరణ అడ్డంకి

ఒప్పించేందుకు అధికారుల తిప్పలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో చేపడుతున్న రహదారుల నిర్మాణానికి భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారింది. భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారడంతో నిర్ణీత కాలంలో రోడ్లు పూర్తి చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో రైతులను భూ యజమానులను ఒప్పించేందుకు అధికారులు తిప్పలుపడు తున్నారు. భూముల ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో మార్కెట్ ధరకు భూ పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఒక్కో ప్రాంతంలో ఒక్కోవిధంగా భూ ధరలు ఉంటున్నాయి. మారుమూల ప్రాంతాల్లో భూసేకరణ కు ప్రధానంగా అభ్యంతరాలు ఎదురుకానప్పటికీ , అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోనే ఈ సమస్య ఎదురవుతోంది. రహదారులు , భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహిస్తున్న ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాల్లో భూసేకరణ అంశమే ప్రధానంగా చర్చకు వస్తోంది. ప్రభుత్వ పరంగా పరిహారం చెల్లిద్దామని, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన కోరటం, భూ యజమానులు, అధికారుల మధ్య ఒప్పందాలు జరగకపోవడం షరా మామూలుగా మారింది. అటవీభూముల సమస్యలు కూడా రహదారుల నిర్మాణాలు వేగవంతం కాకపోవడానికి మరొక కారణమని సంబంధిత అధికారి ఒకరు చెప్పారు. అటవీ అనుమతుల విషయంలో నెలల తరబడి జాప్యం జరుగుతుండడంతో రహదారుల నిర్మాణాలు వేగవంతం కావడం లేదని అంగీకరించారు. రాష్ట్రంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఐ) , నేషనల్ హైవే, స్టేట్ రోడ్స్‌గా మూడు విభాగాలుగా రహదారుల నిర్మాణం జరుగుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ఎన్‌హెచ్ఎఐకి 3324.491 హెక్టార్లు, జాతీయ రహదారులకు 265. 790 హెక్టార్లు, స్టేట్ రోడ్స్‌కు 578. 151 హెక్టార్లు మొత్తం 4168.432 హెక్టార్ల భూములు అవసరమవుతాయి. వీటితో పాటు పంచాయతిరాజ్ శాఖ నుంచి రహదారుల శాఖకు బదలీ అయిన రహదారులు 16,260 కిలోమీటర్ల రహదారుల్లో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని చోట్ల పంచాయతిరాజ్ శాఖ రైతులకు పరిహారం చెల్లించకుండానే రోడ్లు వేయడంతో రైతులు కొన్ని చోట్ల తమ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. భూములకు పరిహారం చెల్లిస్తే తమకు అభ్యంతరం లేదని వారంటున్నారు.ఇలాంటి సమస్యలు కూడా ప్రభుత్వం చొరవతో పరిష్కరిస్తోంది. రహదారుల నిర్మాణంతోనే గ్రామ సీమలు అభివృద్ధి చెందుతాయని నమ్ముతున్న ప్రభుత్వం ఆ దిశలో భూసేకరణకు చేస్తున్న కృషి పలు కారణాల వల్ల జాప్యం జరుగుతోంది. ప్రస్తుతానికి చర్చలకే పరిమితమైన ప్రభుత్వం అవసరమైతే నూతనంగా తీసుకువచ్చిన భూసేకరణ చట్టంతో భూ సేకరణకు సిద్ధం అవుతోంది.

హోదా టెన్షన్

తెలంగాణ కమలనాథుల్లో మొదలైన టెన్షన్?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర కమలనాథులు కొత్త గుబులు పట్టుకుంది. ఏపీకీ ప్రత్యేక హోదా...ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చే విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ఆ రాష్ట్ర ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అంశంపై ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వాడివేడిగా చర్చ సాగుతోంది. ఈ పరిణామాలే తెలంగాణ రాష్ట్ర కమలనాథుల్లో తీవ్ర కలవరానికి గురి చేస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ప్రత్యేక హోదా...ప్యాకేజీ....ఇతర రాయితీలు ఇచ్చే విషయంపై తెలంగాణకు ప్రత్యక్షంగా ఎటువంటి సంబంధం లేనప్పటికీ.... సీమాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజలు పెద్దసంఖ్య రాష్ట్రంలో నివసిస్తున్నారు. ఏపీకీ జరుగుతున్న అన్యాయం...అక్కడి రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలంగాణ సీమాంధ్రులు పరిశీలిస్తున్నారు.ముఖ్యంగా రాష్ట్రంలో పలు జిల్లాలతో పాటుగా గ్రేటర్ పరిధిలోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీమాంధ్రుల సంఖ్య చాలా ఎక్కువ. ముఖ్యంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి తదితర నియోజకవర్గాల్లో ఆ ప్రాంత వాసులే అత్యధికంగా నివసిస్తున్నారు. అలాగే సనత్‌నగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ తదితర నియోజకవర్గాల్లోనూ సీమాంధ్ర ప్రాంత వాసుల సంఖ్యకు కొదవలేదు. దీని కారణంగానే గత అసెంబ్లీ ఎన్నికల్లో సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా తెరాస ప్రభావం చాలా బలంగా వీచినప్పటికీ....గ్రేటర్ పరిధిలో మాత్రం తెదేపా, భాజపా కూటిమి సంపూర్ణ ఆధిక్యాన్ని సాధించిన విషయం తెలిసిందే. పాతబస్తీలోని ఎనిమిది

నియోజకవర్గాలను

మినహాయిస్తే సీమాంధ్ర వాసుల ప్రభావమున్న అన్ని సె గ్మెంట్లలో దాదాపుగా భాజపా, తెదేపా అభ్యర్థులే ఘన విజయం సాధించారు. కాగా మరో సంవత్సరం వ్యవధిలో పార్లమెంట్‌కు, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి సీమాంధ్ర ఓటర్ల మద్దతుతో విజయం సాధించాలని కమలనాథులు సమాయత్తం అవుతున్నారు. వ్యూహాలకు పదునుపెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో ఒక్కసారిగా భాజపా జాతీయ నాయకత్వం...మోదీ సర్కార్‌పై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు,,,ఓటములను శాసించే సీమాంధ్రులు భాజపాను కరుణిస్తారా? అని అప్పుడే కొందరు కమలనాథులు ఆరాతీసే పనిలో నిమగ్నమయ్యారు. తెలంగాణలో భాజపా రోజురోజుకు పుంజుకుంటున్న సమయంలో....దేశ వ్యాప్తంగా నరేంద్రమోదీకీ ఆదరణ పెరుగుతున్న అంశాలతో ....ఈ దఫా తెలంగాణలో అధికారాన్ని దక్కించుకోవాలని పార్టీ నేతలు ఉవ్విళ్లురూతున్నారు.

21రోజులు..9నియోజకవర్గాలు

- ప్రకాశం జిల్లాలో 270కి.మీల పాదయాత్ర
- జోష్ పెంచిన జగన్

ఒంగోలు, ప్రభ న్యూస్ బ్యూరో: మిగతా జిల్లాలతో పోలిస్తే ప్రకాశం జిల్లాలో జగన్ ప్రజా సంకల్పయాత్రకు మంచి మైలేజ్ లభించింది. 21 రోజుల తన పాదయాత్రలో జగన్ ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఆదరణ కనిపించింది. ప్రత్యేక హోదా పోరాటానికి ప్రకాశం జిల్లా వేదికగా జగన్ రూపకల్పన చేయడంతో ఆయన పర్యటనకు, ప్రసంగాలకు రాష్ట్రవ్యాప్తంగా స్పందన లభించింది. ఈ 21 రోజులలో జగన్ 270 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. ప్రజా సంకల్పయాత్ర ద్వారా రాష్ట్రం మొత్తం తనవైపు తిప్పుకోవడంలో జగన్ సఫలీకృతుడైనా జిల్లా పార్టీలో విభేదాలు మాత్రం సమసిపోలేదు.

ఫిబ్రవరి 16న కందుకూరు నియోజకవర్గంలో పాదయాత్ర ప్రారంభించిన జగన్ మార్చి 11 న చీరాల నియోజకవర్గం ఈపూరుపాలెం వద్ద జిల్లాలో ప్రజా సంకల్పయాత్రను ముగించారు. తన పాదయాత్రలో భాగంగా కందుకూరు, కొండపి, కనిగిరి, మార్కాపురం, సంతనూతలపాడు, దర్శి, అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలలో పాదయాత్ర చేశారు. ఒంగోలు, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలకు మాత్రమే ప్రజా సంకల్పయాత్రలో మినహాయింపు లభించింది. ప్రతి నియోజకవర్గంలోనూ అక్కడి నాయకులు, పార్టీ శ్రేణులు, జగన్ పాదయాత్రకు భారీ ఏర్పాట్లు చేయగలిగారు.

ఎవరూ పిలవకుండానే పెద్ద సంఖ్యలో ప్రజానీకం హాజరుకావడం పార్టీ వర్గాలను సైతం ఆశ్చర్యచకితులను చేసింది. ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని పర్యటన విజయవంతం కావటం వెనుక విశేషంగా కృషి చేశారు. నియోజకవర్గాలలో ఉండే అసమ్మతి నాయకులను ఎప్పటికప్పుడు పిలిపించి మాట్లాడి బుజ్జగించారు.

ముందు జగన్ పర్యటన విజయవంతం చేద్దామని, ఆ తరువాత టిక్కెట్లు విషయం మాట్లాడుదామని ఒప్పించడం ద్వారా ప్రతి నియోజకవర్గం లోని నాయకులను ఏకతాటి మీదకు తీసుకురాగలిగారు. కందుకూరు నియోజకవర్గంలో మొదటి రోజు పెద్దగా జన స్పందన కనిపించకపోయినప్పటికీ రెండవ రోజు నుంచి పాదయాత్రకు ఉప్పెనలా తరలివచ్చారు. దీంతో తొలుత పాదయాత్ర ఆరు నియోజకవర్గాలే అనుకున్నా చివరికి 9 నియోజకవర్గాలలో 270 కిలోమీటర్లు సాగి ప్రకాశం జిల్లాలో విశేష స్పందన లభించింది.

సినీ ఫక్కీలో దోపిడీలు..ప్రజల బేజారు

మొన్న హైదరాబాద్ పాతబస్తీ..నేడు రంగారెడ్డి జిల్లా గూడురు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినీ పక్కీలో దుండగులు దోపిడీలకు పాల్పడుతున్నారు. ఆయుధాలతో బెదిరిస్తున్నారు. అవసరమైతే గాలిలో కాల్పులకు సైతం వెనుకాడటం లేదు. అచ్చు సినిమాల్లో దోపిడీలు ఏ విధంగా ఉంటాయే మక్కీ మక్కీగా అనుసరిం చేస్తున్నారు దుండగులు. అందినంత మొత్తంలో ఆభరణాలు, నగదును దోచేస్తున్నారు. మొన్న హైదరాబాద్ పాతబస్తీలో బంగారు నగల తయారీ దుకాణంలో మారణా యుధాలతో సినీ పక్కీలో దుండగుల దోపిడీ ఘటన మరువకమునుపే తాజాగా రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరు మండలం గూడూరు సమీపంలో శనివారం అర్థరాత్రి నాటు తుపాకీతో బెదిరించి దుండగులు దారిదోపిడీకి పాల్పడ్డ విషయం వెలుగు చూసింది. హైదరాబాద్ పాతబస్తీలో దోపిడీ ఘటన పట్టపగలు చోటు చేసు కోగా.. రంగారెడ్డి జిల్లాలో గూడురు సమీపంలో ఘటన అర్థరాత్రి పూట చోటు చేసుకోవడం గమనార్హం. తాజా ఘటన వివరాల్లోకి వెళితే.. దశరథ్ అనే వ్యక్తి మండల కేంద్రంలో ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్ వ్యాపారం నిర్వ హిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటికి వెళు తుండగా రోడ్డుపై రాళ్లు అడ్డంగా పెట్టి ఉన్నాయి. అతడు తన వాహనాన్ని ఆపాడు. ఈలోగా రోడ్డు పక్కనే ఉన్న తుప్పల్లో నుంచి వచ్చిన గుర్తు తెలియని దుండగలు దశరథ్ కళ్లలో కారం చల్లి అతడి దగ్గరున్న రూ.2 లక్షల నగదును ఉడాయించి పరారయ్యారు.బాధితుడు దశరథ్ వెంటనే తేరుకుని అరుచుకుంటూ పక్కనే ఉన్న తండాకు చేరుకున్నాడు. అక్కడి ప్రజలకు జరిగిన విషయం పూసగుచ్చినట్లు వివరించాడు. అనంతరం గ్రామస్తులతో కలిసి దోపిడీకి పాల్పడ్డ వ్యక్తుల కోసం గాలించగా ఓ వ్యక్తి దొరికాడు. అతడ్ని పట్టుకునే క్రమంలో అతడి వద్ద నాటు తుపాకీ ఉన్నట్లు గుర్తించారు. అతడ్ని పట్టుకునే సమ యంలో జరిగిన పెనుగులాటలో నాటు తుపాకీ పేలినట్లు సమా చారం. ఘటనపై సమాచారమందుకున్న పోలీసులుఘటనాస్థలిని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దోపిడీకీ పాల్పడ్డ వారిలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసు కున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పాతబస్తీ దోపిడీ ఘటనలో దుండగులు దోపిడీకి పాల్పడిన తర్వాత అక్కడి సీసీ కెమెరాల వైర్లను కట్ చేసినట్లు వార్తలొచ్చాయి. అత్యంత పక డ్బం దీగా ప్లాన్‌ని అమలుపరుస్తూ దుండగులు తమ చతుర తను కనబరుస్తున్నారు. ఊహించని విధంగా దుండ గులు దోపిడీ వ్యూహాలను రచించి అమలుపరుస్తూ భారీమొత్తంలో ఆభరణాలు, నగదు ను అపహరిం చేస్తూ ఎంచక్కా ఉడాయిస్తున్నారు. టెక్నాలజీ వినియోగంతో నేరగాళ్ల పీచమణుస్తామని అధికారుల మాటలకు జరుగుతున్న ప్రధాన ఘటనలకు సంబంధం ఉండకపోవడం శోచనీయం.

పెట్టుబడి చెక్కులు, పాస్‌బుక్‌లు ఏకకాలంలో పంపిణీ

●ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభం ●వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వం మార్గదర్శకాలు ●గ్రామస్థాయిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల యంత్రాంగం ద్వారా కసరత్తు ●రైతు సమన్వయ సమితుల భాగస్వామ్యంతో పంపిణీకి చర్యలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అన్నదాతలకు మెరుగైన ప్రయోజనాన్ని కలిగించే రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు ఒకేసారి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు వచ్చే నెల రెండోవారంలో తేదీలను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశాలిచ్చారు. ఆ లోపు పూర్తిస్థాయిలో బేరర్ చెక్కులు, పాస్ పుస్తకాల ముద్రణను పూర్తి చేయాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులకు సూచించారు. ఇదివరకే తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ నెల 11నే పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టాల్సి ఉన్నప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ముద్రణ ఆలస్యమైంది. ప్రస్తుతం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనందున ఆ కార్యక్రమాన్ని ఏప్రిల్ రెండో వారానికి వాయిదా వేశారు. అలాగే మే నెలలో ప్రారంభించాలనుకున్న పెట్టుబడి రాయితీ పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని పక్షం రోజుల ముందుగానే మొదలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ఎనిమిది జాతీయ బ్యాంకుల ద్వారా డిజిటల్ సంతకాలతో చెక్కుల ముద్రణ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ నెలాఖరు నాటికి దాదాపు 72 లక్షల చెక్కుల ముద్రణ కార్యక్రమం పూర్తి కానుంది. ఈ రెండు కార్యక్రమాలు రైతులకు సంబంధించినవే కావడంతో ఒకేసారి పంపిణీ చేస్తే సమయం కలిసి వస్తుందని ముఖ్యమంత్రి భావించారు. గ్రామస్థాయిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల యంత్రాంగం ద్వారా రైతు సమన్వయ సమితిల భాగస్వామ్యంతో పకడ్బందీగా పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఈ ఏడాది త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'పెట్టుబడి మద్దతు' పథకంపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. ఈ అంశంపై మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రికి సమర్పించిన నివేదిక ప్రకారం అధికార యంత్రాంగం ముందడుగు వేస్తోంది. బేరర్ చెక్కుల రూపంలో ఎకరాకు రూ.4వేల చొప్పున ఏప్రిల్ రెండోవారం నుంచి పంపిణీ చేసేందుకు వ్యవసాయశాఖ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ పథకానికి ప్రతిపాదించిన అంచనాల ప్రకారం రూ.6వేల కోట్ల నగదును సమకూర్చుకోవడంలో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో సమస్యను అధిగమిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో సాధ్యాసాధ్యాలపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇందుకు సంబంధించిన నిధులను సమకూర్చుకునేందుకు, ప్రత్యామ్నాయ పద్ధతుల్లో కరెన్సీ కొరతను అధిగమించేందుకు ఆర్థికశాఖ అధికారులు మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ పథకం అమలుకు సులువైన మార్గాలపై తాజాగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) ఇచ్చిన నివేదిక ప్రకారం చెక్కుల పంపిణీలో వ్యూహాత్మక టైమ్ షెడ్యూల్‌ను అమలు చేయనున్నారు. గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల భాగస్వామ్యంతో, స్థానిక బ్యాంకుల సమన్వయంతో లబ్ధిదారులైన రైతులు చెక్కులను విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. అయితే ఒక్కో మండలం పరిధిలో ఒక్కో తేదీని ఖరారుచేసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో ఉన్న నగదును రొటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ విధానాన్ని అవలంబిస్తే కొంత ఎక్కువ సమయం అవసరమవుతున్నందున ఏప్రిల్ రెండోవారం నుంచే చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

రైతు కుటుంబాల బహుళ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భూ యాజమాన్య హక్కులకు దృఢపరుస్తూ పట్టాదారు పాస్‌బుక్‌లను తయారీ చేయిస్తున్నారు. ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమంతో ఈ పాస్‌బుక్‌లను పంపిణీ చేయాలని ముందుగా సీఎం కేసీఆర్ నిర్ణయించినప్పటికీ సాధ్యమయ్యే అవకాశాలు లేకపోవడంతో పక్షం రోజులపాటు కొనసాగించాలని తాజాగా ఆదేశాలు ఇచ్చారు. అందుకోసం త్వరలోనే షెడ్యూల్‌ను ఖరారు చేసి గ్రామగ్రామాన దండోరా (చాటింపు)తో ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. పంపిణీ ప్రారంభానికి ఒకరోజు ముందుగానే అన్ని గ్రామాలకు చెక్కులు, పాస్‌బుక్‌లను చేర్చాలని యంత్రాగానికి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతి గ్రామానికి ఒక నోడల్ అధికారిని నియమించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో అధికార యంత్రాంగమంతా పూర్తిస్థాయి సమన్వయంతో పని చేయాలని, ఎక్కడా లోటుపాట్లు జరుగకుండా కలెక్టర్లు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో 93శాతం భూమి, 92 శాతం ఖాతాలు వివాదరహితమైనవని తేలినందున ఇక మిగిలింది చాలా తక్కువ మాత్రమేనని, వాటిని కూడా పంపిణీ సమయానికి పరిష్కరించాలని చెప్పారు.

చరిత్ర పాఠాలు చదవండి

●ఢిల్లీ ఉగాది వేడుకల్లో వెంకయ్యనాయుడు



సినీ నటుడు జగపతిబాబుకు జీవిత సాఫల్య అవార్డును ప్రదానం చేస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రపంచ నలుమూలల ఎక్కడున్నా తెలుగు వారు తమ సత్తా చాటుతున్నారని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. చరిత్రను కాపాడుకునేలా మన విద్యా విధానంలో మార్పులు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఢిల్లీ తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన 30వ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయనతో పాటు జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సినీ నటుడు జగపతిబాబుకు జీవిత సాఫల్య పురస్కారం, డా. సుధారాణికి ప్రతిభా భారతి పురస్కారం, 8 మందికి ఉద్యోగ రతన్, 8 మందికి ప్రతిభా భారతి పురస్కారాలను ఉప రాష్ట్రపతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్‌ను ఘనంగా సన్మానించారు. ఉదయశంకర్ అవాస్తి, నటీనటులు రమ్యకృష్ణ, ఆర్పీపట్నాయక్, ఎంఎం శ్రీలేఖ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజధానివాసుల మనో వికాసానికి కృషి చేస్తున్న ఢిల్లీ అకాడమీకి వెంకయ్య అభినందనలు తెలిపారు. వారం రోజుల ముందే ఉగాది పండగ జరుపుకోవడం, ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పండుగ వెనుక శాస్త్రీయ సందేశం ఉంటుందన్న వెంకయ్య, పండగ అంటే కొత్త బట్టలు, రకరకాల వంటలు కాకుండా ప్రతిభ పురస్కారం సాధించిన వారిని సన్మానించడం, అవార్డులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. భారతదేశానికి ఆధ్యాత్మిక భావన ఎక్కువని, ఇతరుల కంటే మన సంస్కృతి భిన్నమైనదన్నారు. రిక్షా నడిపే వ్యక్తి కూడా తన చెల్లికి పెళ్లి చేశాక, తాను తర్వాత పెళ్లి చేసుకోవడం మన సంస్కృతిలో ఉండే గొప్ప దనమని ప్రశంసించారు. మాతృభాష పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అన్న ఆయన, మన భాషలో ఉండే మాధుర్యం గొప్పదని, పాశ్చాత్య సంస్కృతి నుంచి బయటకు రావాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. కలిసి మాట్లాడుకోవడమేది తెలుగు వారి సంబంధాలను బలోపేతం చేస్తోందని, ఉగాది వేడుకలను 3 రోజుల పాటు ఘనంగా నిర్వహించిన ఢిల్లీ తెలుగు అకాడమీ సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకోవాలని వెంకయ్య సూచించారు.

జవాను ఆత్మహత్య

ఆదిలాబాద్ , ప్రభన్యూస్ : ఆదిలాబాద్ జిల్లా, భీంపూర్ మండలం బెల్సరి రాంపూర్ కు చెందిన గిరిజన యువకుడు పుర్కె సుఖదేవ్ (24) శ్రీనగర్‌లో సిఆర్‌పిఎఫ్ జవానుగా విధులు నిర్వహితూ శనివారం ఉదయం ఎకె 47 తో నాలుగురౌండ్లు కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇతనికి తండ్రి భీంరావ్, కానిస్టేబుల్ సోదరుడు , వ్యవసాయం చేసే మరో ఇద్దరు సోదరులు, ఇద్దరు అక్కలు ఉన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి శ్రీనగర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. మృతదేహాన్ని ప్రత్యేక విమానంలో నాగ్‌పూర్ వరకు ఆ తర్వాత సిఆర్‌పిఎఫ్ వాహంలో స్వగ్రామం తరలించారు. ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన అంత్యక్రియల్లో జవానులు, సిఐ శ్రీనివాస్, ఎఎస్సై లింగారెడ్డి, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.


భైంసాలో తల.. నిర్మల్‌లో మొండెం

●సంచలనం సృష్టించిన వ్యక్తి హత్య

నిర్మల్ ప్రతినిధి/ భైంసా, ప్రభ న్యూస్ : నాలుగు రోజుల క్రితం భైంసా పట్టణంలో సంచలనం సృష్టిం చిన గుర్తు తెలియని తలకు సంబంధించిన ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. భైంసా పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి నర్సింహానగర్‌కు వెళ్ళే రోడ్డు మార్గంలో శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని తల లభ్యమైన విషయం తెలిసిందే. మొండెం లేని తల లభించడంతో భైంసా వాసులే కాక చుట్టుప్రక్కల ప్రాంతాల వారు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే మృతుని కుటుంబసభ్యులు మూడు రోజు లుగా తనకు ఫోన్ చేస్తున్నా కలవడం లేదని ఏం జరిగి ఉంటుందోనని భయపడి హుటాహుటిన తను నివాసముంటున్న నిర్మల్ పట్టణానికి చేరుకున్నారు. నిర్మల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సంప్ర దించగా మొండెం లేని తల ఒకటి భైంసాలో లభ్య మైందని పోలీసులు చెప్పడంతో మృతుని సోదరుడు, చిన్నాన్న భైంసా పట్టణానికి చేరుకున్నారు. భైంసా పట్టణానికి వచ్చి పోలీసుల వద్ద ఆరాతీయగా మృతి చెందిన వ్యక్తి తమకు చెందిన వాడేనని నిర్ధారించారు. నిర్ధారణయిన గంటలోపే నిర్మల్ పట్టణంలో మొండెం లభ్యమైంది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇస్రార్‌గా బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అయితే నిర్మల్ పట్టణంలో బట్టల వ్యాపారం చేస్తూ జీవనం సాగించే ఇస్రార్ హత్యగావించి తల భాగం భైంసా పట్టణంలో లభించడంతో పోలీసులు పలు రకాల పరిశోధన జరిపారు. కేసు మిస్టరీ విడగొట్టేందుకు భైంసా డీఎస్పీ అందె రాములు, పట్టణ సీఐ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో తల లభ్యమైనప్పటి నుండి తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బట్టల వ్యాపారం నిర్వహించుకునే ఇస్రార్‌ను ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు, ఎలా హతమార్చారో అనేది ఇంకా అంతుచిక్కడం లేదు.

ఆత్మన్యూనతతో వైద్యుడి ఆత్మహత్య



నిజామాబాద్ అర్బన్, ప్రభ న్యూస్ : ప్రభుత్వ వైద్యుడు ఒకరు ఆత్మన్యూనతతో శనివారం రాత్రి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని ఎన్జీఓస్ కాలనీలో నివాసం ఉంటున్న ఎన్.మధు(31) అనే ఈఎన్‌టీ వైద్యుడు స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. అవివాహితుడైన డాక్టర్ మధు కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగా లేక ప్రవర్తనలో మార్పులు వచ్చాయని తోటి ఉద్యోగులు తెలిపారు. మధు తల్లిదండ్రులు ముందు గదిలో పడుకున్నారని, ఆదివారం ఉదయం తలుపు ఎంత కొట్టినా తీయకపోవడంతో అను మానం వచ్చి చూడగా ఫ్యానుకు ఉరేసుకుని మరణించాడని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అందుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

రికార్డు అసిస్టెంట్లుగా ప్రధానోపాధ్యాయులు!

●ప్రతి రిపోర్టును ప్రధానోపాధ్యాయుడే రాయాలి ●బస్‌పాస్‌కు, బోనఫైడ్‌కు ఆయనే రాసి సంతకం చేయాలి ●400 మంది హెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు ●900 హెచ్‌ఎం పోస్టులు ఖాళీ ●జూలైలో మరో 300 మంది పదవీ విరమణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు రికార్డు అసిస్టెంట్లుగా మారుతున్నారు. వారు చేయాల్సిన పనుల కంటే ప్రభుత్వానికి పంపాల్సిన నివేదికలను సిద్ధం చేయడం, విద్యార్థులకు అవసరం అయిన వాటిని సిద్ధం చేయడమే వారికి సరిపోతుంది. దీనికి తోడు మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. విద్యార్థులకు బస్‌పాసుల కోసం ఇవ్వాల్సిన బోనఫైడ్ దగ్గర నుంచి ఎస్‌ఎస్‌సీ పూర్తయిన వారికి ఇవ్వాల్సిన బదిలీ సర్టిఫికెట్ల వరకు అన్నింటిని ప్రధానోపాధ్యాయుడే రాసుకోవాలి... అతనే సంతకం చేసి ఇవ్వాలి. ఇవి కాకుండా ప్రభుత్వానికి సమర్పించాల్సిన ప్రతి నివేదికను ఆయనే సిద్ధం చేయాలి. వీటికి తోడు మధ్యాహ్నం భోజనం బిల్స్, 3 ఆర్ నివేదిక, ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ నివేదికలు, జిల్లా విద్యాశాఖాధికారి పంపాల్సిన నివేదికలు ఇలా అన్ని నివేదికలను సిద్ధం చేసుకుంటూ రికార్డు అసిస్టెంట్‌లాగా ప్రధానోపాధ్యాయులు మారారు. ఇన్ని పనుల నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు స్కూల్‌లో చేపట్టాల్సిన వాటిపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరించలేకపోతున్నారు. ఫలితాలు రాబట్టడంలో, విద్యార్థులను స్కూల్‌లో చేర్పించడంలోనూ వారు తగిన శ్రద్ధ చూపలేని పరిస్థితులను ప్రభుత్వమే కల్పించి... తిరిగి మంచి ఫలితాలు రావడం లేదంటూ ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేస్తోందని ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ ఆరోపిస్తోంది. తాము చేయాల్సిన పనులను చేయనివ్వకుండా ఇతర పనులను అప్పగిస్తూ స్కూల్‌పై దృష్టి కేంద్రీకరించ లేకుండా చేస్తోందని అంటున్నారు.

400 మంది ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా పనిచేస్తున్నారు...

రాష్ట్రంలో 10 జిల్లాలు ఉన్నప్పుడు 459 మండలాలు ఉండేవి. జిల్లాలు కాస్త 31 పెరిగిన నేపథ్యంలో అదనంగా మరో 125 కొత్త మండలాలు ఏర్పటయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని 459 మండలాలకు మండల విద్యాధికారుల పోస్టులు మంజూరు అయ్యాయి. వాటిలో కేవలం 59 మంది మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు పనిచేస్తున్నారు. మిగిలిన 400 మండలాల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో సైతం ఇన్‌చార్జ్ ఎంఈవోలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ లేకపోవడంతో ప్రమోషన్లు ఇవ్వడం లేదు. దీంతో హెచ్‌ఎంలకు ఎంఈవోలుగా పదోన్నతులు రావడం లేదు. దీంతో ఇన్‌చార్జ్ ఎంఈవోలే కొనసాగుతున్నారు. ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా కొనసాగుతుంటే అందులో ఒక్కో వ్యక్తి రెండు, మూడు మండలాలకు కూడా ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జ్ ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారు ఆ స్కూల్‌లో సీనియర్ ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్‌గా నియమించుకొని తాను ఎంఈవోగా బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తోంది. ఇన్ని సమస్యల్లో ప్రధానోపాధ్యాయుడు ఉత్తీర్ణత, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై దృష్టిపెట్టే సమాయం లేకుండా పోతుంది.

900 హెచ్‌ఎం పోస్టులు ఖాళీ

రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 4600 ఉన్నాయి. వాటిలో సుమారు 3700 పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు ఉన్నారు. మిగిలిన 900 హెచ్‌ఎమ్ పోస్టుల్లో సీనియర్ ఉపాధ్యాయులు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. రానున్న జూలై నెలలో మరో 300 మంది ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ చేయనున్నారు. వీరితో కలిపితే జూలై నాటికి 1200 పోస్టులు ఖాళీగా ఉంటాయి... మరో 400 మంది ఎంఈవోలుగా కొనసాగుతుంటారు. వీటన్నింటికి కారణం ప్రభుత్వం సర్వీస్ రూల్స్‌ను రూపొందించక పోవడంతో ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు రావడం లేదు, ఉపాధ్యాయులకు పదోన్నతులు రావడం లేదు. తద్వారా పైన జరగాల్సిన నియామకాలు జరగడం లేదు.

రికార్డు అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలి: ఎస్ లక్ష్మారెడ్డి

రాష్ట్రంలోని 90 శాతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రికార్డు అసిస్టెంట్ (జూనియర్ అసిస్టెంట్) ఎల్‌డీసీలు లేరని దీంతో ప్రధానోపాధ్యాయులపై తీవ్ర పనిభారం పడుతోందని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ (టిఎస్‌జిహెచ్‌ఎంఏ) రాష్ట్ర అధ్యక్షులు సింగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రభుత్వం వెంటనే ప్రతి పాఠశాలకు ఒక జూనియర్ అసిస్టెంట్‌ను, కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కూల్స్‌కు వస్తున్న విద్యుత్ బిల్లులను మాఫీ చేయాలన్నారు. అన్నింటికంటే ప్రధానంగా ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించాలన్నారు. తద్వారా పదోన్నతులు వస్తే తమపై అదనపు భారం తగ్గుతుందని, పర్యవేక్షణ కూడా పెరుగుతోందని తెలిపారు. 9, 10వ తరగతి విద్యార్థులకు కూడా యూనిఫామ్స్ సరఫరా చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఇన్‌చార్జ్ ఎంఈవోగా కొనసాగుతున్న స్కూల్స్‌లో అదనంగా విద్యావాలంటీర్ పోస్టును మంజూరు చేయాలన్నారు.

రాముడా, రామనారాయణుడా తేల్చాల్సిందే: శివస్వామీజీ

●అంతరాలయంలో బైఠాయించిన స్వామీజీ పరివారం



భద్రాచలం, ప్రభ న్యూస్ : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం కోటి లింగాల పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామిజి హల్ చల్ చేశారు. ఈ ఆలయంలో స్వామివారు రాముడా... రామానారాయణుడా.. తేల్చి చెప్పాలని అంతరాలయంలో తన పరివారంతో బైఠాయించారు. ఈ నెల 10, 11 తేదీలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీరామ జపయజ్ఞం నిర్వహించేందుకు భద్రాచలం వచ్చిన ఆయన స్థానిక అంబాసత్రంలో శ్రీరామ జపయజ్ఞం నిర్వహించి సీతారామ కళ్యాణం జరిపించారు. అయోధ్యలో శ్రీరామ మందిరం శీఘ్రంగా జరగాలనే శుభ సంకల్పంతో భద్రాచలంలో ఈ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆయన ఇటీవల తెలిపారు. యజ్ఞకార్యక్రమం నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకునేందుకు తన పరివారంతో ఆలయానికి చేరుకున్న ఆయన ఆలయ సిబ్బంది నిలువరిస్తున్నప్పటికి తన పరివారంతో ఒక్కసారిగా స్వామివారి మూలమూర్తుల (అంతరాలయం వరకు) వద్దకు చేరుకుని బైఠాయించి నినాదాలు చేయటంతో ఆలయ సిబ్బంది అయోమయ స్థితిలో పడిపోయారు. సుమారు 400 మంది పరివారంతో రావడంతో ఆలయం కిటికిటలాడిపోయింది. స్వామి వారి నామాన్ని మార్చేందుకు మీరు ఎవరు? మీకేమి హక్కుందని ఆయన ప్రశ్నించారు. స్వామి వారి పూజల్లోనైతం గోత్రనామాల్లో గోత్రాలను మార్పు చేసి విన్నవిస్తున్నట్లుగా మా దృష్టికి వచ్చిందని, ఇందేంటని ఆయన ప్రశ్నించినట్లు కొందరు భక్తులు తెలిపారు. ఆలయ సీసీ, పట్టణ సీఐ సత్యానారాయణరెడ్డి అక్కడకు చేరుకొని శివస్వామితో మాట్లాడి వారిని బయటకు పంపించి వివాదం జరగకుండా నివారించారు. ఆలయంలో శివస్వామికి ఆలయ అర్చకుల మధ్య వాగ్వాదం జరిగినట్లుగా ప్రత్యక్షసాక్షులు తెలిపారు. రామాలయంలో ఎప్పటి నుండో స్వామివారిని రామనారాయణుడు అని సంబోధించటంపై వివాదం ఉంది. ఈ పరిస్థితుల్లో భక్తులు ఎటూ తేల్చుకోలేక ఒకింత అయోమయ స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. ఏది ఏమైనప్పటికి రాముడా, రామానారాయణుడా అనే విషయంపై ఇటు రామాలయ పండితులుగాని, అటు వాదిస్తున్నవారు గాని, సరైన వివరణ భక్తులకు ఇప్పటికి తెలియజేయలేదు. ఆలయంలో శివస్వామిజీ బైఠాయించటంతో దర్శనాలకు వచ్చిన భక్తులు ఒకింత అసహనానికి గురైనారు.

పూర్తి స్థాయి వివరణ ఇస్తాం: వేదపండితులు

శ్రీ సీతారామచంద్రస్వామి వారు రాముడా, రామనారాయణుడుగా సంబోధించవచ్చా, లేదా అనేదానిపై ఏప్రిల్ 1 నాటికి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తరువాత పూర్తి స్థాయి చర్చలు పాల్గొని తగిన సమాధానం ఇస్తామని ఆలయ వేద పండితులు తెలిపారు.

తనిఖీల్లో పేలుడు పదార్థాలు లభ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ జవహర్‌నగర్‌లో పోలీసులు భారీ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని జవహర్‌నగర్‌లో పోలీసులు నిర్వహించిన ఈ కార్డాన్ సెర్చ్‌లో పెద్ద ఎత్తున జిలిటిన్ స్టిక్స్, డిటోనేటర్లు బయటపడ్డాయి. నివాస ప్రాంతాల మధ్య రామెటిరియల్ తీసుకు వచ్చి వీటిని తయారు చేస్తున్నట్లు పోలీసులు పోలీసులు గుర్తించారు. నిషేధిత పేలుడు పదార్థాలు దేనికోసం వినియోగిస్తున్నారు అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇంటింటికి తిరిగి తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలు జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమానిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సెర్చ్‌లో డాక్యుమెంట్‌లు సరిగా లేని 20 ద్విచక్రవాహనాలు, 8 ఆటోలు, రీఫిల్లింగ్ చేస్తున్న పది సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. 20 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.కాగా, మొత్తం 500 మంది పోలీసులు ఈ కార్డాన్‌సెర్చ్‌లో పాల్గొన్నారు.

రవీంద్ర అభ్యర్థిత్వంపై హర్షం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైకోర్టు సీనియర్ న్యాయవాది తెదేపా, లీగల్ సెల్ అధ్యక్షుడు కనకమేడల రవీంద్రకుమార్‌ను ఏపీ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపిక చేయడం పట్ల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రవీంద్రకుమార్ కృష్ణా జిల్లా, అవనిగడ్డలో జన్మించారు. విజయవాడ సిద్ధార్థ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి లా పట్టా పొందారు. 1983 నుంచి 1998 వరకు విజయవాడలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. విజయవాడ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేశారు. 1998లో నివాసాన్ని హైదరాబాద్‌కు మార్చారు. హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తూ తెదేపా లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతూ పార్టీకి న్యాయసేవలు అందిస్తున్నారు. ఆయన 2006, 2011 లో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యునిగా రెండు సార్లు ఎన్నికయ్యారు.

అవినీతిరహిత పాలన దేశాభివృద్ధికి నిదర్శనం

●కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం



నిజామాబాద్, ప్రభ న్యూస్ బ్యూరో : భారతదేశంలో అవినీతి రహిత పాలనను బీజేపీ ప్రభుత్వం కొనసాగించడంతోనే దేశాభివృద్ధికి నిదర్శనమని కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అన్నారు. బోధన్ పట్టణంలో చెరుకు రైతుల, కార్మికుల సంక్షేమం చక్కెర కర్మాగారం ప్రభుత్వపరం చేసుకొని గానుగ ఆడించాలనే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ చేపట్టిన చర్నాకోల్ మహాపాదయాత్ర ముగింపు సమావేశానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ గత 70 ఏళ్ళు భారతదేశాన్ని రాష్ట్రాలలో పాలనను కొనసాగించిన ప్రభుత్వాలు అవినీతిమయంగా మారడంతోనే దేశంలో భారతీయ జనతా పార్టీ జెండాను ఎగురవేసేందుకు అవకాశం దొరికిందన్నారు. మేకిన్ ఇండియా, మేకిన్ స్కిల్ అభివృద్ధియే ధ్యేయంగా ప్రధాని మోడీ ప్రయత్నించడంతో దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను ఇప్పటికే మెరుగు పర్చిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. అభివృద్ధిలో రాష్ట్రాల తారతమ్యం కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధి కోసమే కేంద్ర బడ్జెట్‌లో 49 శాతంకు పైగా నిధులను కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రాల్లో జరిగే అభివృద్ధి, రోడ్లు, నీటి ప్రాజెక్టులు, ఆహార భద్రత పథకాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు అందిస్తుందని తెలిపారు.

రైతులు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. 2022 నాటికి దేశంలోని ప్రతి పేదవాడికి ఇండ్లు నిర్మించి ఇసామని, ప్రతి పేదవాడికి వైద్యం కోసం మూడున్నర లక్షలు చెల్లించే వీలు ప్రధాన మంత్రి మోడీ కల్పిస్తున్నారని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాలకు పెద్ద ఎత్తున నిధులను అందించామని, మరిన్ని నిధులను అందించి తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి పరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రాంతంలో నాలుగు ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పట్లో అడ్డుకున్నాయి. దేశంలో కాంగ్రెస్ పాలన అంతమైందని, ప్రస్తుతం 22 రాష్ట్రాల్లో బీజేపీ తన జెండాను ఎగురవేసి కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీని గెలిపించాలని, ఈ ప్రాంతాభివృద్ధికి తమ శాయశక్తుల కృషి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేసి తీరుతామని కేంద్రమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

దేశంలోని పరిశ్రమలను మూతవేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని, దేశాన్ని అవినీతి మయం చేశారని, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రామగుండం, ఐడిపిఎల్ కర్మాగారాలను ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. పరిశ్రమలు ప్రభుత్వాలు అమ్ముకోవడంతో యువత ఉద్యోగాలు కోల్పోయారని యువతకు ఉపాధి కల్పించేందుకే పరిశ్రమలను తెరిచే దిశలో కేంద్ర ప్రభుత్వంపనిచేస్తుందన్నారు. ఇప్పటికే దిగుమతులను తగ్గించి ఎగుమతులను పెంచామని దీనితో దేశాభివృద్ధి రేటు పెరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార ధాన్యాలైన బియ్యం, గోధుమలను తామే సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. బియ్యం, గోధుములకు ఒక్కో కిలోకు కేంద్ర ప్రభుత్వం 27 రూపాయాల సబ్సిడీని అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

ఎన్‌డిఎస్ఎల్ కర్మాగారాలను తెరిపిస్తాం

గత ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి తెలంగాణలోని చక్కెర కర్మాగారాలను ప్రైవేట్ పరం చేసి తెగనమ్ముకున్నారని, ఫ్యాక్టరీలు ప్రజల ఆస్తులని అవి ఎవరి సొత్తుకాదని రైతులు, కార్మికుల సంక్షేమం కోరి తాము బోధన్ ఎన్‌డిఎస్ఎల్ కర్మాగారంతో పాటు మరో రెండు కర్మాగారాలను తెరిపించేందుకు కేంద్ర ప్రభుత్వం తరపున తాను హామీనిస్తున్నానని సభలో అన్నారు. తమ పార్టీ ముందుకు వచ్చి చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలనే దృఢ సంకల్పంతో పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి వృథా పోదని రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా రెపరెపలాడుతుందని కేంద్ర మంత్రి బీజేపీ నాయకులకు ఊపిరి పోశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు పల్లె గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, యువనేత ధర్మపురి అరవింద్, రాష్ట్ర బిజెపి నేత రఘునందన్‌రావు, బస్వ నర్సయ్య, అల్జాపూర్ శ్రీనివాస్, డాక్టర్.శివప్ప, నర్సింహరెడ్డి, సుధాకర్‌చారి, రాజిరెడ్డి, ఉమాశంకర్, రాథోడ్ సింగ్, చెరుకు రైతు సంఘం నాయకులు రాజిరెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, రామారాజు, భూపతిరెడ్డి తదితరులున్నారు.

రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా

- మీ త్యాగాలు వెలకట్టలేనివి
- కొండపోచమ్మ సాగర్ ద్వారా 2,85,280 ఎకరాలకు సాగునీరు
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, ప్రభన్యూస్: కొండ పోచమ్మ సాగర్‌కు భూములిచ్చిన మీత్యాగం గొప్పది.. వెలకట్టలేనిది.. మీకు ఎంత చేసినా తక్కువే.. మీ అందరికీ కృతజ్ఞతలు. సాగునీరందే రైతులు, ప్రభుత్వం పక్షాన మీ అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నా అని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ నిర్వాసితులకు గజ్వేల్ మండలం ముట్రాజ్‌పల్లిలో 900, కొండపోచమ్మ సాగర్ భూ నిర్వాసితులకు తున్కి బొల్లారంలో 1800 డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి మంత్రి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్ ద్వారా 2,85,280 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. అన్ని కాలల్లో సాగర్‌లో నీరు పుష్కలంగా ఉంటుందనీ కొట్లాది రూపాయల ఆదాయం గల మత్స్య పరిశ్రమను వృద్ధి చేస్తామన్నారు. ఒక్క గజ్వేల్ నియోజకవర్గంలోనే 1.5 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్ట్‌ద్వారా నీరందుతుందని మంత్రి తెలిపారు. రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలోపు అన్ని గ్రామాలకు కాలువల తవ్వకం పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

అన్ని వసతులతో మోడల్ కాలనీలు...

ముట్రాజ్‌పల్లి, తున్కి బొల్లారం గ్రామాల్లో భూ నిర్వాసితులకు నిర్మించే డబుల్ బెడ్‌రూం గృహ సముదాయాలను అన్ని వసతులతో నిర్మిస్తామని మంత్రి హరీష్‌రావు భరోసానిచ్చారు. ఆరు మాసాల్లోగా నిర్మాణాలు పూర్తి చేస్తామని, కాలనీల్లో బడి, గుడి, అంగన్‌వాడీ కేంద్రాలు, సీసీరోడ్లు, వాటర్ ట్యాంకుల వంటి అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. పక్క గ్రామాల వారు ఈర్ష్య పడేలా నిర్వాసితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులే రైతుల దగ్గరికొచ్చి చెక్కులందిస్తారన్నారు. ఇప్పటికే భూములకు డబ్బులిచ్చామని త్వరలోనే ముంపుకు గురైయ్యే ఇండ్లకు పరిహారం చెల్లిస్తామని చెప్పారు.



హరిత హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన...

తెలంగాణ టూరిజం కార్పోరేషన్ ఆధ్వర్యంలో దుద్దెడ శివారులోని నాగుల బండ దగ్గర హరిత బడ్జెట్ హోటల్ నిర్మాణానికి మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ పేర్వారం రాములు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, జేసి పద్మాకర్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళికట్టు శుభవేళ

- కమణీయం..రమణీయంగా కళ్యాణమహోత్సవం
- సంప్రదాయ పద్ధతిలో ఏకమైన 218 జంటలు
- నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి ఈటల

మంథని/మంథనిరూరల్, ప్రభ న్యూస్ : తాళికట్టు శుభవేళ.. మెడలో మాంగల్యమాల...అంటూ మంథని పట్టణం మేళతాళాలతో మార్మోగింది. మంథని చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో కమణీయం...రమణీయంగా పేదింటి ఆడ బిడ్డల కళ్యాణ మహోత్సవం జరిగింది. పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వ ర్యంలో ఆది వారం మంథని ప్రభుత్వ జూనియర్ కళా శాల మైదానంలో జరిగిన సామూహిక వివాహ వేడుకల్లో నియోజక వర్గంలోని 218 పేదింటి జంటలు ఏకమయ్యాయి. హిందు, ముస్లిం, క్రైస్తవ జంటలకు వారివారి సంప్రదాయ పద్ధతిలో వివాహాలు జరిపించారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అర్చకులతో పాటు పలువురు



ప్రముఖులు హిందు సంప్రదాయ పద్ధతిలో వివాహాలు జరిపించగా, క్రైస్తవ వివాహల్లో మ్యారేజ్ రిజిష్ట్రార్ వల్లూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో టీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇన్‌చార్జీ అంకరి కుమార్, మేకల మల్లేశం సమక్షంలో 14 జంటలకు వారి సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిపించారు. ఎమ్మెల్యే పుట్టా మధు శైలజ దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ఈ వివాహ వేడుకల్లో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేం దర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహ ర్‌రెడ్డి,జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రఘువీర్‌సింగ్, ఎమ్మెల్సీలు భానుప్రసాద్, నారదాసు లక్ష్మణ్‌రావుతో పాటు పలువురు ప్రజాప్ర తినిధులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహం జరిగే నూతన జంటల బంధువులతో పాటు వేడుకలను తిలకించేందుకు వచ్చిన వారికి భోజన వసతి కల్పించారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



మందకృష్ణ హత్య కుట్రపై సీబీఐ విచారణ జరిపించాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ లవర్గీకరణ కోసం రాజీలేని పోరాటం చేస్తున్న మందకృష్ణమాదిగ హత్యకు కుట్ర పన్నిన వారిని గుర్తించాలని టిపిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. మంద కృష్ణను ఆదివారం దయాకర్ కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితులను అంతం చేయాలన్న ప్రయత్నం జరిగితే చూస్తూ ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. మంద కృష్ణను హత్య చేసేందుకు కుట్ర ఎవరిదన్న విషయాన్ని తేల్చేందుకు సిబిఐకి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. మంద కృష్ణ హత్యకు కుట్ర జరిగిందని తెలిసినా వివిధ పార్టీలలో ఉన్న నేతలు స్పందించక పోవడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇద్దరు చంద్రులకు మంద కృష్ణసమస్యగా మారారని, అందుకే కుట్రలు జరుగుతున్నాయన్నారు. వర్గీకరణ జరిగితే దళితులంతా ఐక్యమవుతారన్న భయంతో ఉన్నాయన్నారు.

విచారణ జరిపితే ఆధారాలిస్తా : మంద కృష్ణ

తన హత్యకు కుట్ర జరిగిందని, ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే ఆధారాలు ఇస్తానని మంద కృష్ణమాదిగ అన్నారు. నాపై జరిగిన హత్యకుట్రను మాదిగలపై నెట్టేందుకు ప్రయత్నం జరిగిందన్నారు. నేర చరిత్ర కలిగిన ఎంఎల్ఎలను నా హత్యకు ప్రోత్సహించారని ఆరోపించారు. నన్ను హత్య చేసేందుకు ఇద్దరిని ఉసిగొల్పారని, ఈ పాత్రలకు రూపకల్పన చేసింది ఎవరనేది, వారు పేర్లు తదితర వివరాలన్నీ తనకు తెలుసన్నారు. నా హత్యకు కుట్ర జరిగిందని తెలిసినా ఏ పార్టీ కూడా స్పందించక పోవడం చూస్తుంటే మేం బతికున్నా సచ్చిన శవాలమే అన్నది స్పష్టమవుతుందన్నారు. నాపై జరిగిన హత్య కుట్రపై అసెంబ్లీలో ప్రస్తావించి సిబిఐ విచారణకు పట్టుబట్టాలని డిమాండ్ చేశారు.

రైతు విమోచన కమిషన్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతుల సమస్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఏకోశానా లేదని భాజపా జాతీయ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. దీని కారణంగానే తెలంగాణ రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి నుంచి రైతులను కాపాడాలంటే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతు రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, సిఎం కేసీఆర్, తెరాస ప్రభుత్వ పనితీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. రైతులను ఆదుకునేందుకు ప్రత్యేకంగా రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని స్వయంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించినప్పటికీ...ఇప్పటి వరకు వరకు ఆ దిశగా తెరాస ప్రభుత్వం తగు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోని కారణంగానే ఈ నాలుగేళ్ళ కేసీఆర్ పాలనలో సుమారు నాలుగువేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు.



రుణ విమోచన కమిషన్ వేసి ఉంటే కనీసం ఆ రైతుల కుటుంబాలకు కొంతమేరకు సాంతన లభించి ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచకపోగా....వారిని రోజురోజుకు కష్టాల కడలిలోకి ప్రభుత్వం తీసుకపోతున్నదిని ఆయన మండిపడ్డారు. కోర్టులు అన్నా....రాజ్యాంగ వ్యవస్థ అన్నా కేసీఆర్ చాలా చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలు....తీసుకుంటున్న నిర్ణయాలపై పలుమార్లు హైకోర్టు అక్షింతలు వేసినా.... కేసీఆర్ ఎలాంటి మార్పు కనిపించడం లేదంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారంలో ఉన్న హయంతో కేసీఆర్ ఒక నియంతలా పాలన సాగిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ఎవరైనా ప్రశ్నించే...వారిపై తిట్ల దండకం మొదలుపెట్టడం, అక్రమ కేసులు బనాయించడం కేసీఆర్‌కు అలవాటుగా మారిందని ఇంద్రసేనారెడ్డి దుయ్యబట్టారు. తనకు అవసరం వచ్చినప్పుడు మాత్రం కేసీఆర్‌కు మానవ హక్కులు...ప్రజాస్వామ్యం గురించి గుర్తుకువస్తుందని... వ్యతిరేకంగా ఎవరైనా గొంతు విప్పితే మాత్రం అణిచివేసే ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు.

సిట్టింగ్‌లందరికీ టికెట్లిస్తా



(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణభవన్‌లో జరిగిన టిఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇద్దరు, ముగ్గురికి రెండు.. మూడు శాతం తగ్గి ఉండొచ్చు.. అవసరమైతే అలాంటి ఇబ్బందులు ఉన్నచోట నేను కూసొని గెలిపిస్తా. మీరు ఉత్సాహంగా ఉండండి.. జనంలో ఉండండి.. ప్రభుత్వం చేసే పనులు ప్రజల్లోకి తీసుకెళ్ళండి అంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు చెప్పారు. సిట్టింగ్‌లందరికీ సీట్లు ఇస్తానని ఈ విషయంలో కూడా ఆందోళన అవసరం లేదన్నారు. మన మనసులు కలిసినయ్.. నాలుగేళ్ళుగా మంచిగా పనిచేసుకుంటున్నం.. మీకన్నా మంచోళ్ళు ఎవరుంటరు.. మంచిగ కలిసిపోయేటోళ్ళు ఎట్ల దొరకుతరు.. ఎక్కడన్నా రెండు, మూడు చోట్ల ఇబ్బందులు ఉంటే సరిచేసుకుందాం.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరికీ సీట్లిస్తా అని కెసిఆర్ స్పష్టం చేసినట్లు సమాచారం. మీ నియోజకవర్గాల్లో మీ ప్లస్ ఏంటి.. మైనస్ ఏంటి.. మీ గురించి జనం ఏమనుకుంటున్నారు.. ప్రభుత్వ పథకాల గురించి ఏమనుకుంటున్నారు.. అన్ని వివరాలు వారం రోజుల్లో అందజేస్తాం. వ్యక్తిగత సర్వేవివరాలు గోప్యంగా మీకు అందిస్తం అని వెల్లడించారు. ఇదే సందర్భంలో చొప్పదండి ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లు పనితీరు మార్చుకోవాలంటూ సిఎం హెచ్చరించినట్లు సమాచారం. అనవసర వివాదాల్లో తలదూర్చవద్దని చెప్పినట్లు తెలిసింది.

శాసనసభ సమావేశాలు గత నాలుగేళ్ళుగా నడిపిన పద్ధతిలోనే ఈ దఫా కూడా నిర్వహిస్తామని, లొల్లిచేయాలని సభకు వచ్చి అడ్డుతగిలే వారిపై కఠినంగానే వ్యవహరిద్దామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. శాసనసభకు సభ్యులంతా విధిగా హాజరుకావాలని ఆదేశించారు. సభలో ఏ అంశంపై చర్చ జరిగినా.. సమాధానం ఇచ్చేందుకు సిద్దంగా ఉండాలన్నారు. సభలో అల్లరిచేసి.. బయటకు వెళ్ళాలనే వ్యూహంతో విపక్షం సభకు వస్తే నిబంధనల ప్రకారం కఠినంగా వ్యవహరించాలన్నారు. గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలితే సెషన్ మొత్తం సస్పెండ్ చేయాలని గతంలో జరిగిన బిఎసి సమావేశాల్లో నిర్ణయించామని, గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలితే నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు. విపక్షం ఏ అంశంపై ప్రశ్నించినా తగిన సమాధానాలతో సిద్దంగా ఉండాలన్నారు. ఈ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టంతో పాటు పలు బిల్లులు సభలో ప్రవేశపెడతామన్నారు. సమావేశంలో మంత్రులు ఉపముఖ్య మంత్రు లు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, మంత్రులు కెటిఆర్, నాయిని నర్సింహారెడ్డి, జగదీష్‌రెడ్డి, లక్ష్మా రెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, పోచారం శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఎంపీలు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

మహిళలకు 33% రిజర్వేషన్లు

- కాంగ్రెస్ పార్టీ హామీ
- కేసీఆర్ తీరుపై ధ్వజం
- బడ్జెట్ సమావేశాల అనంతరం రెండో విడత బస్సుయాత్ర : టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన సీఎం కె చంద్రశేఖరరావు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీ చేయకుండా తన కుటుంబ సభ్యులు, బంధువులకు మాత్రం రాజకీయ పదవులు ఇస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఫేస్‌బుక్ మాధ్యమంలో ఆయన పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. రాజ్యసభ అభ్యర్థిగా తన బంధువు సంతోష్‌కుమార్‌ను ఎంపిక చేయడాన్ని ఉత్తమ్ తప్పుబట్టారు. కేసీఆర్ తన బంధువులకు పదవులు కట్టబెడితే కాంగ్రెస్ పార్టీ మాత్రం గిరిజన వర్గానికి చెందిన కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్‌ను రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేసేందుకు నిలబెడుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి థర్డ్ ఫ్రంట్ విషయం కేసీఆర్ ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. ఆయన ఫ్రంట్ విఫల ప్రయోగమని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని, తమ ఉన్న సర్వేప్రకారం ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా టీఆర్ఎస్ గెలుచుకోలేదని చెప్పారు. దేవరకొండకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త నవీన్, మంచిర్యాలకు చెందిన ప్రవీణ్‌కుమార్, పాలకుర్తికి చెందిన నరేష్ తదితరులు అడిగిన ప్రశ్నలకు ఉత్తమ్ సమాధానాలు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చట్ట సభల్లో మహిళల కోసం 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా పటాన్‌చెరు



నియోజకవర్గంలోని అమీన్‌పూర్ గ్రామంలో జరిగిన మహిళల సభలో ఆయన ఆదివారం ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని గద్వాల ఎమ్మెల్యే ,మాజీ మంత్రి డీకే అరుణ చెప్పారు. మహిళా సంక్షేమాన్ని విస్మరించిన టీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో రాహుల్ గాంధీ గాలి వీస్తోందని, ఇటీవల జరిగిన అన్ని ఎన్నికల్లోఈ విషయం రుజువైందని చెప్పారు.


36 మంది ఐపీఎస్‌ల బదలీ



అంజనీ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

డీజీపీగా మహేందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక పోలీసు శాఖలో భారీ ఎత్తున బదలీలు ఉంటాయని ప్రచారం జరిగింది. సోమవారం నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో బదలీలకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్,డీజీపీ మహేందర్ రెడ్డిలు ప్రత్యేకంగా సమావేశమై బదలీలపై తుదిస్థాయి కసరత్తు పూర్తిచేశారు. వాస్తవానికి నాలుగైదు రోజుల క్రితమే బదలీలు ఉంటాయని భావించినా.. సీఎం కేసీఆర్ తృతీయ ఫ్రంట్ ఏర్పాటుకు సంబంధించి తలమునకలై ఉండటంతో ఈ ప్రతిపాదన వాయిదా పడుతూ వచ్చింది. బదలీలలో భాగంగా శాంతి భద్రతల విభాగం అదనపు డీజీపీగా ఉన్న అంజనీ కుమార్‌ని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌గా నియమించి.. ఆయన స్థానంలో నేరపరిశోధక విభాగం (సీసీఎస్) ఐజీపీగా ఉన్న స్వాతిలక్రాను నియమించారు. ప్రస్తుతం నగర ఇంఛార్జి పోలీసు కమిషనర్‌గా ఉన్న వి.వి. శ్రీనివాసరావును పోలీసు నియామక సంస్థ ఛైర్మన్‌గా నియమించారు. రైల్వే, రోడ్ భద్రతా డీజీపీగా ఉన్న టి.కృష్ణప్రసాద్‌ను రోడ్ భద్రతా సంస్థ డీజీపీగా నియమించారు. మిగిలిన ఐపీఎస్‌ల బదలీలు ఈ విధంగా ఉన్నాయి.



వీసీ సజ్జనార్

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
టి.కృష్ణప్రసాద్	డీజీపీ రోడ్ సేఫ్టీ	డీజీపీ రోడ్ సేఫ్టీ
సంతోష్ మెహ్రా	అదనపు డీజీపీ (వెయిటింగ్)	డైరెక్టర్, ఆర్‌బీవీఆర్ఆర్
అంజనీకుమార్	అదనపు డీజీపీ(ఎల్ అండ్ వో)	హైదరాబాద్ సీపీ
వి.వి.శ్రీనివాసరావు	హైదరాబాద్ సీపీ(ఇంఛార్జి)	ఛైర్మన్, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు
ఎం.గోపికృష్ణ	అదనపు డీజీపీ(ఆర్గనైజేషన్)	డీజీపీ,ఫైర్ సర్వీసెస్
రాజీవ్ రతన్	డీజీపీ ఫైర్ సర్వీసెస్	డీజీపీ ఆర్గనైజేషన్
జితేందర్	డైరెక్టర్, పోలీసు అకాడమీ	అదనపు డీజీపీ(ఎల్అండ్ ఓ)
సందీప్‌శాండిల్యా	సీపీ, సైబరాబాద్	అదనపు డీజీపీ(రైల్వేస్)
సౌమ్యమిశ్రా	ఐజీపీ, వెల్‌ఫేర్	ఐజీపీ, సీఐడీ
షికా గోయల్	ఐజీపీ, సీఐడీ	అదనపు సీపీ(సిట్)
స్వాతిలక్రా	అదనపు సీపీ(సిట్)	ఐజీపీ(ఎల్అండ్‌వో)
అనిల్‌కుమార్	వెయిటింగ్	అదనపు సీపీ(ట్రాఫిక్)
వీసీ సజ్జనార్	ఐజీపీ ఎస్ఐబీ	కమిషనర్,సైబరాబాద్
దేవేందర్‌సింగ్‌చౌహాన్	వెయిటింగ్	అదనపు సీపీ, హైదరాబాద్ సిటీ
టీపీ శశిధర్‌రెడ్డి	డైరెక్టర్, విజిలెన్స్	అదనపు డైరెక్టర్, పోలీసు అకాడమీ
జి.సుధీర్‌బాబు	సీపీ, వరంగల్	రాచకొండ , జాయింట్‌సీపీ
సి.రవివర్మ	వెయిటింగ్	సీఐడీ, డీఐజీ
టి.ప్రభాకర్‌రావు	ఎస్ఐబీ, డీఐజీ	ఇంటెలిజెన్స్
వి.రవీందర్	జాయింట్‌సీపీ(ట్రాఫిక్)	కమిషనర్, వరంగల్
తరుణ్‌జోషి	జేసీపీ,రాచకొండ	ఎస్‌బీ,జేసీపీ,
వి.శివకుమార్	సిద్ధిపేట సీపీ	ఇంటెలిజెన్స్
ఎ.వెంకటేశ్వరరావు	వెస్ట్‌జోన్ డీసీపీ	మాదాపూర్ డీసీపీ
పి.విశ్వప్రసాద్	మాదాపూర్ డీసీపీ	సెంట్రల్‌జోన్ డీసీపీ
ఎఆర్ శ్రీనివాస్	ట్రాఫిక్ డీసీపీ,	సైబరాబాద్ వెస్ట్‌జోన్ డీసీపీ
ఎం.రమేష్	గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండెంట్	ఈస్ట్‌జోన్ డీసీపీ
సి.శశిధరరాజు	ఈస్ట్‌జోన్ డీసీపీ	డీజీపీ ఆఫీసు
రెమా రాజేశ్వరి	వెయిటింగ్	ఎస్పీ,జోగులాంబ
డేవిస్ జోయల్	సెంట్రల్ జోన్ డీసీపీ	సిద్ధిపేట సీపీ
ఎస్.ఎం.విజయకుమార్	ఎస్పీ, గద్వాల	గ్రేహౌండ్స్
బి.అనంతశర్మ	జగిత్యాల ఎస్పీ	టీఎస్‌పీఏ
విశ్వజిత్ కంపాటి	రాజన్న సిరిసిల్ల ఎస్పీ	విజిలెన్స్
బి.కె.రాహుల్‌హెగ్డే	ఏటూరునాగారం ఏఎస్పీ	రాజన్నసిరిసిల్ల
సునీల్‌దత్	భద్రాచలం ఏఎస్పీ	జగిత్యాల
అపూర్వారావు	గోదావరి ఖని ఏఎస్పీ	సీఐడీ
చేతన	వెయిటింగ్	సుల్తాన్‌బజార్ ఏసీపీ
రక్షిత కె మూర్తి	వెయిటింగ్	గోదావరిఖని
గణపతిరావు	వెయిటింగ్	భద్రాచలం

దళితుల్లో లబ్ధిపై సర్వే జరిపించండి:చెన్నయ్య

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రిజర్వేషన్ల వల్ల దళితుల్లోని ఏ వర్గం ఎక్కువ లబ్దిపొందిందో శాస్త్రీయ సర్వే జరిపించి ప్రకటించాలని మావోయిస్టు పార్టీకి మాల మహానాడు విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు అన్నలారా ... ఆలోచించండి..శాస్త్రీయ సర్వే జరిపించాలని కోరుతూ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జి చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 13 న ఎంఆర్‌పీఎస్ నిర్వహించతలపెట్టిన బంద్‌కు మద్దతు తెలపడం రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అదే రోజు మాల మహానాడు అధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను నిరసిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.విప్లవ కవి గద్దర్, విప్లవ రచయిత వరవరరావు, ప్రజాగాయని విమలక్క, ప్రొఫెసర్ హరగోపాల్ తదితర మేధావులతో కమిటీ వేయాలని చెన్నయ్య సూచించారు.



'రోగి కాలునే దిండుగా వాడేశారు'

ఝూన్సీ: ఉత్తరప్రదేశ్‌లో వైద్యుల నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఝూన్సీ పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి కాలును తొలగించిన వైద్యులు, అదే కాలును తలగడగా వినియోగించి అమానవీయంగా వ్యవహరించారు. క్యాజువాలిటీ వార్డ్‌లో స్ట్రెచర్‌పై పడుకున్న రోగి, ఆయన తలగడగా తొలగించిన కాలున్న వీడియోను ఓ స్థానిక టీవీ ప్రసారం చేసింది. ఈ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ కావడంతో డాక్టర్ల తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది. బాధ్యులైన నలుగురు డాక్టర్లపై వేటు వేసినట్లు అధికార వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. ఓ స్కూలు బస్సుకు క్లీనర్‌గా పనిచేస్తున్న వ్యక్తికి ప్రమాదంలో కాలు విరిగింది. హుటాహుటిన అతడిని ఝూన్సీ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఇన్‌ఫెక్షన్ ఇతర అవయవాలకు వ్యాపించకుండా ఉండేందుకు డాక్టర్లు వెంటనే కాలు తీసేశారు. అనంతరం, బెడ్‌పై కాకుండా స్ట్రెచర్‌పైనే ఆ వ్యక్తికి చికిత్సనందించిన డాక్టర్లు.. ఆ వ్యక్తికి ఆయన కాలునే తలగడగా పెట్టారు. దీన్ని స్థానిక మీడియా బయటపెట్టడంతో ఈ విషయం ప్రభుత్వ ఉన్నతాధికారుల వరకూ వెళ్లింది. దీనిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

నవాజ్ షరీఫ్‌పై బూటుతో దాడి



లాహోర్ : పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చేదు అనుభవం ఎదురైంది. జమియా నమీనియా ఇస్లామిక్ విశ్వ విద్యాలయంలో ఓ సెమినార్‌కు నవాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపైకి ప్రసంగించేందుకు నవాజ్ వెళ్తున్న సమయంలో ఓ యువకుడు అతనిపై చెప్పు విసిరాడు. అంతటితో ఆగకుండా పెద్ద ఎత్తున నవాజ్ షరీఫ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. లబ్బైక్ యా రసూల్లల్లా అనడం ప్రారంభించాడు. యువకుడు విసిరిన చెప్పు షరీఫ్ భుజానికి చెవులకు తాకింది. ఏం జరిగిందో తెలుసుకునే లోపే ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు చెప్పు విసిరిన యువకునితో పాటు మరో అతన్ని గుర్తించి పీఎం భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతన్ని పోలీసులకు అప్పగించారు. వారు అబ్దుల్ గఫార్, సాజిద్‌గా గుర్తించారు.

అణువిద్యుత్ రహిత తైవాన్‌గా మార్చాలి

తైపీ : అణ్వాయుధాలతో ప్రాణ, ఆస్తి నష్టం తప్ప సిద్ధించేది ఏదీ ఉండదని, దేశాన్ని న్యూక్లియర్ రహిత దేశంగా ప్రభుత్వం మార్చాలని, 2025 నాటికి అణు విద్యుత్ వినియోగాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది ప్రజలు తైవాన్‌లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అణ్వాయుధ వినియోగం సున్నా చేయాలని, అణు విద్యుత్ నుంచి తైవాన్ కాపాడాలంటూ అధ్యక్ష భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జపాన్‌లోని ఫుకుశిమాలో విపత్తు సంభవించి నేటికి ఏడేళ్లు పూర్తయ్యాయి. పార్లమెంట్‌లో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న అటామిక్ ఎనర్జికి సంబంధించిన బిల్లుకు ఆమోదం లభించింది. స్వతహాగా తైపీ సమీపంలో రియాక్టర్ల ద్వారా అణు విద్యుత్ ఉత్పత్తికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొం దిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రజలందరూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టారు. విద్యుత్ వ్యవస్థలో లోపం కనిపించడంతో 2016 మే నుంచి రియాక్టర్లు మూసివేయబడ్డాయి. అణు విద్యుత్ నిర్మూలిస్తామని చెప్పిన అధ్యక్షుడు టసాయి-ఇంగ్‌వెన్స్ ఇప్పుడు ఎందుకు ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

పిడుగుపాటు 16 మంది మృతి

కిగ్‌లీ : రువాండలో పిడుగుపాటుకు 16 మంది ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో తీవ్ర గాయాలపాలయ్యారు. దక్షిణ ప్రావిన్స్‌లోని న్యారగురు జిల్లా అడ్వెంటిస్ట్ చర్చి వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనా స్థలంలోనే 14 మంది ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. మరో ఇద్దరు ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలో చనిపోయినట్టు మేయర్ హబిటెగెకో ఫ్రాన్‌కోయిస్ తెలిపారు. పిడుగుపాటుకు గాయాలపాలైన 140 మందిని సమీపంలోని ఆస్పత్రికి తరలిచారు. కొంత మందికి ప్రాథమిక చికిత్స అందించి పంపిచి వేశారు. ముగ్గురు పరిస్థితి ఆందోళకరంగా ఉందని డాక్టర్లు తెలిపారు. కొన్ని రోజుల ముందు కూడా 18 మంది విద్యార్థుల బృందంపై పిడుగు పడటంతో ఒకరు మృతి చెందినట్టు మేయర్ హబిటెగెకో ఫ్రాన్‌కోయిస్ వివరించారు.

16 మంది మిలిటెంట్ల హతం

కైరో : సినాయ్‌లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల ఏరివేతలో భాగంగా చేపట్టిన డ్రైవ్‌లో నాలుగు రోజుల్లో 16 మంది మిలిటెంట్లను హత మార్చినట్టు ఈజిప్ట్ మిలటరీ అధికారులు తెలిపారు. సెర్చ్ ఆపరేషన్ ఇంకా కొనసాగిస్తున్నట్టు తెలిపారు. మిలిటెంట్లకు, ఆర్మీ జవాన్లకు మధ్య జరిగిన కాల్పుల్లో ఓ సైనికుడు వీరమరణం పొందినట్టు అధికారులు వెల్లడించారు. ఈజిప్ట్ అధ్యక్షుడు రెండోసారి ఈ నెలలో నిర్వహించే ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో మూడు నెలల్లో సినాయ్‌ను విడిచి పెట్టి వెళ్లాల్సిందిగా ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులకు గడువు విధించారు. అయినా వారిలో మార్పు రాకపోవడంతో అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా అల్ సిసి ఆదేశాల మేరకు ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమానికి ఆర్మీ అధికారులు శ్రీకారం చుట్టారు. నవంబర్ తరువాత ఐఎస్ అనుమానితులు ఎవరు కనిపించినా కాల్చివేయాలని అబ్దెల్ ఆదేశించారు. దీనితరువాత రెచ్చిపోయిన తీవ్రవాదులు మాస్కోలోని ఓ ప్రార్థనా మందిరంపై దాడి చేసి 300 మందిని పొట్టనబెట్టుకున్నారు. నార్త్ సినాయ్‌లో ఉగ్రవాదులు వందలాది మంది సైనికులు, పోలీసులు, ప్రజలను హతమార్చారు. క్రిస్టియన్ చర్చిలపై కూడా బాంబు దాడులకు పాల్పడి చాలా మందిని చంపేశారు. 2015లో రష్యన్ ఏయిర్‌లైన్స్‌పై కూడా బాంబు దాడి చేసి 224 మంది మరణానికి కారకులయ్యారు.

సిరియా అంతర్యుద్ధంలో..

20 రోజుల్లో వెయ్యి మంది మృతి

దౌమ (సిరియా) : సిరియా రక్షణ దళాలు తూర్పు గౌటపై దాడులు చేస్తూనే ఉన్నాయి. అతిపెద్ద పట్టణంగా ఉన్న ఎన్‌క్లేవ్‌పై ఆర్మీ బాంబులు, తుపాకులతో విరుచుకుపడటంతో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం సంభవించింది. ఈ అంతర్యుద్ధంతో కేవలం ఎన్‌క్లేవ్ పట్టణంలోనే సుమారు 1000 మంది ప్రాణాలు వదిలారు. సుమారు 20 రోజులుగా ఈ దాడులు కొనసాగుతూ వస్తున్నాయి. ఫిబ్రవరి 18న తూర్పు గౌటపై యుద్ధం చేయాల్సిందిగా సిరియా ప్రభుత్వం తమ సైనికులను ఆదేశించింది. సుమారు సగానికి పైగా ప్రాంతం నేలమట్టమైంది. చివరికి సిరియా దళా లు తూర్పు గౌటలో ఉన్న దౌమను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సిరియా అంత ర్యుద్ధంపై ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకత వస్తున్నా ప్రభుత్వం మాత్రం దాడులు కొనసాగిస్తూనే ఉంది. దౌమ నుంచి హరస్తాతో పాటు పశ్చిమ ప్రాంతాలకు వెళ్లే రోడ్డు మార్గాన్ని ఆర్మీ దళాలు ధ్వంసం చేశాయి. మిస్రబాపై కూడా ప్రభుత్వం పట్టు సాధించింది. సైనికులు తూర్పు గౌటాను మూడు భాగాలుగా విభజించారు.

దౌమ తో పాటు పరిసర ప్రాంతాలు, పశ్చిమంలో ఉన్న హరస్తా, దక్షిణాన ఉన్న పట్ట ణాలుగా విభజించి దాడులకు తెగబడింది. మోర్టార్ షెల్స్‌తో పాటు వైమానిక దాడు లు నిర్వహిస్తున్నారు. 20 మంది పౌరులు దౌమలో శనివారం ప్రాణాలు కోల్పో యారు. మృతుల్లో నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. అధికారులు తెలి పిన వివరాల ప్రకారం... సుమారు 1,031 మంది చనిపోయారు. మృతుల్లో 219 మంది అభం శుభం తెలియని చిన్నారులు ఉన్నారు. సుమారు 4,350 మంది గాయాలపాలయ్యారు.

నాన్న హంతకులను క్షమించేశా

ఐఐఎం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రాహుల్ వ్యాఖ్యలు



సింగపూర్: 'నాన్న చనిపోయిన తర్వాత చాలా ఏళ్ల పాటు బాధపడ్డాం. కానీ ఆయన్ని చంపినవారిని నేను, ప్రియాంక పూర్తిగా క్షమించేశాం' అంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ ఉద్వేగానికి లోనయ్యారు. నాన్న చనిపోతారని ముందే తెసునని రాహుల్ వ్యాఖ్యానించారు. తన మాట వినకుండా మృత్యువుకు ఎదురు వెళ్లారని చెబుతూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ సింగపూర్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఐఐఎం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తన తండ్రి, నానమ్మ మరణాలను ప్రస్తావించారు. తమిళనాడు లోని ఎన్నికల ర్యాలీలో ఎల్‌టీటీఈ మహిళా ఆత్మాహుతి దాడిలో 21 మే 1991న భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మరణించిన విషయం తెలిసిందే.

నా తండ్రిని చంపేసిన ఎల్‌టీటీఈ నేత ప్రభాకరన్ 2009లో చనిపోయినప్పుడు టీవీలో అతను నిర్జీవంగా పడి ఉండటం చూసి నాకు రెండు విషయాలు గుర్తుకు వచ్చాయి. మొదట..ప్రభాకరన్‌ని ఎందుకింత నీచంగా అవమానిస్తున్నారు అనిపించింది. రెండోది..అతను చనిపోవడంతో భార్య, పిల్లలు అనాథలైపోయారని బాధేసింది. ఆ తర్వాత నా సోదరి ప్రియాంకకు ఫోన్ చేశాను. 'నాన్నను హతమార్చిన ప్రభాకరన్ చనిపోయాడు. ఇందుకు నేను సంతోషించాలి. కానీ నాకు ఈ భావనే కలగడంలేదు' అని చెప్పాను. తనకూ అలాగే ఉందని ప్రియాంక నాతో చెప్పింది' అని అప్పటి రోజులను రాహుల్ గుర్తుచేసుకున్నారు. 'రాజకీయాల్లో తప్పుడు వ్యక్తులకు వ్యతిరేకంగా నిలిచినా, దేని గురించైనా గట్టిగా పోరాడినా మనం చనిపోతాం. నా తండ్రి, నానమ్మ చనిపోతారని మేం ముందే ఊహించాం. తాను చనిపోతానని ముందే తెలుసని నానమ్మ నాకు చెప్పింది. 'మీరు చనిపోతారు' అని నేను నాన్నకు చెప్పాను అని కాంగ్రెస్ అధినేత వెల్లడించారు.

ఒక మాజీ ప్రధానికి కొడుకుగా, మరొక మాజీ ప్రధానికి మనుమడిగా మీరెప్పుడైనా అధికార జీవితాన్ని కోరుకున్నారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ, 'నాణేనికి మీరెటు వైపు ఉన్నారనే దానిపై ఇది ఆధారపడి ఉంటుంది. నేనున్న చోట నాకు అనేక అధికారాలున్నాయి. అయితే, నేను గతుకుల ప్రయాణం చేయట్లేదని చెప్పలేను. నానమ్మ హత్యకు గురైనప్పుడు నాకు పద్నాలుగేళ్ల వయసు. ఆమెను ఎవరైతే చంపారో, వారే రోజూ నాతో బ్యాడ్మింటన్ ఆడేవారు. ఆ తర్వాత నాన్న కూడా హత్యకు గురయ్యాడు. ఉదయం.. మధ్యాహ్నం.. రాత్రి నా చుట్టూ 15 మంది వ్యక్తులు (భద్రత) ఉండేవాళ్లు. కాబట్టి దాన్ని అధికారంగా భావించలేదు. అదొక సంక్లిష్ట పరిస్థితిగానే భావించాను అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

మంటల్లో విద్యార్థులు

- తమిళనాడు అడవుల్లో కార్చిచ్చు
- పర్వతారోహణ శిక్షణా శిబిరంలో 36 మంది
- 15 మందిని కాపాడిన అటవీ సిబ్బంది
- కేంద్రానికి సీఎం అభ్యర్థన
- రక్షణ మంత్రికి థేని కలెక్టర్ సమాచారం
- రంగంలోకి రెండు హెలికాప్టర్లు



థేని, తమిళనాడు: జిల్లాలోని కురంగణి పర్వతాల్లోని ఒక పర్వతారోహణ శిక్షణా శిబిరాన్ని ఆదివారం ఒక ఆకస్మిక దావానలం చుట్టుముట్టడంతో దాదాపు 36 మంది విద్యార్థులు మంటల్లో చిక్కుకున్నారు. ఇప్పటిదాకా 15మందిని రక్షించినట్టు అధికారులు తెలిపారు. సహాయక బృందాల చొరవతో దాదాపు 10 నుంచి 15 మంది విద్యార్థులు పర్వత పాదాలకు చేరుకుంటున్నారని కేంద్ర రక్షణ శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.పళని స్వామి అభ్యర్థన మేరకు కేంద్రం సహాయక చర్యలు చేపట్టింది. థేని జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రికి సహాయక చర్యల వివరాలను అందిస్తున్నారు. సహాయక చర్యల్లో భాగంగా భారతీయ వైమానిక దళం కోయంబత్తూరు సమీపంలోని సులూరు ఎయిర్ బేస్ నుంచి రెండు హెలికాప్టర్లను రంగంలోకి దించిందని పేర్కొంటూ కేంద్ర మంత్రి వరుస ట్వీట్లు చేశారు.

కార్చిచ్చు ఘటనకు సంబంధించి గౌరవనీయ తమిళనాడు ముఖ్యమంత్రి చేసుకున్న అభ్యర్థన మేరకు సహాయక, తరలింపు చర్యలు చేపట్టాల్సిందిగా ఐఎఎఫ్ - ఎంసిసిని ఆదేశించినట్టు ఆమె తెలిపారు. థేని జిల్లా కలెక్టర్‌తో సదరన్ కమాండ్ నిత్యం సమాచార సంధానం జరుపుతున్నదని చెప్పారు. అనంతరం 10 నుంచి 15 మంది విద్యార్థులు పర్వత పాదాలకు చేరుకుంటున్నట్టు థేని జిల్లా కలెక్టర్ తెలిపారని సాయంత్రం ఏడు గంటలకు కేంద్ర మంత్రి ట్వీట్ చేశారు. ఒక వైద్య బృందం సంఘటనాస్థలికి చేరుకుంది. సమీపంలోని ఒక ప్రయివేట్ టీ ఎస్టేట్ ఉద్యోగులు సైతం సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నారని తెలిపారు. కురంగణి పర్వతాలు దక్షిణ తమిళనాడులోని బొడినాయకనూరు సమీపంలో ఉన్నాయి. 12 మంది విద్యార్థులను స్థానిక గిరిజనులు, అగ్నిమాపక, సహాయక సేవల విభాగం, అటవీ శాఖ సిబ్బంది రక్షించారని ఇక్కడి అధికారులు తెలిపారు. ఇతరులను తరలించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు.

కోయంబత్తూరు, ఈరోడ్ నుంచి వచ్చిన విద్యార్థులు కురంగై-కొలుకు పర్వత ప్రాంతంలో శిక్షణ తీసుకుంటుండగా మధ్యాహ్నం అకస్మాత్తుగా కార్చిచ్చు రగిలిందని పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ వి.భాస్కరన్, రెవెన్యూ, అటవీ అధికారులు ప్రమాద స్థలి నుంచి విద్యార్థులను కాపాడే చర్యలను చేపడుతున్నారు. వైమానిక దళం, ఇతర శాఖాధికారుల సమన్వయంతో సహాయక చర్యలను వేగవంతం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్‌ను కేంద్ర మంత్రి ఆదేశించారని అధికారులు చెప్పారు. రెండు ఐఎఎఫ్ సారంగ్ హెలికాప్టర్లు సులురు నుంచి కురంగణి అటవీ ప్రాంతానికి బయలుదేరినట్టుగా పోలీసులు చెప్పినట్టు కోయంబత్తూరు నుంచి వార్తలు అందాయి.



చట్ట సభల్లో వ్యక్తిగత దూషణలొద్దు

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాల్లో వ్యక్తిగత విమర్శలు తగవని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సహచర చట్ట సభ్యులకు హితవు పలికారు. ఎవరైనా సరే, చర్చల సందర్భంగా ఆయా అంశాల ప్రాతిపదికగా దూకుడుగా వ్యవహరించాలే తప్ప, వ్యక్తులపై కాదని సూచించారు. ఇతరులపై తరచూ నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా విశ్వసనీయతను కోల్పోవడం తప్ప ఒరిగేదేమీ ఉండదని హెచ్చరించారు. పార్లమెంట్ సెంట్రల్ హాలులో ఎంపీలు, ఎమ్మెల్యేల సదస్సులో ఆయన ప్రసంగించారు. కీలక చర్చల కంటే పార్లమెంటులో గొడవలు ఆందోళనలతో ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం లభిస్తోందన్నారు. వ్యక్తిగత విమర్శలు, వాగ్యుద్ధాలకు దిగడం వంటి చర్యలను కొద్దివర్గాలు ఆస్వాదిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంటు సమావేశాల్లో వ్యక్తిగత దూషణల కంటే అంశాల వారీ చర్చకే ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. కేంద్ర పన్నుల్లో అన్ని రాష్ట్రాలకు సమాన వాటా లభిస్తుందని, దీనికి భిన్నంగా జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని జైట్లీ సూచించారు.

అయోధ్యపై సయోధ్య కష్టమే

మందిరం నిర్మించడం ఖాయం:ఆర్ఎస్ఎస్



నాగ్‌పూర్: అయోధ్య వివాదంలో ఏకాభిప్రాయంసులువు కాదని, అయినప్పటికీ, రామ మందిర నిర్మాణం జరిగి తీరుతుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తేల్చిచెప్పింది. ప్రస్తుతం ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉందని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి భయ్యాజీ జోషి చెప్పారు. అయోధ్యలో రామ మందిరం మినహా మరే ఇతర నిర్మాణం జరగదు. ఈ మేరకు నిర్ణయించడం అయినది అని అఖిలభారతీయ ప్రతినిధి సభ సమావేశం సందర్భంగా ఆయన మీడియాతో వ్యాఖ్యానించారు. మందిరం విషయంలో సుప్రీం నుంచి సానుకూల తీర్పు వస్తుందన్న నమ్మకం ఉంది. కోర్టు తీర్పు తర్వాత ఆలయ నిర్మాణం ప్రారంభం అవుతుంది. భూ యాజమాన్యంపై స్పష్టత కోసం ఎదురు చూస్తున్నాం అని భయ్యాజీ జోషి చెప్పారు. ఏకాభిప్రాయ సాధన కోసం పండిట్ రవిశంకర్ చేస్తున్న ప్రయత్నాలపై ప్రశ్నించగా, సయోధ్య సులువు కాదని అన్నారు. కాగా, రవిశంకర్ ప్రయత్నాలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. కర్నాటకలో లింగాయత్ సామాజిక వర్గం మైనార్టీ హోదా కోసం చేస్తున్న డిమాండ్‌కు తాము మద్దతివ్వబోమని అన్నారు. అయోధ్య వివాదంపై 14న సుప్రీంలో విచారమ జరగనుంది.

కూడలిలో ప్రజాస్వామ్యం



- వివక్ష విద్వేషాలను అధిగమించాలి..ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలి
- అమెరికా ఎన్నికల్లో రష్యా మితిమీరిన జోక్యం నిజమే..అందుకే ఓడాను
- ఉగ్రవాద నిర్మూలనలో పాకిస్తాన్ శక్తిమేరకు పనిచేయడం లేదు
- అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్

ముంబై: భారత్, అమెరికా సహా ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు కూడలిలో ఉన్నాయని, గందరగోళ పరిస్థితులను అధిగమించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ అభిప్రాయపడ్డారు. 2018 ఇండియా టుడే సదస్సులో ఆమె మాట్లాడుతూ, పలు అంశాలను ప్రస్తావించారు. మునుపెన్నడూ లేనివిధంగా మీ (భారత్) శక్తి మాకు అవసరం. సెక్సిజం, రేసిజంకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన అవసరం ఉంది. ఆగ్రహం, అసంతృప్తులను దూరం పెట్టాలి. అభిప్రాయాలను నిర్భయంగా చెప్పగలగాలన్నారు. 'ద గ్రేట్ చర్న్: వాట్ హ్యాపెన్స్ నౌ' శీర్షికతో ఆమె ప్రసంగం సాగింది. ఇండో-అమెరికా దేశాల్లో ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడయ్యాక అమెరికాలో ప్రజాస్వామ్యం మరమ్మతు దశను దాటిపోయింది. మా దేశంలో అధికార మార్పు గురించి ఆందోళన నేను ఆందోళన చెందడం లేదు. సంబంధిత చర్చల్లో ఒక పార్టీ ఆధిపత్యం కొనసాగుతోంది. ప్రస్తుతం వాషింగ్టన్‌లో పరిస్థితి ఇదే. ఇలాంటి పరిణామాలు అవాంఛనీయం. ఇక నా ఓటమి గురించి చెప్పాలంటే.. అమెరికా చరిత్రలో నాటి ఎన్నికలు టీవీ రియాలిటీ షోను తలపించాయి. అసభ్య, అనుచిత వ్యాఖ్యలకు భారీ ప్రచారం లభించింది. ఓటర్లను చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. టీవీ చర్చలు వినోదాత్మకంగా ఉంటాయి. కానీ, ఓటర్లకు పూర్తి సమాచారం ఇవ్వలేవు. ఇప్పటికీ అమెరికన్లు ట్రంప్‌ను అధ్యక్షుడిగా జీర్ణించుకోవడం లేదు. ట్రంప్ విజయం వెనుక మితిమీరిన రష్యాజోక్యం ఉంది. నాపై వ్యతిరేకతతోనే పుతిన్ ఇలా చేశారు. అతను మంచి స్త్రీవాదిగా నేను పేర్కొనలేను. 2011 రష్యా ఎన్నికల్లో పుతిన్‌కు వ్యతిరేకంగా నేను పనిచేశానని అనుమానించడం వల్లే అమెరికా ఎన్నికల్లో జోక్యం చేసుకున్నారు. మా దేశాన్ని విభజించేందుకు రష్యాకుట్రలు పన్నుతోంది. దీనికి వ్యతిరేకంగా అమెరికన్లంతా ఏకం కావాలి. లాటిన్ అమెరికా, ఇండియా, చైనా దేశాల వలస ప్రజలు అమెరికాలో ఉన్నారు. వారికి వ్యతిరేకంగా మేక్ అమెరికా.. గ్రేట్ అగైన్ పేరుతో ప్రత్యర్థి చేసిన ప్రచారం ప్రభావం చూపింది. అతివిశ్వాసంతో కూడిన ప్రచారం కూడా ఓటింగ్ శాతం తగ్గడానికి కారణమైందని హిల్లరీ అంగీకరించారు.

పాక్‌పై ఫైర్

అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ పాకిస్తాన్ తీరును ఎండగట్టారు. ఉగ్రవాదాన్ని కట్టడి చేయటంలో పాక్ ఘోరంగా విఫలమౌతోందని ఆమె పేర్కొంది. సరైన చర్యలు చేపట్టడంలో పాక్ సర్కారు నిర్లక్ష్యం వహించిందంటూ ఇండియా టుడే సదస్స ప్రసంగంలో వ్యాఖ్యానించారు. 'భారత్‌తో సరిహద్దు సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపించటం లేదు. పైగా ఉగ్రవాదులను ప్రొత్సహిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. మరో పొరుగు దేశం అఫ్ఘనిస్థాన్‌తోనూ అదే వైఖరి కొనసాగిస్తున్నారు. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉంది. అమెరికా పాక్‌ను కట్టడి చేయటంలో ఎప్పుడూ ముందుంటుంది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అది చేస్తుందనే ఆశిస్తున్నా' అని హిల్లరీ పేర్కొన్నారు. ఇక సరిహద్దులోనే కాకుండా సొంత దేశంలోనూ ఉగ్రవాదాన్ని నిర్మూలించటంలో పాక్ విఫలమైందని ఆమె తెలిపారు. పాక్ వైఖరితో భారత్ పడుతున్న ఇబ్బందులు తనకు క్షుణ్ణంగా తెలుసని హిల్లరీ పేర్కొన్నారు.

యూపీ, బీహార్‌లో ఉపఎన్నికలు ప్రశాంతం

- గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్‌లో 43శాతం
- పాట్నాలో ఒక ఎంపీ, రెండు అసెంబ్లీ స్థానాలకు పోలింగ్
- మార్చి 14న ఓట్ల లెక్కింపు

లక్నో : గోరఖ్‌పూర్, ఫుల్‌పర్ పార్లమెంట్ స్థానానికి నిర్వ హించిన ఉప ఎన్నిక ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. గోరఖ్‌పూర్‌లో 43 శాతం, ఫుల్‌పర్‌లో 37.39 శాతం పోలింగ్ నమోదైంది. శాంతి యుత వాతావరణంలో ఎన్నికల సరళి కొన సాగిందని, ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా గట్టి పోలీసు భద్రత మధ్య ఎన్నికలు నిర్వహించారని పోలింగ్ అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 వరకు కొనసాగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు వచ్చాయి. అయినా ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కల్గజేయకుండా వేరే మిషన్‌లను అమర్చి ఓటింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం జరిగింది. స్థానిక పోలీసులు, హోంగార్డులతో పాటు 65 కంపెనీల కేంద్ర పారామిలటరీ బలగాలు భద్రత మధ్య ఎన్నికల ప్రక్రియ ముగిసింది.

ఉత్తర్‌ప్రదేశ్ సీఎంగా ఉన్న యోగీ ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మయూరా ఇద్దరు తమ తమ లోక్‌సభ స్థానాలైన గోరఖ్‌పూర్, ఫుల్‌పర్ స్థానాలకు రాజీనామాలు చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇక రెండు లోక్ సభ స్థానాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు మార్చి14న ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

అరారియాలో 70శాతం

పాట్నా : అరారియా లోక్‌సభ స్థానానికి కూడా ఆదివారం ఉప ఎన్నిక నిర్వహించారు. 70శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. జేడీ(యూ), బీజేపీ కూటమిగా ఏర్పడగా, ఆర్‌జేడీ, కాంగ్రెస్ కలిసి కూటమిగా ఏర్పడ్డాయి. వచ్చే ఏడాది సాధారణ ఎన్నికల్లో మాత్రం రెండు కూటముల మధ్య పోటీ తీవ్రంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు.



భభువా, జెహనాబాద్ అసెంబ్లీ స్థానాలకు కూడా ఉప ఎన్నిక నిర్వహించారు. రెండు స్థానాల్లో వరుసగా 54.03 శాతం, 50.06 శాతంగా ఓటింగ్ నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగిందని బీహార్ ప్రధాన ఎన్నికల అధికారి అజయ్ వి నాయక్ తెలిపారు. మూడు స్థానాలకు నాలుగు పార్టీలు రెండు కూటములుగా ఏర్పడి ఎన్నికల రంగంలోకి దిగాయి. ఆర్‌జేడీతో జేడీ(యూ) తెగదెంపులు చేసుకుని బీహార్ సీఎంగా నితీష్ కుమార్ స్వతంత్రంగా బీజేపీతో పొత్తు పెట్టుకున్న తరువాత నిర్వహించిన మొదటి ఉప ఎన్నిక కావడంతో గమనార్హం. ఆర్‌జేడీ నేత మహ్మద్ తస్లిముద్దీన్ చనిపోవడంతో ఆరారియా స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.



థియేటర్లలో కిరాక్ రచ్చ ఖాయం

- ఆడియో వేడుకలో నిఖిల్

కన్నడంలో ఘన విజయం సాధించినట్లే కిరాక్ పార్టీ చిత్రం తెలుగులోనూ ప్రేక్షకుల ఆదరణను చూరగొనాలని అల్లరి నరేష్ ఆకాంక్షించారు. నిఖిల్, సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీంజా హీరోహీరోయిన్లుగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన కిరాక్ పార్టీ చిత్రం ఈ నెల 16న విడుదలకానుంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం ఆడియో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విడుదలైంది. ఉషారామా ఇంజనీరింగ్ కాలేజీలో వేలాది మంది కాలేజీ స్టూడెంట్స్ సమక్షంలో జరిగిన ఈ వేడుకలో అతిథిగా పాల్గొన్న అల్లరి నరేష్ బిగ్ సీడీని, ఆడియో సీడీలను విడుదలచేసి, తొలి సీడీని నిర్మాతల్లో ఒకరైన రామబ్రహ్మం సుంకరకు అందించారు.

ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ, నాకు నిఖిల్‌ని చూసినపుడల్లా డ్యూరో సెల్ బ్యాటరీ గుర్తుకొస్తుంది. మా ఆహుతి ప్రసాద్‌గారి అబ్బాయి కార్తీక్ ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది అని అన్నారు.

చిత్ర కథానాయకుడు నిఖిల్ మాట్లాడుతూ, అల్లరి నరేష్ ఆడియో విడుదలచేసిన నా ప్రతి సినిమా సూపర్‌హిట్. అలాగే ఈ చిత్రం సూపర్‌హిట్ అవుతుందని ఆశిస్తున్నా. ఈ నెల 16న థియేటర్లలో రచ్చ రచ్చే. కన్నడంలో ఇంతమంచి సినిమా ఒకటి ఉందని గుర్తించి...నాకు ఈ సినిమాలో నటించే అవకాశాన్ని ఇచ్చిన అనిల్ సుంకరకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నా. కార్తికేయతో చందు మొండేటికి, స్వామిరారాతో సుధీర్‌వర్మకు ఎలాంటి మంచిపేరు వచ్చిందో ఈ చిత్రం ద్వారా శరణ్‌కు కూడా అదేస్థాయిలో పేరొస్తుంది. వినోదంతో పాటు మంచి సందేశం ఉన్న సినిమా ఇది అన్నారు. నిర్మాతల్లో ఒకరైన అనిల్ సుంకర మాట్లాడుతూ, మా టీమ్ అంతా ఎంతో కష్టపడి ఈ చిత్రానికి పనిచేశారు. ఈ ఆడియో ఫంక్షన్‌లానే సినిమాకు కూడా రీసౌండ్ వస్తుందని ఆశిస్తున్నాను అని అన్నారు. దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ, విద్యార్థులు మాస్ బంక్ కొట్టి మరీ ఈ చిత్రం చూసి ఎంజాయ్ చేస్తారని అనుకుంటున్నాను. ప్రతీ విద్యార్థి ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది అని పేర్కొనగా, కథానాయికల్లో ఒకరైన సంయుక్త హెగ్డే మాట్లాడుతూ, సినిమా విడుదల కోసం తాను కూడా ఆతృతగా ఎదురు చూస్తున్నానని అన్నారు. మరో కథానాయిక సిమ్రాన్ పరీంజా మాట్లాడుతూ, తెలుగులో తనకు లభించిన మొదటి అవకాశం ఈ చిత్రం కావడం ఆనందంగా ఉందన్నారు.



నాగార్జున, మైరా సరీన్

ఆఫీసర్ గురి ఎవరిపైనో

నాగార్జున, రాంగోపాల్‌వర్మల కలయికలో తెరకెక్కుతున్న చిత్రం ఆఫీసర్. ప్రస్తుతం క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. కాగా ఈ చిత్రం ఆన్ లొకేషన్ ఫొటోను షేర్ చేశారు. ఇందులో నాగార్జున, ఆయన సరసన నాయికగా నటిస్తున్న మైరా సరీన్‌లు లోడెడ్ గన్‌లతో ఎవరిపైనో గురిపెట్టినట్లుగా కనిపిస్తున్నారు. అయితే దీని వెనుక కథేంటి అన్న అంశం తెలుసుకోవాలంటే సినిమా విడుదల తేదీ మే 25 వరకు ఆగాల్సిందే. వర్మకు చెందిన కంపెనీ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో నాగార్జున పోలీస్ అధికారి పాత్రలో నటిస్తున్నారు. మైరా సరీన్‌కు ఇది తొలి చిత్రం. అయితే ఆమె నటనను చూస్తే అలా అనిపించడం లేదని, నటనలో అనుభవం ఉన్న నటిలా మా అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించిందని వర్మ అంటున్నారు. ఇదిలావుండగా...ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో థియేటర్ హక్కులు భారీ మొత్తానికి అమ్ముడైనట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో వాటిపై కంపెనీ సీఈఓ సుధీర్‌చంద్ర స్పష్టతనిస్తూ...చిత్రం నిర్మాణదశలో ఉందని, బిజినెస్ జరగలేదని వెల్లడించారు.



సీరత్ కపూర్

మనసు మాట వింటున్నా...!

మనసు మాట వినమంటారు. ఫాలో యువర్ హార్ట్ అంటూ గొప్ప ఆంగ్లోక్తి ఉంది. ఆర్థిక ఒత్తిడికి తలొగ్గి చేసే పనులు తాత్కాలిక ఉపాధిని ఇస్తే...హృదయానికి దగ్గరయే వృత్తి జీవితాంతం సంతోషాలను, సంతృప్తినీ నింపుతుంది. ఇది ఎందరి జీవితాల్లోనో నిజమైంది. వారిలో అందాల భామ సీరత్ కపూర్ కూడా ఉన్నారు. రన్ రాజా రన్ చిత్రంతో తెలుగు తెరకొచ్చిన ఈ ముంబై భామ..ఆ తర్వాత రాజుగారి గది 2, ఒక్కక్షణం సినిమాలతో విజయాలు అందుకుని క్రేజ్ పెంచుకుంది. ఇటీవల టచ్ చేసి చూడులో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఆమెకు చేతినిండా చిత్రాలున్నాయి. ఇప్పుడొక విజయవంతమైన తారగా ఉన్న సీరత్...గతంలో సాధారణ అమ్మాయే. నచ్చిన వృత్తిని ఎంచుకుని అనుకున్నది సాధించింది. మనసు మాట విన్న సందర్భం గురించి సీరత్ మాట్లాడుతూ....

చిన్నప్పటి నుంచి చదువులతో పాటు కళలపై ఆసక్తి ఉండేది. అమ్మా నాన్న నా ప్రతిభను గుర్తించి నృత్యం, సంగీతంలో శిక్షణ ఇప్పించారు. పోదార్ ఇంటర్నేషనల్ పాఠశాలలో చదువుకున్నాను. తర్వాత మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేశాను. పాఠశాల నుంచే సాంస్కృతిక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాను. ఒకవైపు చదువు మరోవైపు డాన్స్ కోర్సులు చేశాను. అయితే ఈ రెండింటికీ సరైన సమయం కేటాయించడం కుదరలేదు. కొన్నాళ్లకు చదువుకోవడం కష్టమయింది. బాగా ఆలోచించాక...మనసుకు నచ్చిందే చేయాలని నిర్ణయించుకున్నాను. ప్రతి ఒక్కరిలో అంతర్గతంగా గొప్ప శక్తి ఉంటుంది. అది ప్రత్యేకం. దాన్ని తెలుసుకోవడమే విజయం. అలా కళలనే వృత్తిగా ఎంచుకోవాలనుకున్నాను. ఆష్లే లోబో డాన్స్‌వర్క్స్ అనే సంస్థలో నృత్య శిక్షకురాలిగా చేరాను. మనసు మాట విన్న ఆ క్షణం నుంచి నా జీవితం మారిపోయింది అని చెప్పుకుంది.

బంగారు తెలంగాణ ఆడియో విడుదల

షిరిడీ సాయి క్రియేషన్స్ పతాకంపై కూర అంజిరెడ్డి సమర్పణలో బిపిన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం బంగారు తెలంగాణ. బిపిన్, రమ్య, అక్షర, బాబూ మోహన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్ర ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్ లో జరిగింది. ఈ సందర్భంగా నటుడు, దర్శకుడు బిపిన్ మాట్లాడుతూ.....ఎంతోమంది త్యాగంతో తెలంగాణ ఏర్పడింది. కొందరు అమరులైతే మరికొందరు జీవితాన్ని అంకితం చేశారు. తెరాస అధినేత కేసీఆర్ ప్రాణాలకు లెక్కచేయకుండా ఆమరణ దీక్షతో తెలంగాణ సాధించారు. ప్రజలు, నాయకులు తమ పోరాటంతో తెలంగాణ ఎలా సాధించుకున్నారే మొత్తం క్రమాన్ని బంగారు తెలంగాణ చిత్రంలో చూపిస్తున్నాం. ఈ చిత్రంలో ఐదు పాటలున్నాయి. సినిమా పూర్తయ్యేందుకు సహకరించిన



మిత్రులకు కృతజ్ఞతలు. అన్నారు. సహ నిర్మాత ఏవీ స్వామి మాట్లాడుతూ....ఆరు దశాబ్దాల పోరాటంతో తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ సాధన జరిగిన క్రమంలో మలుపులన్నీ ఈ చిత్రంలో ఆసక్తికరంగా దర్శకులు మలిచారు. నేటి తరం పిల్లలకు, యువతకు తెలంగాణ ఆవిర్భావం గురించి వివరంగా చూపిస్తుందీ చిత్రం. అన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు అశోక్ కుమార్, దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రియమణి

కాలచక్రంతో ముడిపడిన ప్రేమికుల వీరగాథ

ప్రియమణి టైటిల్ పాత్రలో నటించిన చిత్రం అంగుళీక. దీపక్ హీరో. ప్రేమ్‌ఆర్యన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ శంఖుచక్ర ఫిలింస్ పతాకంపై కోటి తూముల, ఎ.హితేష్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ ఆదివారం విడుదలైంది. దర్శకుడు కోడి రామకృష్ణ చేతులమీదుగా టీజర్ ఆవిష్కరణ జరిగింది. అనంతరం కోడి రామకృష్ణమాట్లాడుతూ, ఈ సినిమా గురించి నాకు మొదట్నుంచి తెలుసు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటన్నింటినీ తట్టుకుంటూ నిర్మాతలు ఇంతవరకు తీసుకొచ్చారు. దర్శకుడికి అండగా నిలబడ్డారు. టీజర్ టైమింగ్, కటింగ్ చూశాక దర్శకుడు సినిమాను అద్భుతంగా తీసుంటారని అర్థమైంది. ఈ సినిమా ద్వారా పరిచయమవుతున్న నిర్మాతలకు మంచి లాభాలు, దర్శకుడికి పేరు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని అన్నారు.

దర్శకుడు ప్రేమ్‌ఆర్యన్ మాట్లాడుతూ, కోడి రామకృష్ణస్ఫూర్తితో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశాను. కాలచక్రంతో ముడిపడిన ఇద్దరు ప్రేమికుల వీరగాథే ఈ చిత్రం. టైటిల్ పాత్రలో ప్రియమణిగారు అద్భుతమైన నటనను కనబరిచారు. కాలచక్రం, సూర్యగ్రహణం...ఈ రెండు అంశాల చుట్టూ సినిమా తిరుగుతుంది. సూర్యగ్రహణం ఘడియల్లో విడిపోయిన ప్రేమజంట మళ్లీ సూర్యుడి ఆశీస్సులతో 585 ఏళ్ల తర్వాత కలుసుకుంటారు. అదే సమయంలో పగతో రగిలిపోతున్న దుష్టాత్మ ఆ జంటపై పగ తీర్చుకుందా? ఆ ప్రేమజంట ఆత్మలకు ఎలా మోక్షం కలిగిందన్న అంశం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది అని అన్నారు.

నిర్మాతలలో ఒకరైన కోటి తూముల మాట్లాడుతూ, దర్శకుడు చాలాకాలం స్క్రిప్ట్‌పై కూర్చుని ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రస్తుతం గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోంది. సినిమా అనుకున్న దానికన్నా చాలాబాగా వచ్చింది అని పేర్కొనగా, మరో నిర్మాత ఎ.హితేష్‌రెడ్డి మాట్లాడుతూ, కథ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మించాం. విజువల్స్ చాలా గ్రాండియర్‌గా ఉంటాయి. అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చేలా భారీ బడ్జెట్‌తో ఎక్కడా రాజీపడకుండా నిర్మించాం అని అన్నారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో దేవ్‌గిల్, విద్య, శేఖర్‌వర్మ, పంకజ్, మేకా రామకృష్ణ కోటేశ్వరరావు, వేణు, అవినాష్, జయవాణి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి మాటలు: సుదర్శన్, సంగీతం: శామ్ కె.ప్రసన్, కెమెరా: చిట్టిబాబు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: శశి బాణాల, శివ సిర్రి, ఎడిటింగ్: మార్తాండ్ కె.వెంకటేష్.

ఆసక్తిని పెంచుతున్న నీది నాది ఒకే కథ డైలాగులు



సాట్నాటైటస్ , శ్రీవిష్ణు

శ్రీవిష్ణు, సాట్నాటైటస్ (బిచ్చగాడు ఫేమ్) నాయకానాయికలుగా నటించిన చిత్రం నీది నాది ఒకే కథ. వేణు ఊడుగుల దర్శకుడు. అరాన్ మీడియా వర్క్స్, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్మాతలు ప్రశాంతి, కృష్ణవిజయ్, అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ, ఈ నెల 23న చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన లభించింది. ఇందులో శ్రీవిష్ణు విద్యార్థిగా కనిపించనున్నారు. టీజర్‌లో చిత్తూరు యాసలో శ్రీవిష్ణు పలికిన డైలాగులు యూత్‌ని విశేషంగా ఆకట్టుకుని చిత్రంపై ఆసక్తిని పెంచాయి అని చెప్పారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో పోసాని కృష్ణమురళి, దేవిప్రసాద్ తదితరులు తారాగణం కాగా సంగీతాన్ని సురేష్ బొబ్బిలి సమకూర్చగా, సినిమాటోగ్రఫీని రాజ్ తోట (అర్జున్‌రెడ్డి ఫేమ్) అందించారు.

అమీర్‌పేట్ టు అమెరికా ట్రైలర్ విడుదల

తేజస్, వంశీ, పల్లవి డోరా, సాషా సింగ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం అమీర్‌పేట్ టు అమెరికా. రాధా మీడియా పతాకంపై స్వప్న కొమండూరి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. రామ్మోహన్ కొమండూరి దర్శకుడు. అమీర్‌పేట్ టు అమెరికా చిత్ర ట్రైలర్‌ను నటుడు తనికెళ్ల భరణి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది అమెరికా వెళ్తున్నవాళ్లున్నారు. అమీర్‌పేట్ నుంచి అమెరికాకు సాగే ప్రయాణమంతా ఇందులో చక్కగా చూపించారు. ఈ చిత్రంలో కీలక పాత్రను పోషించే అవకాశం వచ్చింది. దర్శకుడు రామ్మోహన్ అన్నీ తానై చిత్రాన్ని రూపొందించారు. యువతను అలరించే అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి. అన్నారు. దర్శకుడు రామ్మోహన్ కొమండూరి మాట్లాడుతూ...అమీర్‌పేట్ నుంచి అమెరికా వెళ్లే వాళ్లకు జీవితం స్వర్గంలా కనిపిస్తుంది. కానీ సంపాదనలో దిగాక అక్కడి ఇబ్బందులు ఎదురవుతాయి. వాటిని ఆసక్తికరంగా చూపిస్తున్నాం. ఈ చిత్రాన్ని చాలా భాగం అమెరికాలో చిత్రీకరించాము. ఇద్దరు మంత్రులు మా చిత్రంలో నటించారు. ఈ నెల 23న ఆడియోను, 30న చిత్రాన్ని విడుదల చేస్తాం. అన్నారు.



వైవా హర్షా, వంశీ కృష్ణ బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, మేఘన, జీవన్, రవితేజ, యలమంద, మహిత, రమ్యా పటేల్, ఆషు రెడ్డి, సంతోష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం - కార్తీక్, సినిమాటోగ్రఫీ - అరుణ్, ఎడిటర్ - ప్రవీణ్ పూడి.

సేవా సామ్రాజ్యంగా విస్తరిస్తున్న మనం సైతం



ప్రముఖ నటుడు కాదంబరి కిరణ్...కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మనంసైతం రోజు రోజుకూ తన సేవా సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటోంది. మనసున్న ఎంతోమంది మనంసైతంలో భాగమవుతున్నారు. తమకు వీలైనంత విరాళాలు అందిస్తున్నారు. మరోవైపు ఈ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయిస్తున్న ఆపన్నుల సంఖ్య కూడా బాగా పెరుగుతోంది. వారిలో అత్యవసరం ఉన్న వాళ్లను ఎంపిక చేసి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. అలాంటి కొంతమందికి ఆర్థిక సాయాన్ని శనివారం ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు వీవీ వినాయక్, జి నాగేశ్వరరెడ్డి, నిర్మాత సి కళ్యాణ్, శ్రీ మిత్రా చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ యూనియన్ రాజు, దర్శకత్వశాఖలో పనిచేస్తున్న ఉదయ్‌కాంత్, నటుడు ధమ్ కొడుకు, లైట్‌మెన్ యూనియన్ సభ్యుడు కూతురు అనూజ తదితర పదిమందికి చెక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా కాదంబరి కిరణ్ మాట్లాడుతూ....మనల్ని మనం గౌరవించుకున్నప్పుడే సాటి వారిని గౌరవిస్తాం. చిత్ర పరిశ్రమలో చాలా మందికి కష్టాలు ఉంటాయి కానీ ఎవరికీ చెప్పుకోరు. నాకు కష్టముందని ఎవరికైనా చెబితే అవకాశాలు ఇవ్వరేమో, మనల్ని చీదరించుకుంటారేమో అని భావిస్తారు. కానీ ఆ భావన తప్పని నా అనుభవంలో తెలుసుకున్నాను. నాకు ఇబ్బంది ఉన్నప్పుడు కొంతమంది పరిశ్రమ పెద్దలు ఆదరించారు. అలాంటి ఆదరణ అందరికీ దక్కుతుంది. మనం సైతం సంస్థ బాగా విస్తరిస్తోంది. సేవాభావమున్న చాలా మంది సంస్థలో చేరుతున్నారు. గౌరీ శంకర్ దారా, చింతల సుబ్రహ్మణ్య ప్రసాద్, హరీష్ శంకర్, పుట్టా గోవింద్ లాంటి దాతలు విరాళాలు ఇచ్చారు. మేము చేస్తున్న మంచి కార్యక్రమాలను చాలా మంది చిత్ర పరిశ్రమ, రాజకీయ రంగాల పెద్దలు ఆశీర్వదిస్తున్నారు. ఇవాళ మమ్మల్ని దీవించడానికి వచ్చిన వినాయక్ గారికి, కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు. అన్నారు. దర్శకులు వినాయక్ మాట్లాడుతూ...మంచి కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు సంతోషంగా ఉంది. నా వంతుగా లక్ష రూపాయల విరాళం ఇస్తున్నాను. ఇకపైనా ఎలాంటి సహాయం కావాలన్నా నా దగ్గరకు రావొచ్చు. మనం సైతం లాంటి మంచి సంస్థలో రాజకీయాలకు తావు ఇవ్వొద్దు. అన్నారు. నిర్మాత సి కళ్యాణ్ మాట్లాడుతూ...మనం సైతం జాతీయ స్థాయి సంస్థ కావాలి. కోటి మంది సభ్యులకు చేరాలి. పరిశ్రమ వాసులు తమ పుట్టిన రోజులకు చేసే ఖర్చులో పదిశాతం మనం సైతంకు ఇవ్వాలని కోరుతున్నాను. అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ మిత్రా చౌదరి మనం సైతంకు నెలకు పాతిక వేల రూపాయల విరాళం ప్రకటించారు.

క్రీడాప్రభ

దెబ్బ కొడతారా?

ట్రై సిరీస్ సరిగ్గా సగంలో వుంది. మూడు జట్లు తలా ఒక మ్యాచ్ గెలిచి.. తలా ఒక ఓటమి మూటగట్టుకున్నాయి. ఆ లెక్కన ఫైనల్‌కు చేరుకునేందుకు మూడు జట్లకూ సమాన అవకాశాలు వున్నాయి. కాకపోతే నెట్ రన్‌రేట్ విషయంలో శ్రీలంక కాస్త ఎక్కువ సమానం. ఇప్పటికే భారత్‌పై గెలిచిన చండిమాల్ సేన అదే ఫీట్‌ను మరోసారి పునరావృతం చేసి ఫైనల్ అవకాశాలు మరింత మెరుగు పరుచుకునేందుకు తహతహలాడుతుంటే.. తొలి మ్యాచ్ ఓటమికి బదులు తీర్చుకునేందుకు భారత్ ఉవ్విళ్లూరుతోంది.

ఫామ్‌లో శ్రీలంక | కుదురుకోని భారత్



కలవరపెడుతున్న రోహిత్

భారత్ విషయానికి వస్తే కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్‌లో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఇప్పటివరకూ జరిగిన మ్యాచుల్లో ఒక్క రోహిత్ తప్పించి ప్రతి జట్టు ఓపెనర్లు తమను తాము నిరూపించుకున్నారు. శిఖర్ ధావన్ రెండు అర్ధసెంచరీలు సాధిస్తే.. బంగ్లాదేశ్ ఓపెనర్లు తమీమ్, లిటన్ దాస్‌లు మంచి భాగస్వామ్యాలు అందించారు. శ్రీలంకతో మ్యాచ్ లో 215 పైచిలుకు పరుగులు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెరో 40 పైచిలుకు పరుగులు చేశారు. లంక బ్యాట్స్‌మెన్ కుశాల్ మెండిస్ ఓ మ్యాచ్‌లో అర్ధసెంచరీ చేయగా, గుణతిలక పర్వాలేదనిపిస్తున్నాడు. మొత్తంగా ఇప్పటివరకూ సిరీస్‌లో అత్యంత తక్కువ పరుగులు చేసిన ఓపెనర్ రోహితే(17) ఆందోళన కలిగించే అంశం. అందరికీ సహకరిస్తున్న పిచ్‌లపై ఈ మ్యాచ్‌లో అయినా నాయకుడు ఓ భారీ ఇన్నింగ్స్ ఆడతాడని భారత్ ఆశిస్తోంది.

సూపర్ ఫామ్‌లో ధావన్

జట్టు మరో ఓపెనర్ శిఖర్ ధావన్‌ది రోహిత్‌కు భిన్నమైన పరిస్థితి. సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్ ధావనే. రెండు మ్యాచుల్లోనూ అర్ధసెంచరీలతో(55,90) అదరగొడుతున్నాడు. మరో సారి అతడినుంచి అదే రకమైన ప్రదర్శనను భారత్ ఆశిస్తోందనడంలో సందేహం లేదు. గత ఐదు టీ20 మ్యాచుల్లోనూ అతని ఫామ్ అద్భుతంగా వుంది. అంతకు ముందు సౌతాఫ్రికాలో 47, 24, 72 పరుగులు చేసి.. అదే ఫామ్‌ను కొనసాగిస్తూ వస్తున్నాడు. ఇక మిడిలార్డర్‌లో మనీశ్ పాండే (37,27) మంచి టచ్‌లో కనిపిస్తున్నాడు.

చేజింగ్ జట్టుకే అవకాశాలు!

సిరీస్‌లో జరిగిన మూడు మ్యాచుల్లోనూ చేజింగ్ చేసిన జట్లే విజయం సాధించడం విశేషం. తొలి మ్యాచ్‌లో 170 పైచిలుకు, రెండో మ్యాచ్‌లో 140 పరుగుల లోపే లక్ష్యాలు పెద్ద విషయం కాకపోయినా.. మూడో మ్యాచ్‌లో 215 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ లాంటి చిన్నజట్టు అలవోకగా ఛేదించిన విధానం చూస్తే.. నేటి మ్యాచ్‌లో టాస్ గెలిచిన జట్టు మరోసారి బ్యాటింగ్ ఎంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. టాస్ గెలిచిన జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా వుంటాయని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

చండీమాల్ దూరం

స్లో ఓవర్ రేట్ కారణంగా లంక కెప్టెన్ చండిమాల్ మీద రెండు మ్యాచ్‌ల నిషేధం విధించడంతో భారత్‌తో మ్యాచ్‌కు అతను దూరం కానున్నాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అతను మరీ నిదానంగా బౌలింగ్ చేయించి నందుకు ఈ సస్పెన్షన్ ను ఎదుర్కోనున్నాడు. ఇదే నేరానికి బంగ్లాదేశ్ కెప్టెన్ మహ్మదుల్లా 20 శాతం మ్యాచ్ ఫీజును కోల్పోనున్నాడు. చండిమాల్ మొత్తంగా నాలుగు ఓవర్లు నిర్ణీత సమయంలో పూర్తి చేయలేకపోయినట్టు సమాచారం. దాంతో అతనికి రెండు సస్పెన్షన్ పాయింట్లు లభించాయి. రెండు సస్పెన్షన్ పాయింట్లకు ఒక టెస్టు గానీ, రెండు వన్డేలు లేదా రెండు టీ20లు నిషేధాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. రానున్న 12 నెలల్లో మరోసారి స్లో ఓవర్ రేట్ తో బౌలింగ్ చేయిస్తే చండిమాల్ 2 నుంచి 8 సస్పెన్షన్ పాయింట్లు పొందుతాడు.

శ్రీలంక విజయం సాధిస్తే అద్భుతం జరిగితే తప్పించి ఆజట్టు ఫైనల్‌కు చేరుకున్నట్టే!

రాహుల్ వస్తాడా?

ధోనీ స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడిగా పేరు తెచ్చుకున్న రిషబ్ పంత్ వరుస వైఫల్యాలు చెందుతుండడంతో నేటి మ్యాచ్‌లోనైనా అవకాశం వస్తుందనే ఆశతో వున్నాడు కేఎల్ రాహుల్. కీపింగ్ చేయగలగడం అతనికి అదనపు అడ్వాంటేజీ. కానీ స్పెషలిస్ట్ ఓపెనర్‌గా పేరున్న రాహుల్‌రే చోటిస్తే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాల్సి రావొచ్చు. అదే స్థానంలో ఆడుతున్న రోహిత్ నాలుగో స్థానంలో ఆడేందుకు సంసిద్ధంగా వుంటేనే అవన్నీ సాధ్యమవుతాయి. ఆ లెక్కన కేఎల్ రాహుల్ బెంచికే పరిమితమయ్యే అవకాశం వుంది. రిషబ్‌కు మరిన్ని అవకాశాలు ఇచ్చేందుకే రోహిత్ మొగ్గు చూపే అవకాశాలు న్నాయి. ఎందుకంటే ఈ సిరీస్‌లో ఫెయిల్ అయిన బ్యాట్స్‌మెన్‌లో అతను కూడా ఒకడు కాబట్టి.

జట్లు

ఇండియా : రోహిత్ శర్మ(సి), శిఖర్ ధావన్(వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్(వికెట్ కీపర్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యుజువేంద్ర చాహల్, శార్దుల్ ఠాకూర్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, జయదేవ్ ఉనద్కత్, మొహమ్మద్ సిరాజ్, రిషబ్ పంత్(వికెట్ కీపర్)

శ్రీలంక : సురంగ లక్మల్, ఉపుల్ తరంగ, దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, దసున్ శనక, కుశాల్ పెరీరా, తిసార పెరీరా, జీవన్ మెండిస్, ఇసురు ఉదానా, అకిల దనంజయ, అమిల అపోంసో, నువాన్ ప్రదీప్, దుష్మంత డిసిల్వా

సాయంత్రం 7 గంటలకు జియో స్పోర్ట్స్ డీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



పేస్‌తో ఆడవా?

- అయితే నీ ఇష్టం
- బోపన్నకు ఐటా వార్నింగ్!
- డేవిస్ కప్‌కు లియాండర్ ఎంపిక



న్యూఢిల్లీ: వచ్చే నెల జరగనున్న డేవిస్ కప్ జట్టుకు లియాండర్‌ను ఐటా ఎంపిక చేసింది. దీంతో పేస్‌తో ఆడేందుకు సంసిద్ధంగా లేని రోహన్ బోపన్నకు ఐటా పరోక్షంగా హెచ్చరిక చేసింది. సెలెక్షన్ విషయాల్లో అనవసర జోక్యం అనవసరమని చెప్పకనే చెప్పింది. దీంతో డేవిస్ కప్‌లో ఆడాలా, లేదా అన్నది బోపన్నకే వదిలేసినట్టయింది. పేస్, బోపన్న లతో పాటూ యూకి భాంబ్రి, రామ్ కుమార్ రామనాథన్, సుమిత్ నాగల్‌లతో కూడి ఐదుగురు సభ్యుల జట్టును టెన్నిస్ అసోషియేషన్ ప్రకటించింది.

మహేశ్ భూపతి లేఖ

పేస్, బోపన్నల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది అనే విషయం తెలియనిది కాదు. దీన్ని దృష్టిలో పెట్టుకునే భారత నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ కు లేఖ రాసినట్టు సమాచారం. లేఖలో పేస్‌తో కలిసి ఆడేందుకు బోపన్న విముఖంగా వున్నట్టు భూపతి తెలిపాడట! అయితే అవన్నీ పట్టించుకోకుండా సెలెక్షన్ కమిటీ ఇద్దరినీ ఎంపిక చేసింది.

లండన్ ఒలింపిక్స్ నుంచీ ఇదే కథ

2012 లండన్ ఒలింపిక్స్ బోపన్న, పేస్‌ల మధ్య వైరుధ్యానికి బహిరంగ వేదికగా నిలిచింది. పేస్‌తో కలిసి ఆడేందుకు అప్పుడే బోపన్న తొలిసారి నిరాకరించాడు. తర్వాత అతని స్థానం లో భూపతిని ఎంపిక చేశారు. అదే ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో పేస్‌తో కలిసి ఆడిన సానియా.. పేస్‌ను సముదాయించేందుకు తనను పావుగా వాడుకోవడాన్ని బహిరంగంగా నే విమర్శించింది.

దేశం కోసం ఆడలేరా?

వ్యక్తిగత కారణాలతో దేశం కోసం అవకాశాన్ని వదులుకోవడానికి సిద్ధపడటం మీద ఐటా సీరియస్ అయింది. ''దేశం కోసం ఆడేదే ఏడాదికి రెండు, మూడు మ్యాచులు. వాటికి కూడా మీకు, మీకు మధ్య వున్న వైరుధ్యాల కోసం దూరంగా వుండాలనుకోవడం మంచి పద్ధతి కాదు. దేశం ఇచ్చే గ్రాంట్స్ తీసుకుంటూ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించాలనుకునే వ్యక్తుల మీద చర్యలు తప్పవు. తర్వాత వారిష్టం'' అని ఐటా స్వీట్ వార్నింగ్ ఇచ్చింది. అయితే పేస్ మాత్రం బోపన్నతో కలిసి ఆడేందుకు తనకేమీ ఇబ్బందేమీ లేదని ఇదివరకే తెలిపాడు.

డివిలియర్స్ సెంచరీ

- పోరాడుతున్న ఆసీస్
- రసవత్తరంగా రెండో టెస్టు



పోర్ట్ ఎలిజబెత్‌: దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఆస్ట్రేలియా పోరాడుతోంది. మూడో రోజు ఆటముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసిన కంగారూ జట్టు కేవలం 41 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఉస్మాన్ ఖ్వాజా(75), మిచెల్ మార్ష్(39) పరుగులతో క్రీజులో వున్నారు. 86 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో వున్న ఆసీస్‌కు మార్ష్, ఖ్వాజాలు 87 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని అందించడంతో స్వల్ప ఆధిక్యంలోనైనా నిలవగలిగింది. అంతకుముందు 20 పరుగుల ఆధిక్యంతో మూడో రోజు ఆట ప్రారంభించిన సఫారీలు డివిలియర్స్(126) సెంచరీ సాధించడంతో 139 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. డివిలియర్స్‌కు ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ ఫిలాండర్(36), కేశవ్ మహరాజ్(30)లు చక్కటి సహకారం అందించారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 243/10
సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 382/10
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ 180/5



సెరెనా X వీనస్

ఇండియన్ వెల్స్: టెన్నిస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వీనస్, సెరెనాల మధ్య మ్యాచ్‌కు ఈసారి ఇండియన్ వెల్స్ వేదికకానుంది. టోర్నీ మూడో రౌండ్‌లో ఇద్దరూ తలపడనున్నారు. మాతృత్వపు మధుర క్షణాలు అనుభవించి మళ్లీ కోర్టులో అడుగుపెట్టిన సెరెనా.. పునరాగమనం లో తొలి టోర్నీ లోనే అక్కను ఎదుర్కోనుంది. ఒకానొక సమయంలో సెరెనాకు ఏమాత్రం పోటీనివ్వలేక పోయినా వీనస్ ఈ మధ్య గొప్ప విజయాలు సాధించడం, సెరెనా మునుపటి ఫామ్ ఇంకా దొరకబుచ్చుకునే క్రమంలోనే వుండడంతో ఈ మ్యాచ్ మరింత ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకూ ఈ ఇద్దరూ 28 సార్లు తలపడగా.. సెరెనా 17 సార్లు, వీనస్ 11 సార్లు విజయం సాధించింది. కెరీర్ ఆరంభంలో చెల్లెలిపై వీనస్ ఆధిపత్యం చెలాయించినా.. ఆ తర్వాత సెరెనా మొత్తం మహిళా టెన్నిస్ ప్రపంచం మీదే ఆధిపత్యం చెలాయించింది. చివరిసారిగా వీరిద్దరూ 2017 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో తలపడ్డారు. ఆ మ్యాచ్‌లో సెరెనా విజయం సాధించి కెరీర్ లో 23వ గ్రాండ్ స్లామ్ సాధించి ఓపెన్ ఎరాలో అత్యధిక గ్రాండ్ స్లామ్‌లు సాధించిన మహిళగా చరిత్రకెక్కింది. ఇక అప్పటికే గర్భవతిగా వున్న సెరెనా తర్వాత టెన్నిస్‌కు దూరంగా వుంది. తదనంతరం అక్క వీనస్ తన ఫామ్‌ను కొనసాగిస్తూ 2017 వింబుల్డన్ ఫైనల్‌కు కూడా చేరింది. వీనస్ కూడా లేటు వయసులో ఘాటుగా ఆడుతుండడం ఈ మ్యాచ్‌కు మరింత క్రేజ్‌ను తీసుకువచ్చింది.

14 ఏళ్ల వనవాసం

ఇండియన్ వెల్స్‌కు బహిష్కరిస్తూ విలియమ్స్ సిస్టర్స్ 14 ఏళ్లపాటూ వనవాసం చేయడం మరొక కథ. 2001 ఇండియన్ వెల్స్ టోర్నీలో అక్కాచెల్లెల్లిద్దరూ తలపడాల్సివున్న సెమీఫైనల్ మ్యాచ్ నుంచి వీనస్ తప్పుకుంది. వీనస్ చర్యను తమను మోసం చేయడంగా భావించిన ప్రేక్షకులు ఫైనల్‌లో సెరెనా మీద తీవ్ర స్థాయిలో వ్యతిరేకతను ప్రదర్శించారు. సెరెనా పాయింట్ కోల్పోయిన ప్రతిసారీ పెద్ద ఎత్తున కరతాలధ్వనులు చేయడంతో పాటూ.. విన్నర్ స్పీచ్ ఇచ్చే సమయంలో ఎగతాళి చేశారు. దాంతో అలిగిన విలియమ్స్ సిస్టర్స్ 14 ఏళ్ల పాటూ ఎడారి టోర్నమెంట్‌లో అడుగు పెట్టనేలేదు. ఆ వనవాసానికి 2015లో సెరెనా ఫుల్‌స్టాప్ పెట్టింది. మూడేళ్ల తర్వాత ఇప్పుడు అదే ఈవెంట్ అక్కాచెల్లెళ్ల పోరాటానికి మరోసారి వేదిక కానుంది.



నా వరకూ ఈ మ్యాచ్ ఆడాలనుకోను. మా ఇద్దరిలో కరునిక్రమించాల్సి వస్తుంది. కానీ తప్పదు. అది ఆటలో భాగం- సెరెనా

సెరెనాలో ఏ మార్పూ లేదు. ఎప్పటిలాగే ఆడుతోంది. గ్రేట్ కమ్ బ్యాక్- వీనస్

ఒక అంతర్జాతీయ స్థాయిలో పతకం గెలిస్తే ఏమొస్తుంది? ఎక్కడైనా ఏమో గానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం.. ఇంకా ఇండియాకు రాకముందే ప్రభుత్వం ఎంతో కొంత సాయం ప్రకటిస్తుంది. ఇండియాకు వచ్చీరాగానే సాక్షాత్తూ ముఖ్యమంత్రితో అపాయింట్ మెంట్ దొరుకుతుంది. అప్పటివరకూ ఏ మంత్రో ప్రకటించిన బహుమతికంటే ఎన్నో రెట్లు ఎక్కువ సాయం ముఖ్య మంత్రి ప్రకటిస్తాడు. అదే క్రీడాభివృద్ధి అని సగర్వంగా చెప్పుకుంటాయి ప్రభుత్వాలు. మరి క్రీడాభివృద్ధి అంటే అంతేనా?

గెలిస్తేనే అన్నీనా?





ఆటలో గెలుపు ఓటములు సహజం. గెలుపునీ, ఓటమినీ ఒకేలా తీసుకోవాలి అనికూడా అంటారు. అలా అని రెండిటినీ ఒకేలా తీసుకోగలమా! గెలుపు గెలుపే, ఓటమి ఓటమే. గెలుపిచ్చే కిక్కు వేరు. ఓటమిచ్చే బాధ వేరు. అలాంటిది గెలుపుతో పాటూ కోట్లు, లక్షలు, అకాడెమీలు ఏర్పాటుకు స్థలాలు.. ఇలా ఒకటేమిటి ఒక్క విజయంతో క్రీడాకారుల దశ తిరిగి పోతోంది ఈ మధ్య. దశ తిరగడం అంటే పాశ్చాత్య దేశాల్లోలాగా ఎండోర్స్ మెంట్లు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయని కాదు. ప్రభుత్వాలు తమకు తాముగా పతకాలు తెచ్చిన వాళ్లని డబ్బుల్లో ముంచెత్తుతున్నాయి. ఇక్కడే సమస్య వస్తోంది. ప్రభుత్వాలు క్రీడల అభివృద్ధి కోసం ఆ స్థాయిలో ఖర్చు పెడితే బాగుండు అనిపించేలా ప్రభుత్వ ప్రోత్సాహకాలు వుంటున్నాయి. ఊరూ పేరు ఈ ప్రపంచానికి తెలియని రోజున క్రీడాకారులకు కనీస సహకారం అందించని ప్రభుత్వాలు.. తీరా గెలిచిన తర్వాత, పతకాలు తెచ్చిన తర్వాత వాళ్లను అక్కున చేర్చుకుంటున్నాయి. క్రీడాభివృద్ధి చెయ్యలేం. కావాలంటే మీరు కష్టపడి గెలవండి. తర్వాత అడక్కుండానే అన్నీ ఇస్తాం అనేలా ప్రవర్తిస్తున్నాయి అధికార వర్గాలు. విజయవంతమైన క్రీడాకారులకు ప్రోత్సాహం అందించడమే క్రీడాభివృద్ధి చేయడంలాగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి.



గెలిచిన వాళ్లకి ప్రోత్సాహకాలు వుండాలి. అందులో మరో వాదనకు చోటు లేదు. కానీ విజేతలకు మాత్రమే ప్రోత్సాహకాలు ఇస్తూ పోతూ ముందుతరానికి కనీస సదుపాయాలు అందించకపోతే ఎలా? ప్రభుత్వాలు కేవలం క్రీడాకారుల వాళ్ల నోళ్లుమూయించేందుకు కోట్లు ఇస్తున్నట్లుంది యవ్వారం. అవకాశాలు సృష్టించుకుని తమకు తాము పతకాలు సంపాదించేస్థాయికి చేరుకున్న ఆటగాళ్లు అన్ని రోజులూ తమకు అందని ప్రోత్సాహకాల గురించి మాట్లాడకుండా ఉండేందుకు ఏమేం ఇవ్వాలో అవి ఇస్తున్నట్టు కనిపిస్తోంది.

నిరుద్యోగం పెరుగుతున్న ఈ రోజుల్లో పతకాలు తెచ్చిన వారికి డబ్బులతో పాటూ ప్రభుత్వ ఉద్యోగాలు కూడా ఇవ్వడం మీద ఈ యువత నుంచి వ్యతిరేకత కనిపిస్తోంది. మొన్నామధ్య షట్లర్ సింధుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చినప్పుడు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. అయినా ప్రభుత్వాలు తమ పంథా తమదే అంటున్నాయి. అక్కడ ఎవరికీ సింధు మీద వ్యతిరేకత లేదు. కానీ గెలిచిన వాళ్లకే అన్నీ ఇవ్వడం వారికి రుచించడం లేదు. అన్నిటికంటే దారుణం ఏంటంటే గెలిచిన వాళ్లని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు పోటీపడటం వారిని మరీ కలిచివేస్తోంది. ఒక ముఖ్యమంత్రి కోటి ఇస్తే ఇంకో మంత్రి కోటికి మించి ఇవ్వాలి అనే ప్రవర్తన వారికి రుచించడంలేదు. ఇచ్చిన వారికే మళ్లీ మళ్లీ ఇచ్చేందుకు, ప్రతి ప్రభుత్వమూ గెలిచిన వారిని తమవాడిగా ప్రకటించుకునే ప్రయత్నం ఏ మాత్రం ఆమోదయోగ్యంగా లేదు.

ఎవరికి ఎంతివ్వాలి?

ఇక క్రీడాకారులను ప్రోత్సహించే విధానం లో కూడా ఒక నిర్దిష్టమైన విధానం లేదు. గెలుపు స్థాయిని బట్టి గౌరవించడం లేదు. కేవలం పతకం ఏ రోజు వచ్చింది, సదరు వార్తకు మీడియాలో ఏ స్థాయి కవరేజీ దక్కింది, ఆ రోజున్న పాలకులు ఏపాటి సాయం చెయ్యాలను కుంటున్నారు లాంటి అనేక విషయాల మీద ఈ గెలిచిన క్రీడాకారులకు అందే ప్రోత్సాహాలు ఉంటున్నాయి. ఇలాంటి ధోరణి ప్రజల్లోనే గాక సాటి క్రీడాకారుల్లోనే అసంతృప్తిని కలిగిస్తోంది. విజయాల స్థాయిని బట్టి ఖేల్ రత్న, అర్జున అవార్డులు అందించే విధానం కేంద్రంలో వుంది. కానీ అలాంటి విధానాలు రాష్ట్రాలు అందించే ప్రోత్సాహాలకు లేవు.

వరాలన్నీ తీరుస్తున్నారా?

కోటి రూపాయలు ఇస్తాం, రెండు కోట్లిస్తాం అని చెప్పుకునే ప్రభుత్వాలు కొన్ని సార్లు చేసిన వాగ్దానాల్ని మరిచిపోతుంటాయి. అప్పట్లో సైనా నెహ్వాల్ తనకు ఇస్తామన్న 50 లక్షల రూపాయల ప్రోత్సాహకం ఇంకెప్పుడిస్తారు అంటూ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించింది. సైనా లాంటి స్టార్ నోరు తెరిచేసరికి ప్రభుత్వాలు వెంటనే దిగివచ్చాయి. కానీ మిగిలిన వాళ్ల పరిస్థితి ఏంటనేది ప్రభుత్వాలకే తెలియాలి.

క్రీడా విధానాలు

2017-22 కు గానూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం క్రీడా విధానాన్ని తీసుకొచ్చింది. ఆ విధానం ప్రకారం ప్రతి నియోజక వర్గానికి ఒక క్రీడా వికాస కేంద్రం వుండాలి. ఆ మధ్య నియోజక వర్గానికి రూ.2 కోట్ల రూపాయలు విడుదల చేయడం కూడా జరిగింది. అట్లానే ప్రతి గ్రామంలోనూ ఒక విలేజ్ స్పోర్ట్స్ వాలంటీర్‌ను అందుబాటులో వుంచాలనీ, విలేజ్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలని పాలసీలో పేర్కొన్నారు. ఇవే గాక కోచ్ డెవలప్‌మెంట్, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు లాంటి అంశాలెన్నో ఆ పాలసీలో వున్నాయి.

కానీ ఈ అంశాలన్నిటి కంటే ప్రజల దృష్టికి ప్రోత్సాహకాలు మాత్రమే వస్తున్నాయి. మిగిలిన అంశాల మీద పూర్తి స్థాయిలో ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం వుంది.

ఆంధ్ర ప్రదేశ్‌లాగే ఒక క్రీడా విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకురావాలనే ఆలోచనలో వున్నా ఆచరణలో పురోభివృద్ధి కనిపించడం లేదు.

ఇక కేంద్రంలో అయితే ఎప్పుడో 2001లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీనే ఇంకా కొనసాగుతోంది. ఇప్పుడు మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరివున్న తరుణంలో మారుతున్న కాలానికి తగ్గట్టు దేశంలో మరోసారి క్రీడావృద్ధిని కొత్తపుంతలు తొక్కించేందుకు కొత్త పాలసీ తీసుకురావాల్సిన వుంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.